ఆంధ్ర సచిత్ర వారపత్రిక


10-9-82
150 పైసలు





‘ప్రళయ రుద్రుడు’లో కృష్ణంరాజు, జయప్రద


VIMAL
A RELIANCE PRODUCT



తెలుగు సంస్కృతి

"నటి మేనక" ముఖచిత్రం తెలుగు సంస్కృతికి అనుగుణంగా ఉంది.

బళ్ళారి మహమ్మద్ సలీమ్ (గుత్తి)

సర్దుబాటు

'సర్దుబాటు' కథ వాస్తవానికి దగ్గరగా వుంది. అందం వున్నా కట్నం, కానుకలు ఇవ్వలేని పరిస్థితిలో మనసుకు నచ్చిన వరుడు దొరకరన్న విషయం, ఎం. ఎ. డిగ్రీలో ఫస్టు క్లాస్‌లో పాసయినా ఉద్యోగముకోసం రికమెండేషనుగాని, లంచం కట్టడానికి డబ్బు లేకపోయిన ఉద్యోగం దొరకదన్న "నగ్న సత్యం", సర్దుబాటు కథ ద్వారా తెలిసింది.

బి. పాపారావు (భిలాయి)

తెలుగుదనం

నటి శ్రీదేవి (13.8.82) తెలుగుదనాన్ని ఉట్టిపడేలా పోలికించే తెలుగు ఆడపడుచులా ఉన్నది.

ఎందువ సత్యం నాయుడు (ఉనుకూరు)

ఆకర్షణీయం

శ్రీదేవి ముఖచిత్రం అందంగానూ, ఆకర్షణీయంగాను ఉంది. ఈ వారం కథలు అంతగా బాగు లేవు.

తోట జగన్నాథరావు (ఇచ్ఛాపురం)

అందాల నటి

కళకు ప్రాణం పోసి తను జీవిస్తూ, కళను జీవింపచేస్తున్న అందాల నటి 'శ్రీదేవి' ముఖచిత్రంతో వెలువడిన 13.8.82 ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముగ్ధ మనోహరంగా, కోహినూరు వజ్రంనుండి వెలువడే దివ్య కాంతిలాగా మా ముందు అవతరించింది. డి. లక్ష్మణాచార్యగారి కథానిక 'శరన్మేఘం' నేటి వాస్తవాన్ని బద్దలు కొట్టి చెప్పింది.

గుండా సాంబశివరావు (నేలకొండపల్లి)

సంతోషం

శ్రీదేవి ముఖచిత్రంతో(13.8.82)ఈ వారం పత్రిక చూసి సంతోషం పట్టలేక పోయానంటే నమ్మండి.

బి. రాథ, కుమార్, సంధ్య (ఖరగ్‌పూర్)

ఆదర్శం కోసం

నటి మేనక ముఖచిత్రంతో వచ్చిన సంచికలో "ఆదర్శంకోసం" అను కథ నా కెంతగానో నచ్చింది.


బొడ్డు రామకృష్ణారావు (మల్లసరాజుపేట)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938—1972]
శుక్రవారం : 10-9-'82
దుందుభినామ సం. భాద్రపద బ. సప్తమి
సంపుటము 75 : సంచిక 2
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
ఆరు మాసాల చందా రు. 42-90
పోస్టులో ఏడాది చందా రు. 85-80
విడి ప్రతి వెల రు 1-50
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

లోకం పోకడ



న్యూఢిల్లీ లేఖ

డాక్టర్ జయ్ దుభాషి

భక్తి ఎవరి మత్తుమందు ?


కార్ల్ మార్క్స్ పొరబడ్డాడు. మతం అన్నది సామాన్య ప్రజల మత్తుమందు కాదు. అది అభిజాత్యుల అంటే పయి తరగతులవారి మత్తుమందు.


బొంబాయిలో ప్రభాదేవి అనే పేట ఉంది. ఇది అంత సంపన్నమయిన పేట కాదు. ఇక్కడ సిద్ధి వినాయకుడి ఆలయం ఒకటి ఉంది. గుడిలోకి వెళ్ళటానికి పొద్దున నుంచీ జనం వరుసలో నుంచుంటారు. వీరిని చూస్తూ వుండిపోతే సరి. వీరిలో 'సూటూ—బూటూ' కల మగవారూ, సిల్కు చీరలు కట్టే ఆడవారే ఎక్కువగా ఉంటారు. ఆఫీసుకి పోతూ దారిలో దేవుడిని చూసి వెళ్ళటానికి ఆగారన్నమాట. అందరూ హిందువులు కూడా కారు. పొడుగు కోటూ, లక్కపూసిన టోపీతో ఒక పార్శీ పెద్దమనిషి కనిపించాడు; ఆయనతోపాటు షిఫాన్ చీర కట్టుకుని ఉన్న మధ్య వయస్కురాలయిన ఆయన సతీమణి కూడా. కిరస్తానీవారూ వేరే కనిపించారు. వారిలో ఆడవారే అధికం— గౌనులూ, ఎత్తు మడమల పాదరక్షలూ ధరించే వనితల చేతులలో కొబ్బరికాయలు. భక్తుల వరుస చిన్నదేమీకూడా కాదు; కూరగాయల అంగడులు, మిఠాయి కొట్లూ, పాత పత్రికల షాపుల పక్కనుంచి మెలికలు తిరుగుతూ పోతూ ఉంటుంది.

ఇంత పెందలకాడే వీరంతా గుడి బయట ఎందుకు హాజరయినట్టు? అసలు వారిలో ఎందరికి వినాయకుడిని గురించి ఎంత తెలుసు? ఎందరికో ఏవో బాధలు— డాక్టరు నయం చెయ్యలేని నుస్తీతో బాధ పడుతున్న బిడ్డ కలవారూ; పెంకె పెళ్ళాము లేదా ఆకతాయి మొగుడుతో వేగలేనివారూ; పెళ్ళి కానిపిల్ల ఇంట్లో కలవారూ; కాన్సర్‌తో బాధపడే కొడుకు కలవారూ. దేవుడు తప్ప మనకి సాయం చేసే దెవరని అనుకుంటూరు ఇటువంటి వారు. వీరి సంగతి ఇలాగ ఉండగా నిరుద్యోగ భక్తులు చాలామందే ఉంటారు. వీరే ఎక్కువమందేమో కూడాను. ఏది ఏమయితే నేమి, మిగతా ప్రయత్నాలు విఫలమయితే ఇక్కడికి వచ్చేవారు అధికం అని మాత్రం గట్టిగా చెప్పవచ్చు.

దేవుడిని నమ్ముకుని సమస్యలు పరిష్కరించుకోవచ్చు ననుకునే సమాజం ఆరోగ్యంగా ఉందనుకోగలమా? దేవుడు తప్ప ఇంకెవరూ తోడుపడలేని స్థితిలో ఉన్నామా మనం? ప్రభాదేవికి వచ్చే భక్తులకి ఈ ప్రశ్నల తీరు అంత సరిగ్గా లేదనిపించవచ్చు. కాని, వారికి హేతువాదం మీద నమ్మకం తగ్గిందనే అనుకోవాలి, జీవితాన్ని అదుపులో పెట్టటం కష్టమనే భావం పెరిగిందనే అనుకోవాలి, మానవుడు తనకి తానుగా సృష్టించుకున్న సమస్యల పరిష్కారం జరిగేది కాదనిపిస్తోందనుకోవాలి.

మతం ఒకరకం మత్తుమందు. ఇంకా వేరే రకాల మత్తు మందులూ ఉన్నాయి. రాజకీయాలు ఒకరకం, సినిమాలు మరొక రకం. బొంబాయి తీసుకోండి: ఇక్కడ రాజకీయాలన్నవి రాజకీయవాదులకి పరిమితం అయిలేవు. ఇక్కడ అంతా పెద్ద వ్యాపారం. అన్నిటిలో పెద్ద వ్యాపారం రాజకీయాలన్న మాట. శ్రీ అబ్దుల్ రహమాన్ అంతూలే ముఖ్యమంత్రి కాగానే (1980 లో) సిద్ధి వినాయకుడి గుడికి వచ్చారుట. ఇంకా వస్తూనే ఉన్నారుట. [వస్తే 'క్యూ'లో నుంచుంటారనుకోకండి !] ఈ గుడికి వచ్చే జనసమర్దాన్ని చూసి అచ్చెరువు చెంది ఆయన దాని ప్రధాన నిర్వాహకుడిగా తన మనిషిని వేసుకున్నారుట. ఈ మధ్య సినిమా నటి జయాభాదురీ తనపిల్లలతో రాత్రిపూట పూజ చేసుకోవటానికి వస్తోందని వినికిడి. శ్రీమతి గాంధీ బొంబాయి వచ్చి బ్రీచి కాండీ ఆసుపత్రిలో అమితాబ్ బచన్‌ని చూడటానికి వెళ్ళిన రోజునే జయాభాదురీ సిద్ధి వినాయకుడి గుడికి వచ్చినట్లు వార్త. ఆసుపత్రికీ, గుడికీ మధ్య దూరం ఎనిమిది కిలోమీటరులు. బొంబాయిలో ఇదంతా మామూలే. రాజకీయ వాదులు సినిమా





టాప్ స్టార్ ఉన్న
కప్పు ఏది ?
చూడండి, ఇక్కడ
చిక్కని, కమ్మని టీ ఉన్నది
చూడగానే తెలుసుకుంటారు దాని గొప్పదనం
రుచిచూడగానే గ్రహిస్తారు దాని కమ్మదనం
చిక్కదనపు పరీక్ష...చేసి చూడండి...టాప్‌స్టార్ అన్నిటికన్నా మెరుగు...మరే ఇతర టీకన్నా చిక్కనిది — చిక్కదనంలో టాప్, కమ్మదనంలో టాప్.
ఎందుకంటే, ప్రత్యేకమైన భారతీయ తేయాకుల శాలూకు ఘాటైన (స్ట్రాంగ్) సమ్మేళనం నుంచి తయారైంది లిప్టన్ టాప్‌స్టార్... సంతృప్తి నిచ్చే చిక్కని, కమ్మని టీ కోరుకునే వారి కోసం!
500 గ్రా., 250 గ్రా., 100 గ్రా.లలో దొరుకుతుంది.
LIPTON TOP STAR
లిప్టన్
టాప్ స్టార్ టీ
చిక్కదనంలో టాప్, కమ్మదనంలో టాప్
LIPTON

న్యూఢిల్లీ లేఖ

తారలని దర్శనం చేసుకుంటూరు సినిమా తారలు దేవుడిని చూడటానికి వెడతారు. పూజారులు వారినీ వీరినీ కూడా చూస్తూ ఉంటూరు. మత్తుమందు బంధం అంత సంపూర్ణంగా ఉందన్నమాట.

దీనంతటి వెనకాలా రక్షణ లేదనే భయం ఉంది. ఈ భయం మన సమాజాన్ని పీడిస్తోంది. రాజకీయవాదుల భయాలని గురించి వేరే చెప్పనే అక్కరలేదు కనుక శ్రీమతి గాంధీ ఒక తాంత్రికుడి దగ్గర నుంచి మరొక తాంత్రికుడి దగ్గిరికి పరిగెత్తటం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించటంలేదు. ఇది సర్వత్రా కనిపించేదే కదా! శ్రీ అంతూలే మధ్యరాత్రి వినాయకుడి గుడికి వెళ్ళటమూ విశేషం ఏమీకాదు. శ్రీ అంతూలే జీవితంలో నిలకడ అనేది లేకుండాపోయింది అందుకనే నేమో ఆయన బరితెగించిన మనిషి అయిపోయారు. సినిమా ప్రముఖుల భయాల సంగతి సరేసరి. కెమెరాలు తిప్పుతున్నా, యుగళగీతాలు పాడుతున్నా జోతిష్కులు వెంట ఉండవలిసిందే కదా వీరికి? సినిమా వారికీ, రాజకీయ వాదులకీ బాగా కుదురుతుంది. ఎందుకంటే, రెండు వృత్తులూ వినోద ప్రదర్శనలే! రాజకీయ వాదులు నటీనటులే! (నాసిరకం నటీనటులే అయినప్పటికీ.)

అసలు ఈ జనం అంతా ఎందుకింత భయపడుతున్నారు? ఎందుకింత అశాంతి వారిలో? ఎందుకంటే—వారందరూ ఇతరుల మీద జీవించే రకం కాబట్టి, ఇంచుమించు పరువు పోగొట్టుకున్నవారు కాబట్టి. శ్రీ అంతూలే వచ్చి మోసగాడు. ఆయన జనాన్ని దోచుకున్నారు, దోచుకునేది కూడా బహిరంగంగా దోచుకున్నారు. తక్కినవారూ అంతే ఈ మధ్యనే ముడిచమురు లేదా క్రూడ్‌ఆయిల్ బేరం ఒకదానిమీద ఎవరో — ఒకరు కావచ్చు, ఒక బృందం కావచ్చు — కావలసినంత డబ్బు చేసుకున్నారు. అయితే, ఇదొక్కటేకాదు—ఇలాంటివి ఎన్నో ఉంటాయి. కనిపించేది ఇది మాత్రమే, ధాల్ వైషెట్ బేరం తీసుకోండి - ఇందులో కాని ఇంకే దయినా బేరంలోకాని డబ్బులు చేసుకోని రాజకీయ వాదులు ఎంతమంది ఉంటారు?

సామాన్యజనం దృష్టిలో రాజకీయాలు ఒక వింత ఆట ఇందులో జనం తప్ప అందరూ డబ్బు గెలుచుకుంటారు. ఇదంతా పట్టపగలు దోపిడీ అందుచేతనే, రాజకీయ వాదులు హడిలిపోతూ ఉంటారు ఎక్కడ ఏ తిరుగుబాటు లేదా ఉద్యమం వచ్చి తమ పదవులు పోతాయోనని వారి భయం ఇంత లాభసాటి ఉద్యోగాలు పోతే! 1977 లో ఇదొకసారి జరిగింది. 1985 లో మరొకసారి జరుగుతుందా? లేదా ఇంకా ముందే జరుగుతుందా?

ఏమో, ఎవరు చెప్పగలరు? కాని ఇంతలో సినిమా తారలతో, ఇతరులతో కలిసి రాజకీయ వాదులు తాంత్రికులనీ, భగవాన్‌లనీ వెళ్లి దర్శనాలు చేసుకుంటూరు; వీటితోబాటు సిమెంటు, చమురు బేరాలు కుదుర్చుకుని మానవుడు సృష్టించుకునే విపత్తుల బారి నుంచి తప్పించుకుందామనుకుంటూరు.

త్వరలోనే బొంబాయి న్యాయస్థానాలలో ఇటువంటి విపత్తులకి దారితీసే వ్యవహారాల వివరాలు బయట పడగలవు.

పగలని ప్రతిమలో పగిలిన హృదయం

— గుడిసేవ సుందర రామయ్య

"శేఖర్" అంటూ గట్టిగా అరవాలనుకొంది అన్నపూర్ణ. కాని గొంతు పెగల్లేదు.

హృదయాంతరాల్లోంచి ఉబికి వస్తున్న ఉద్రేకం, ఉద్వేగం ఆమె స్వరాన్ని స్వాధీనం చేసుకొన్నాయి.

గొంతునిండా దుఃఖం—

గుండెనిండా వ్యథ—

మండుటెండల్లో వాడిన పువ్వులా మారింది ఆమె వదనం.

చెక్కిళ్ళు ఆ[illegible] వదనాన్ని దాల్చాయి.

పెదాలు చిగురుటాకుల్లా కంపించాయి.

ముక్కుపుటాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

విశాలమైన నేత్రాలు క్షణంలో కన్నీటి కొలనుల్లా మారిపోయాయి.

చేతిలోవున్న వుత్తరాన్ని నేలమీదికి విసిరి మంచంమ్మీద వాలిపోయింది

"పూర్ణా! ఏమైంది?" అంటూ దగ్గరకు వచ్చాడు ఆనందరావు.

భర్తకు గొంతు విప్పి సమాధానం చెప్పే స్థితిలో ఆమె లేదు. తలగడ దిండులో ముఖాన్ని దాచుకొని వెక్కివెక్కి ఏడుస్తూంది.

ఆనందరావు మౌనంగా నేలమీద పడివున్న ఉత్తరాన్ని చేతిలోకి తీసుకొన్నాడు.

'అమ్మకు,

శేఖర్ నమస్కరించి వ్రాయునది. నా వివాహ విషయంలో నీవు తీసుకొన్న నిర్ణయాన్ని నేను ఆమోదించలేకపోతున్నాను. ఈ లోకాన్ని అర్థం చేసుకొనే వయసు నాకు వచ్చినా నీ దృష్టిలో నేను పసివాణ్ణిగానే కన్పిస్తున్నాను. చిన్నప్పుడు ఆడుకోటానికి బజార్లో బొమ్మను కొని యిచ్చినట్లే మేనమామ కూతురు లక్ష్మిని తీసుకువచ్చి నాకు భార్యను చేయాలనుకొంటున్నావు. కాని అమ్మా! బొమ్మకు భార్యకు తేడా వుంది. భావి జీవితాన్ని ఎలా దిద్దుకోవాలో, జీవిత భాగస్వామిని ఎవర్ని ఎన్నుకోవాలో వ్యక్తిగతంగా నిర్ణయించుకొనే శక్తి నాకుంది నా వివాహ విషయంలో నాన్నగారు నాకు ఎలాంటి ఆంక్షలు విధించలేదు. ఎందుచేత? ఆయన మగవారు! నా మనసును అర్థం చేసుకొన్నవారు–నేను మనసారా ప్రేమించిన జయంతిని భార్యగా స్వీకరించాలనుకొంటున్నాను రేపటి వరకు సెలవ్ యిస్తున్నాను నేను ప్రస్తుతం రాజమండ్రిలో బాబాయిగారింట్లో వున్నాను. నీ నిర్ణయం మార్చుకొని రేపు– అంటే ఆదివారం సాయంత్రం లోగా ఫోన్ చేయి! నీ దగ్గర నుండి ఫోన్ రాని పక్షంలో సోమవారంనాడు అన్నవరంలో దేవునిసన్నిధిలో జయంతిని పెళ్ళి చేసుకొంటాను.

— శేఖర్'

ఉత్తరం చదివిన ఆనందరావు దీర్ఘంగా నిట్టూర్చాడు. మెల్లగా వెళ్ళి అన్నపూర్ణ ప్రక్కనే మంచంమ్మీద కూర్చున్నాడు.

"ఇలాంటి క్షణం వస్తుందని నేను భయపడుతూనే వున్నాను పూర్ణా!" అన్నాడు కళ్ళజోడు తీస్తూ.

అన్నపూర్ణలో దుఃఖం మరింత అధికమైంది.

"పూర్ణా! ఏమిటోయ్ మరీ చిన్న పిల్లలా!" లాలనగా అన్నారు.

"అవునండి! చిన్న పిల్లనే! నవమాసాలు మోసి కని పాతికేళ్ళు పైగా పెంచి పెద్ద చేసినా నేను వాడికి తల్లిని కాలేకపోయానండి! నా మాటకు విలువ లేకుండా పోయింది. మీ తండ్రీ కొడుకుల దృష్టిలో నేను చిన్న పిల్లనే!" ఆవేశంగా పల్కింది అన్నపూర్ణ. ఆమె మనసు తీవ్రంగా గాయపడిందన్న విషయం గ్రహించటంచేత ఆమెను ఊరడించటానికి ప్రయత్నించాడు ఆనందరావు.

"చూశావటోయ్ పూర్ణా! నీ కన్నీటికి కాటుక కరిగి చెంపలమీద ఎలా జారుతుందో! చిన్న విషయానికే ఎందుకిలా బాధపడ్తావ్?" అంటూ భుజాన వున్న టవల్‌తో ఆమె కన్నీటిని తుడిచాడు.

"మీకు ప్రతిదీ చిన్న విషయంగానే కన్పిస్తుంది కన్నతల్లికి కొడుకు ఉత్తరం రాసే విధానం యిదేనా? తల్లికి కొడుకు యిచ్చే గౌరవం యిలాంటిదేనా?"

"వాడి మనసులోని విషయాన్ని వాడు చెప్పాడు అయినా తెగేదాకా తీగను లాగకూడదోయ్!"

"అంటే మీ ఉద్దేశ్యం..."

"శేఖర్‌కు లక్ష్మి భార్య అయితే ఈడు జోడు బాగుంటుందని నీవు అనుకోవటంలో తప్పులేదు నీ మనసులోని విషయం వాడికి చెప్పావు. అంతవరకు బాగానే వుంది కాని కాలం మారుతూంది నడుస్తున్న కాలంతో పాటు మనం కూడా కొన్నికొన్ని విషయాల్లో రాజీపడి తదనుగుణంగా అడుగులు వేయక తప్పదు లోగడైతే తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాలను కిక్కురుమనకుండా చేసుకొనే వాళ్ళు పిల్లలు కాని ఇప్పుడు అలా జరగటం లేదు కారణం – ప్రతిఒక్కరు ప్రేమ వలయంలో చిక్కుకుపోతున్నారు ప్రేమించి పెళ్ళి చేసుకొంటే సంసారం సుఖవంతంగా వుంటుందన్న భావన నేటి యువతరంలో పెరిగిపోయింది వీళ్ళలో ఆత్మవిశ్వాసం పెరుగుతూంది స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం మనసు ఉరకలు వేస్తూంది. వీళ్ళ ఊహాజగత్తుకు, ఆశాసౌధాలకు అండగా నిలుస్తున్నాయి నేటి నవలలు, సినిమాలు. ప్రేమబంధం ముందు రక్తబంధం నిలువలేకపోతూంది. అందుకే శేఖర్ ఇలా ప్రవర్తిస్తున్నాడు."

"అందుకని...వాడి పెళ్ళి ఆ జయంతితో జరిపించమంటారా? వీల్లేదు! నేను బ్రతికుండగా అలా జరగటానికి వీల్లేదు!"


"పూర్ణా ! ఏమిటా మూర్ఖత్వం ?"

"ఆఁ ... నాది మూర్ఖత్వమా ? నాకు నచ్చిన పిల్ల నా ఇంటికి కోడలిగా రావాలను కోవటం మూర్ఖత్వమా ? పిల్లల బాగోగులను చూడాల్సిన బాధ్యతను తల్లిగా నిర్వర్తించటం మూర్ఖత్వమా ?"

"కన్నతల్లిగా నీవు పడే ఆవేదనను నేను అర్థం చేసుకొన్నాను. పిల్లలను క్రమశిక్షణతో పెంచి, వంశ గౌరవాన్ని నిలబెట్టే వ్యక్తులుగా తీర్చిదిద్దటానికి ప్రయత్నించటం కన్నవారి బాధ్యత ! ఆ బాధ్యతా నిర్వహణలో ఒక్కోసారి వారి అభిరుచులకు విరుద్ధంగా నడ్చుకోమని శాసించటం వాళ్ళ శ్రేయస్సు దృష్ట్యా అవసరం అవుతుంది కూడా !' అయితే కొంత వయసు వచ్చాక – అంటే వాళ్ళు కూడా తమంత ఎదిగి లోకజ్ఞానాన్ని సంపాదించుకొన్నాక కూడా వాళ్ళను తమ చెప్పుచేతల్లో వుంచుకోవాలని కోరుకోవటం కేవలం అజ్ఞానమే అవుతుంది !"

"అయితే మన కళ్ళెదుటే వాళ్ళు పెడదార్లు పడుతుంటే చూస్తూ వూరుకోవాలంటారా ?"

"అలా అని ఎవరూ సలహా యివ్వరు. వాళ్ళు ఎన్నుకొన్న దారి ప్రతిదీ పెడదారి అని నిర్ధారణ చేసుకొనే ముందు ఆ దారి ఎలాటిందో, వాళ్ళు ఎందుకు ఆ దారిని నడవాలనుకొంటున్నారో వివరంగా తెల్సుకోటం కన్నవారి బాధ్యత ?"



"అయితే వాడు తీసుకొన్న నిర్ణయాన్ని మీరు సమర్థిస్తున్నారా ?"

"భార్యను ఎన్నుకోవటంలో శేఖర్ పొరపాటు పడలేదు. కేవలం బాహ్యమైన ఆకర్షణలకు లొంగిపోయి శేఖర్ ఈ నిర్ణయం తీసుకోలేదు. వాడు మనస్ఫూర్తిగా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. పూర్ణా! ఎవరి మనసులోనైనా ప్రేమ బీజం మొలకెత్తివదంటే అది మొక్కగా పెరిగి శాఖోపశాఖలతో విస్తరించి మహావృక్షమై మనిషిని వశపర్చుకొంటుంది. శేఖర్ మనసులో ప్రేమబీజం మొలకెత్తకపోయి వట్లయితే నీ మాటకు కట్టుబడి లక్ష్మినే పెళ్లి చేసుకొనేవాడు."

"మీకు నా కంటే వాడిమీదే ప్రేమ ఎక్కువ !" ఉక్రోషంగా అంది అన్నపూర్ణ.

"ప్రే...మ...ఎంత విచిత్రమైన పదం ! మాటల్లో వినిపించేది ఎప్పుడూ నిజమైన ప్రేమకాదు. కొన్ని కొన్ని పరిస్థితులదృష్ట్యా మనిషి ప్రేమ అనే పదాన్ని వాడుకొంటూ, తనను తాను మోసగించుకొంటూ ఎదుటి

పగలని ప్రతిమలో...

వారిని మోసగిస్తూ అవసరాలు తీర్చుకొంటున్నాడు ఈ కలియుగంలో. నిజమైన ప్రేమకు నిలయం తియ్యని పలుకులను పలికే పెదవులు కాదు! పది కాలాలపాటు జ్ఞాపకాలను పదిలపర్చగల హృదయం! ఆలయంలోని దేవునిలా హృదయంలోని ప్రేమ ఎంతో పవిత్రమైనది. అది ప్రేయసీ ప్రియుల ప్రేమ కావచ్చు! భార్యాభర్తల ప్రేమ కావచ్చు, మాతృ ప్రేమ కావచ్చు! పితృప్రేమ కావచ్చు! స్నేహితుల ప్రేమ కావచ్చు! హృదయంలో భద్రపర్చబడిన ప్రేమ శాశ్వతమైనది!"

ప్రేమ తత్వాన్ని ఉపన్యాస ధోరణిలో చెప్తున్న భర్తవైపు ఆశ్చర్యంగా చూస్తుండి పోయింది అన్నపూర్ణ.

"వాడి హృదయంలో మనపట్ల ప్రేమ వుంది కాబట్టే మన అనుమతి కోసం ఆ వుత్తరం రాశాడు. తల్లిదండ్రులకు ఆ మాత్రం అవకాశం, గౌరవం కూడా యివ్వకుండా ప్రవర్తించే ప్రబుద్ధులు ఈ కాలంలో కోకొల్లలు! వారందరి కంటే శేఖర్ ఎంతో నయం! ఆలోచించుకోటానికి, మన పెద్దరికం నిలబెట్టుకోటానికి మనకు అవకాశం ఇచ్చాడు!"

"మీరెన్ని చెప్పినా ఈ పెళ్లి నేను ఒప్పుకోను. లక్ష్మిని కోడలిగా చేసుకుంటానని మా వదినకు మాటిచ్చాను!"

"పిచ్చిదానా! వాళ్లకు వాగ్దానం చేసినప్పటి పరిస్థితులు వేరు. అయినా చనిపోయిన వాళ్లకిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకొనే ప్రయత్నంలో బ్రతికున్న వాళ్లకు నరకం సృష్టించకూడదు పూర్ణా!"

"మీ నీతి వాక్యాలను నేను వినదల్చుకో లేదు. శేఖర్‌కు భార్య కావల్సింది లక్ష్మి! జయంతి కాదు!" అంటూ విసురుగా వంట గదిలోకి వెళ్లింది అన్నపూర్ణ.

* * *

ఆ రాత్రి ఆ భార్యాభర్తలిద్దరికీ నిద్ర పట్టలేదు. అన్నపూర్ణ మంచంమీద అసహనంగా అటు ఇటు కదులుతూ పైన తిరుగు

తున్న సీలింగ్ ఫేన్ వైపు చూస్తూండి పోయింది. మధ్య మధ్య పక్కకు తిరిగి కిటికీ లోంచి కన్పిస్తున్న దృశ్యాన్ని చూడసాగింది. కిటికీగుండా చూస్తే ఆనందరావు ఆఫీసుగది కన్పిస్తుంది అక్కడ అతను టేబుల్ లైటు వేసుకొని డైరీలో పేజీలు తిప్పుతున్న దృశ్యం అన్నపూర్ణకు కన్పించింది.

"పాలు తీసుకోండి!" అన్న మాటలు విన్పించగానే రెండు చేతుల మధ్య ముఖాన్ని దాచుకొని ఆలోచిస్తున్న ఆనందరావు తలెత్తి చూశాడు. అన్నపూర్ణను చూడగానే ఎదురుగా వున్న డైరీని మూసి పాలగ్లాసును అందు కొన్నాడు.

అన్నపూర్ణ వెంటనే అక్కణ్ణుంచి వెళ్ళి పోయింది.

నెమ్మదిగా నడిచి వెళ్ళిన ఆమెవైపు కొన్ని క్షణాలు చూస్తుండిపోయాడు ఆనందరావు.

పూర్ణకు తనంటే ఎంత ప్రేమ?

రోజూ పడుకొనే ముందు పాలు త్రాగే అలవాటు తనకుందని అమ్మ పెళ్ళయిన రోజే కోడలితో చెప్పింది. ఆ సంగతి జాగ్రత్తగా గుర్తుంచుకొని పెళ్ళయినదగ్గర్నుంచి ఈ నాటి వరకు తన అలవాటుకు భంగం కల్గ కుండా చూసుకొంటుంది పూర్ణ.

తనంటే ఆమెకు ఎంతో ప్రేమ!

కాని ఆమె అంటే తనకు...?

నిజంగా ప్రేమ వుందా?

హే భగవాన్! తనెంత మోసం చేసు న్నాడు!

లక్ష్మిని చేసుకొంటే రేపు శేఖర్ కూడా జీవితాంతం ఇలానే భార్యను మోసంచేయాల్సి వుంటుంది కదూ! నో... వీల్లేదు... అలా జరగటానికి వీల్లేదు... గబగబా డైరీ తెరిచాడు ఆనందరావు.

*   *   *

"శేఖర్! నేమరా! మీ అమ్మనుమాట్లాడు తున్నాను. నీ ఇష్టప్రకారంగానే జయంతిని చేసుకొందువుగాని. నేను, మీ నాన్నగారు ఈ రోజే బయల్దేరి రాజమండ్రి వస్తున్నాం!..." మర్నాడు వుదయం కొడుక్కి ఫోన్ చేస్తున్న అన్నపూర్ణను చూడగానే ఆనందరావులో ఆశ్చర్యం, ఆనందం కల్గాయి.

రాత్రికి రాత్రే ఆమెలో ఇంతమార్పు రావ టానికి కారణం ఏమిటా? అని ఆలోచిస్తున్న అతనికి వెంటనే ఏదో స్ఫురించి ఆఫీసు గదిలోకి వెళ్ళాడు.

గతరాత్రి తనుతాసిన డైరీని టేబుల్‌మీదనే మర్చిపోయినందుకు తిట్టుకుంటూ పేజీలు త్రిప్పాడు.

"...జీవితంలో ఏదైతే జరగకూడదని నే నింతకాలం దేవుణ్ణి ప్రార్థించానో అదే జరిగింది ఈ వేళ!

తన పట్టుదలను వదలకుండా భీష్మించు క్కూర్చున్న భార్య ఒకప్రక్క—ప్రేమకు బందీ అయి కన్నవారికి దూరం కావటానికి సిద్ధ పడిన కొడుకు మరోప్రక్క—

దాదాపు ముప్ఫయ్ ఏళ్ళ క్రితం ఇదే పరిస్థితి తన తండ్రికి ఎదురైంది.

చరిత్ర పునరావృతం కావటమంటే ఇదేనేమో!

అయితే ఆ నాడు నేను తల్లి మీద వాత్సల్యంతో మనసార ప్రేమించిన రేణుకను దూరం చేసుకొన్నాను.

ఈనాడు శేఖర్ కూడా నాలా తల్లి ప్రేమకు కట్టుబడి వివాహం చేసుకొంటే లక్ష్మి సుఖపడుతుందా?

ఎందుకు సుఖపడదు?

మేనమామ కూతురైన అన్నపూర్ణ ఇంతకాలం సుఖపడలేదా?

నో ... వీల్లేదు ...

మనువు ఒకరితో —

మనసు మరొకరితో—

ఏలా పొత్తు?

ఇంతకాలం గుట్టుగా నా హృదయంలో అంతులేని క్షోభను అనుభవించాను. ఓ డాక్టర్‌ను పెళ్ళాడి రేణుక స్టేట్స్‌కు వెళ్ళి పోయినా ఆమె రూపం నా హృదయంలో చెదరలేదు. ఇప్పటికీ నేను ఆమెను ఆరాధిస్తు న్నాను. ఆమెను చూసే అదృష్టం మళ్ళీ ఎప్పుడు కల్గుతుందా? అని ఎదురు చూస్తు న్నాను.

మనసులో లేని ప్రేమను మాటల్లో కనబరచి ప్రవర్తించటం అన్నపూర్ణను మోసం చేసినట్టు కాదా?


ఇలాంటి క్షోభకు శేఖర్ గురి కాకూడదు!

శేఖర్ వివాహం జయంతితోనే జరగాలి!

ఈ విషయంలో అన్నపూర్ణను ఒప్పించాలి!

పైకి అందంగా కన్పించే ప్రతిమలో పగిలిన హృదయం వుంటుందన్న నిజం అన్నపూర్ణకుతెలిస్తే ఆమెభరించగలదా...?"

ఆ పేజీ నిండా వున్న కన్నీటి గుర్తులు, కాటుక మరకలు ఆనందరావుకు అన్నపూర్ణను గుర్తు చేయటానికి ప్రయత్నించాయి. అంతే! ఆనందరావు గబగబ అన్నపూర్ణ గదిలోకి వెళ్ళాడు



వారఫలం

10-9-1982 శుక్రవారం మొదలు
16-9-1982 గురువారం వరకు

★మేషం : గ్రహ గతిలో కొన్ని మార్పులు రావటం మీకు పర్యానుకూలప్రదం. చాల మందికి వ్యాపారంలో అనుకూలత, ఆదాయం, ఒకవేళ కళారంగాన వ్యాపకం ఉంటే లాభదాయకమే. రచనా వ్యాసంగంలో సత్ఫలితం సంభవం. స్త్రీలకు : శ్రమ కొద్దీ ఫలితం కళాసాహితీ వైజ్ఞానిక రంగాలందు సంభవం.

★వృషభం : మీకు వ్యాపారంలో, రాజకీయ రంగాన ఒక వేళ గ్రామ పెద్దరికంలో పోటీ హెచ్చుతుంది. విలువగల వస్తు సేకరణ కొందరి విషయంలో చెప్పదగిన అంశం. కొందరకు విదేశ పయాణానుకూలతకు అవకాశం గల వారం. స్త్రీలకు : బంధువులయింట శుభకార్య కార్యభారం ఉంటుంది.

★మిధునం : విలువ గల వస్తువులు సేకరించ గలరు. విలువగల వస్తువుల క్రయ విక్రయము లలో అధికంగా లాభార్జన చేయగలరు. పత్రికా ప్రకటనమైతే మంచి పేరు తెచ్చికొనే అవకాశం ఉండగలదు. అధికంగా వ్యయభారం మోయవలసి ఉంటుంది. స్త్రీలకు : కుటుంబానందం, వైజ్ఞానిక రంగంలో పేరు తెచ్చుకొనే అవకాశం గలదు.

★కర్కాటకం: మీ అదృష్టమునకు మీరే బాధ్యులు. శ్రమిస్తేనే ఫలితం. శ్రమకొలది ఆదాయం. అనేక అవకాశా లుంటాయి. గ్రహించి సద్వినియోగం చేసికోండి. గ్రంధకర్తృత్వానికి కొందరకు అవకాశాలుంటాయి. స్త్రీలకు :ప్రత్యేకంగా ఉద్యోగరంగాన, కొందరకు వ్యవహార రంగాన ఏదో అనూహ్యమైన మేలు జరుగనున్నది.

★సింహం : ప్రణాళికానుసారం, క్రమబద్ధంగా జరిపే మీ కార్యక్రమానికి అంతరాయాలు రాగలవు. ఆశించినధనం సమయానికి అందదు. అందువలన చికాకులు ఏర్పడటం సహజం. స్త్రీలకు. :కుటుంబంలో సంతోషకరమైన పరిస్థితులుంటాయి.

★కన్య . అధికంగా శ్రమిస్తారు. అందుకు తగిన ఫలితం అందుకొంటారు. కొందరకు రచనా వ్యాసంగంలో సత్ఫలితము లుండగలవు. కొందరకు నూతన విషయ సేకరణకు అవకాశం గలదు. కొందరకు రాజకీయ రంగాన మంచి ఫలితం లభించగలదు. స్త్రీలకు : నగలు, నూతన వస్తు సేకరణకు అవకాశం, నూతన మిత్ర సమాగమానికి అవకాశం గల వారం.

★తుల : ఈ రాశి జాతకులు, రాజకీయరంగాన ప్రకాశించుటకు ఏమాత్రం వీలు లేదు. మరీ ఈ వారం సాధ్యపడదు. వర్తకులుగా చెలామణి అయ్యే వారికి లాభదాయక వారం గాదు. స్త్రీలకు : కుటుంబ చిక్కులు, కలహాలు, పనులకు విఘ్నాలు చెప్పదగిన అంశాలు.

★వృశ్చికం : దూర బంధువులనుండి శుభవార్తా శ్రవణం. నూతన విషయాలు గ్రహించటం, నూతన వస్తువులు కొనుగోలుచేయుటకు అవకాశం, ఎలాంటి పరిస్థితులలోకూడా ఇబ్బంది లేకపోవటం గ్రహించాలి. స్త్రీలకు: కళారంగంలో, గృహ కార్యాలలో తమ ప్రజ్ఞా ప్రాభవాలు రాణించటం జరుగుతుంది.


★ధనుస్సు : మీ యింట శుభం జరిగే అవకాశం, మీ స్థిరాస్థిని గూర్చిన వ్యవహారాలు, మీ కార్యకలాపాలలో అనుకూలత చేకూరుటకు అవకాశం గల వారం. స్త్రీలకు : వస్తు వాహనాలు సమకూర్చుకొనుటకు అవకాశ మున్నది.

★మకరం . రాజకీయ జీవితమున శ్రద్ధ గల వారికి, నేర్పరితనముగల వారికి మేలు సంక్రమించెడి వారం. అయినవారి సంబంధాన్ని గూర్చిన చర్చ లుండుట గమనించగలరు. వ్యాపారాభివృద్ధి సూచక వారం. స్త్రీలకు : వస్తు వాహనాలు ఏర్పరచుకొనుటకు అవకాశం ఉంటుంది.

★కుంభం : రంగస్థలిలో, పౌరాణిక రంగాన, రచనా విధాన నేర్పు గల వారికి సదవకాశాలున్నాయి. నూతనంగా కొన్నివస్తువులు సమకూర్చుకో గలుగుతారు. బంధు వర్గీయుల సహాయాన్ని అపేక్షించి ఏదో వ్యవహారంలో మేలు పొందుతారు. స్త్రీలకు : వ్యాపారంలో, ఉద్యోగ వృత్తులందు ప్రగతి గల వారం.

★మీనం : ముఖ్యంగా వ్యాపారం చేసేవారికి సర్వానుకూలత గల వారం. పోయిన వస్తువులు దొరకటం చేత ఆనందం చేకూర గలవారం. స్త్రీలకు : అభ్యుదయ భావాలు గల వారికి సంతోషానందా లుండ గలవు. ధన లబ్ధి గల వారమే. గ్రహించి శ్రమించండి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి*


The fragrance of choice coconuts in every drop.
Yendelux
coconut oil
ఎన్‌డిలక్స్
కొబ్బరి నూనె
15, 4 కిలో టిన్నులందును
1 Litre 500, 200 ml
పాలిథీన్ శీసాలయందును లభించును
ము. ము. నాగలింగ నాడార్ సన్స్
ప్రొప్రయిటర్లు: శ్రీ నాగలింగ విలాన్ ఆయిల్ మిల్స్ కొల్లం-కేరళ
ఫోన్: ఆఫీస్: 2244, 4484, మిల్లు: 2266, 4611.

సీరియల్

కాలం కరిగాక

వలివేటి నాగచంద్రావతి

చెప్పినట్టుగా ఇంటికి చేరుకుంటూనే డబ్బు పంపే శాడు. అలా ఒకసారి కాదు సుమారు మూడు నెలలపాటు మురళి రాసినప్పుడల్లా దాదాపు పదివేల దాకా పంపించి వుంటాడేమో !

"డబ్బుకి శని పట్టింది" అని తనలో తనే గొణుక్కునేది తప్ప "ఒద్దు" అని కామేశ్వరి అడ్డు పడలేదు.

ఇద్దరి ఆలోచన ఒకటే.

'భగవంతుడు దయదలచి ఈ గండం గడిచిపోతే అంతేచాలు,' అని.

ఉహు. దేవుడు మా మాట వినిపించుకోలేదు. అప్పుడప్పుడు న్యాయం నిద్రలేస్తుందనటానికి నిదర్శ నంగా మా వాడి ఉద్యోగం ఊడిపోయింది. ఆఖరికి మేము ఖర్చు చేసిందంతా ఫలితం లేనిదానికి పెట్టుబడి పెట్టడమే అయింది.

ఆరోజంతా బాధతో మనసంతా కలగిపోయింది. తమకంటే ఇంకెంతో తీవ్ర విఘాతమయి వుంటుంది మురళికి. ఇంకెంత నిరాశ నిస్పృహలకు లోనవుతాడో! ఇంట్లో ఇంకెంత రాపిడికి గురవుతాడో — ఇంకెంత నరకాన్ని చవిచూస్తాడో, ఇంకెంత దిగజారిపోతాడో... తలుచుకుంటే హృదయం తల్లడిల్లిపోయింది.

అదేమో వాడికొచ్చే ఆపదలు ఎప్పుడూ తలకు మించినవే అయివుంటున్నాయి.

దెబ్బ తగలకుండా ముందు జాగ్రత్త తీసుకో వటం చేత కాలేదు. పోనీ తగిలాకనన్నా మందు రాసి మానుపట్టే విధం చూడాలి కదా !

"బ్రతుకు దారిలో ఇటువంటి చేదు అనుభవాల

(గత సంచిక తరువాయి)

ఎదురుదెబ్బలే మనిషికి జాగ్రత్తనీ, మంచీ చెడూ విజ్ఞతనీ అలవరుస్తాయనీ, ఈ కుదుపులకే చతికిల పడక నిలదొక్కుకుంటూ ముందుకు అడుగు వేయ్య టమే ధీమంతుల లక్షణమనీ" మురళికి ఉత్తరం రాశాడు.

పై వాళ్ళలా సానుభూతి చూపి ఊరుకోవటం ఎలాగ ? తను కన్నతండ్రి. చేయూత నివ్వాలి.

ముఖ్యమైన మందులూ, కొంత అవసర సరం జామా కొని ఆ వూరిలోనే స్వంతంగా ప్రాక్టీసు పెట్టుకోమని, టౌన్‌లో వుండే పోటీ వుండదు గనక లాభసాటిగా వుండొచ్చుననీ సలహా ఇస్తూ అయిదు వేల రూపాయలు కూడా పంపాడు.

దానికి మురళి దగ్గర్నించి జవాబు వచ్చింది.

"ఇప్పుడు వుంటున్న వూరిలో గవర్నమెంటు ఆసుపత్రి వున్నది. కొత్తగా చార్జి తీసుకొన్న డాక్టరు వున్నాడు. పల్లెపట్టు ప్రజలకి డబ్బు ప్రాణంతో సమానం. వాళ్ళు ఉచితంగా దొరికే వైద్యానికే ఎగబడతారు గానీ, ఫీజు అడిగే తన దగ్గరికి ఓ పట్టాన రారు. అంచేత ఈ వూరికి పది మైళ్ల దూరాన వున్న మరో గ్రామానికి వెడుతున్నాము" అని రాశాడు.

'అదే మంచిది.' అప్రథ చెలరేగి గౌరవం తగ్గిన స్థలాన్ని విడవటమే మంచిది. 'శుభం' అనుకున్నాడు.

కానీ అలాగ వాడి సమస్య తనదే అనుకుని తలమీద వేసుకుని పరిష్కారం చూపించటమే పెద్ద ముప్పయింది చివరికి.

అక్కడితో వాడికో త్రోవ ఏర్పడింది కదా అని తెలిగ్గా వూపిరి పీల్చేందుకు లేకుండా చీటికీ మాటికీ మురళి నించి అభ్యర్థనలు — "గడవటంలేదు వంద పంపండి — రెండొందలు పంపండి." అంటూ ఏవేవో అవసరాలు ఏకరువుపెడుతో, ఖర్చుకు సంజాయిషీలు చెబుతూ వేడుకోలుగా రాసేవాడు.

పోన్లే. ప్రాక్టీసు కొత్త; రాబడి అందుకోలేదు; పిల్లలున్నారు — ఏం ఇబ్బంది పడతారో అని జాలి తలిస్తే, ఆ జాలి విలువ నెలాఖరుకి లెక్క చూసు కుంటే వెయ్యికి దాటింది.

తల తిరిగిపోయింది.

మురళి అవినీతికి పాల్పడ్డానికి కారణం తనకు అప్పుడు ప్రాక్టికల్‌గా విశదపడింది. ఈ దూబరాతనం వలనే నిన్నగాక మొన్న గట్టి దెబ్బతిని నోటి దగ్గర కూడు పడగొట్టుకున్నా వీళ్లకింకా బుద్ధి రాలేదంటే ఏమనుకోవాలె ?

అసలు ఆ కష్టం తెలిసి రానీకుండా అడిగి నంతా పంపటం తనదే తప్పు.

అప్పట్నించీ వంద పంపమన్నప్పుడు పాతికే పంపేడు — అదీ పొదుపు గురించి వంద పాఠాలూ, మరో వంద చివాట్లతోసహా.

ఈసారి మురళి నించి కాక ఉత్తరాల దాడి సోఫియా నించి మొదలయింది.

అదీ ఎలాగ—? తమ దగ్గరేదో దాచిపెట్టినట్టు దాష్టీకంగా — తమది తమ కివ్వటానికి మేమేదో ఏడ్చిపోతున్నట్టు నిష్ఠూరంగా, "మమ్మల్నేమయి పొమ్మన్నారు ? ముష్టి వేస్తున్నట్టు విదుపుతా రేమిటి ?" అంటూ.

గృహప్రవేశంనాడే అధికారం చెలాయించబోయిన కొత్త కోడలిమీద ఓపిక ఉడగని అత్తగారికి రావలిసి నంత ఆగ్రహం వచ్చింది తనకి.

వెంటనే, "నీ సంసారం సాకే బాధ్యత నాదికాదు. ఇకనుండి నెలకు మూడొందలకన్న ఎక్కువ పంపేదిలేదు. ఈమాత్రంగానన్నా ఆదుకుంటున్నందుకు సంతోషించండి." అని కాస్త కరుగ్గానే సమాధానం రాసి పడేశేడు.

అంతే. వాళ్లదగ్గర్నించీ ఉత్తరాలు బంద్ అయ్యాయి.

అయిదారు నెలలు గడిచేయి.

ఇంతలో వసంత వివాహానికి లగ్నాలు నిర్ణయించు కోవటం జరిగింది. ఆ సంగతి తెలుపుతూ మురళిని వారం రోజులు ముందుగా పెళ్ళికి రమ్మని రాశాడు నెల్రకితం. 'నువ్వొక్కడివే సుమా !' అని హెచ్చ రించటం మరువలేదు.

నాలుగు రోజుల అనంతరం తన జాబుకి జవాబు రాశాడు మురళి. "చెల్లాయి పెళ్లికి నేను రావటం కంటే రాకపోవటమే క్షేమమేమో. మరోలా అనుకోవద్దు. నాపరిస్థితి మీకు తెలీదు. క్షమించండి" అంటూ.

అది చూశాక, 'పిల్లల్ని కనగలం కానీ వారి రాతల్ని కనలేం' అన్న సత్యం తెలిసినా స్థైర్యం తెచ్చుకోవటం చాతనవలేదు తమకి. అప్పుడప్పుడూ

జరిగిన కథ_14 : కేశవరావ్, కామేశ్వరమ్మగార్ల ఏకైక పుత్రుడు మురళి — రంగనాధం, రాజ్యలక్షమ్మగార్ల ఆఖరి సంతానం మీనాక్షిని మాయమాటలతో మోసపుచ్చి తన కోర్కెను తీర్చుకొంటాడు. గర్భం పోగొట్టటానికి చేయించిన నాటు వైద్యం మీనాక్షి ప్రాణాల్ని హరిస్తుంది. రంగారావుగారి ఏకైక పుత్రిక హిమబిందు మనసులో స్థానాన్ని సంపాయిస్తాడు మురళి. ఫ్రెండ్ రామకృష్ణ స్కూటర్‌మీద ఎక్కి అతన్ని ఆనుకొని కూర్చున్న బిందును చూసిన మురళి ఆమెను తీవ్రంగా విమర్శిస్తాడు. ఆ తరువాత వారిద్దరు విడిపోతారు. మురళి ఓ పల్లెటూర్లో గవర్నమెంట్ డాక్టర్‌గా పనిచేస్తుంటాడు. వయసు తాకిడికి తట్టుకోలేక అక్కడే నర్స్‌గా పనిచేస్తున్న సోఫియాతో కోర్కెలు తీర్చుకుందామనే దురుద్దేశంతో పొత్తు పెట్టుకొంటాడు. సోఫియా మరో ఉద్దేశ్యంతో అతనికి తన సర్వస్వాన్ని అర్పించడమే కాకుండా ప్రచారం కూడా చేస్తుంది. రౌడీగా చలామణీ అవుతున్న అన్న థామస్‌కు తన పథకం వివరిస్తుంది. సోఫియాని వదిలించుకొనే వీలులేక అమ్మ దగ్గరకు పారిపోతున్న మురళిని అడ్డుకొని జరుగవలసిన తతంగమంతా జరిపిస్తాడు థామస్. ఇక చేసేదిలేక ఓ మారుమూల ప్రాంతానికి ఒదిలీ చేయించు కొంటాడు మురళి. విషయాలన్నీ కేశవరావ్‌గారి ద్వారా విన్న కామేశ్వరమ్మ లోలోపలే మధన పడుతుంది. మురళి చెల్లెలు వసంతలక్ష్మి పెళ్లి ఏర్పాట్లు జరుగుతుంటాయి. సుబ్బాయమ్మ మురళి వ్యవహారాన్ని కూపీ లాగటానికి ప్రయత్నిస్తుంటుంది. మామూలుగా జరిగినదానికి కొంత కల్పితం చేసి చెప్పి ఆమెను తాత్కాలికంగా శాంతపరుస్తుంది కామేశ్వరమ్మ. మురళిపై వున్న కేసును పోగొట్టుకోవడానికి కొంత డబ్బు ఇచ్చి, మిగతాది యం. ఓ చేస్తాడని చెప్పివస్తాడు కేశవరావ్.

ఎవరూ చూడకుండా కళ్ళొత్తుకుంటూనే వుంది కామేశ్వరి. డీలా పడిపోతూనే వున్నాడు తను.

* * *

"ఏమిటండోయ్ బావగారూ ! మేలుకునే కలలు కంటున్నారేమిటి ?" అంటో కాబోయే వియ్యంకుడు చిదంబరంగారు మేలమాడుతూ పలకరించేసరికి ఈ లోకంలోకి వచ్చారు కేశవరావుగారు.

"ఏం చెయ్యమంటావయ్యా మరి ? కన్ను మూసే సావకాశం వుంటంలేదు," అని చనువుగా నవ్వి, "కూర్చో" అంటో తను కూచున్న అరుగు మీద పక్కంటే చోటిస్తూ కొద్దిగా జరిగారు.

చిదంబరం భుజాన ఉన్న కండువా మడత చెదరకుండా తీసి పక్కన పెట్టుకుని కూర్చుంటూ, "అంతమంది నౌకర్లనీ గుమస్తాలనీ దాటుకుని నిద్ర కూడా పోనీకుండా నీదాకా వస్తున్న పనులేవిటయ్యా మరీనూ— రొప్పటం తప్ప..." అన్నారు నవ్వుతూ.

తనూ నవ్వేస్తూ, "మగపిల్లాడి తండ్రివి. మేము పెట్టేవన్నీ మెక్కి నువ్వు రొప్పాలి గానీ చప్పిడి మెతుకుల వాణ్ణి నేను కాదయ్యా," అన్నారు కేశవరావుగారు.

వీళ్ళిలా వేళాకోళాలాడుకుంటూనే ఉన్నారు; ఇలా వియ్యంకుడు వచ్చాడన్న వార్త వంటింటో పాలు తోడు పెడుతున్న కామేశ్వరమ్మకు ఎవరో అందించారు.

దోపిన కుచ్చెళ్ళు జారవిడిచి చేతులు కొంగుకి తుడుచుకుంటూ ఆదరాబాదరా ఆహ్వాన సంఘ సభ్యురాల్లా ముందు వాకిట్లోకి వచ్చేసింది.

భర్త సరసన ఉత్త అరుగు మీద కూర్చున్న వియ్యంకుణ్ణి చూసి, అభిమాన నటుడున్న వాల్‌పోస్టర్ని నేలకేసి మట్టగిస్తుంటె ఆ అపచారాన్ని చూసి సహించలేని అభిమానిలా లబలబలాడుతూ "అయ్యో రామా ! అయన్ని ఆ అరుగు మీదేనటండీ కూర్చో పెట్టేదీ ? లోపలికి తీసుకురావద్దూ ? ఇంకెప్పు డొస్తుందండీ వివరం —" అంటో భర్త మీద చిరాకు పడిపోయింది.

ఆవిడ హంగామాకి నవ్వేస్తూ, "నాకు అతిథి మర్యాద లేవిటమ్మా చెల్లమ్మా! మీకు నేను కొత్తవాణ్ణా ? వంటింటోదాకా వచ్చేసి గిన్నెలో కాఫీ వంచుకు తాగినవాణ్ణి కానూ" అన్నారు చిదంబరం గారు భోళాగా.

అంతక్రితమే లేచి కూర్చున్న పార్వతీశంగారు అందుకుని, "అలా అనుకునే మావాడు మిమ్మల్ని సరసన కూర్చోబెట్టుకున్నాడు. మీ చెల్లెలే మిమ్మల్ని పరాయి చేస్తోంది — పరువులూ బాలీసులూ వెయ్యమని" అంటో గడుసుగా చమత్కారంతో తమ్ముడి పొరపాటు చర్యని సరిపుచ్చారు.

"అమ్మమ్మా ! ఆ వంకన మాకు జరగాలిసిన సత్కారాలకి ఎగనామం పెడదామనిలెండి మా బావ గారి ఎత్తు. అది సాగనీకుండా ముందు జాగ్రత్త తీసుకుంటోంది మా చెల్లెలు. అంతేకదమ్మా ?" అంటో కామేశ్వరమ్మని వెనకేసుకొచ్చారు చిదంబరం గారు.

కామేశ్వరమ్మ కూడా చిన్నగా నవ్వి, "అవునన్నయ్యా ! మీరు మెత్తమెత్తగా వుంటున్నారు గదా అని కాఫీ ఫలహారాల ఖర్చన్నా లేకుండా బయటే కూర్చోపెట్టి మాటాడేసి ఇటునించి ఇటే పంపిం చెయ్యాలని చూస్తున్నారు మీ బావగారు. మీరు లోపలికి వచ్చెయ్యండి. ఫలహారం తీసుకుందురుగాని." అని చెప్పి లోపలికి వెళ్లిపోయింది.

వియ్యంకులిద్దరూ ముందు హాల్లోకి వచ్చి కూర్చున్నారు. కామేశ్వరమ్మ పెట్టి వెళ్లిన ఫలహారం ఆరగిస్తూ సావధానంగా కబుర్లలో పడ్డారు.

* * *

చిదంబరంగారి స్వగ్రామం ఒక పల్లెటూరు. వారికక్కడ భూములూ గట్రా పెద్ద ఆస్తి వుండేది ఒకప్పుడు.

చిదంబరంగారికి అయిదేళ్ల వయసున్నప్పుడు ఆయన తాతగారి దుర్వ్యసనాలవల్ల ఆస్తంతా అప్పుల పాలయి వాళ్ళ వీధిపాలయ్యేరు.

ఒకపక్క ఉన్నవన్నీ వేలాం వేస్తూంటే పాషాణం మింగి బ్రతుకు ఆఖరు చేసుకున్నాడు తాతగారు.



కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతి కించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

కాలం కరిగాక

రంగస్థలం మీది పాత్రధారికి పార్టవ్ తప్పాస్తే అర్ధాంతరంగా తెర దింపించేసినట్టు నిలదీస్తున్న కొడుకు చూపులనించీ, హేళన చేస్తున్న లోకం దృష్టులనించీ అలా తప్పుకుపోయాడాయన.

నిండా పాతికేళ్ళుకూడా లేని ఆ లేతవయస్సులో అలా నిస్సహాయంగా నిరాధారంగా పయిమీద బట్టతో తన్నే ఆశ్రయించుకున్న ఆలుబిడ్డలతో నిలబడి పోయిన చిదంబరంగారి తండ్రికి ఆ సమయంలో ఆ స్థితిలో మొక్కవోని గుండె స్థయిర్యమొక్కటే బాసట అయింది.

ఎవరేమనుకుని పోతారో అని తప్పని సరిగా చెయ్యి అందించబోయిన అయిన వాళ్ళ సాయాన్ని ఆపేక్షించలేదు. వూళ్ళోవాళ్ళ చులకనగా ఒకనాడు నీకింద పదిమంది. ఈనాడు మాకింద పదిమందిలో నువ్వొకడివి అన్నట్టుగా బ్రతకడానికి ఏవో హీన మార్గాలు సూచించబోయినా అంగీకరించలేదు.

గత వైభవం తెలిసినచోట గంజితాగి పరువు పోగొట్టుకునే కంటే నువ్వెవరివో ఎరుగనిచోట పస్తులుండి అభిమానం నిలుపుకోటం మేలు అనుకున్నాడు. ఈ బస్తీకొచ్చి పడ్డాడు.

కంట్రాక్టర్లలో తగుమనిషిగా 'ఫలాని రామయ్య గారంటే ఆయనే' అని అక్కడ గుర్తింపబడటానికి ముందు ఎన్నెన్ని అవస్థలు పడ్డాడో ఆ భగవంతుడికే ఎరుక.

ఆ పాట్లే ఆయన గుండెని కరుకుదేలించేయి. సాధించుకున్న విజయం ఎంతటివాళ్ళనయినా సరే "మీ మొహం నాకు తెలిసినంత మీకేం తెలుసు?" అని తీసి పారెయ్యగల రాజసాన్ని పెంచేయి.

ఇంటగానీ బయటగానీ తనకు వ్యతిరేకత సహించదు. ముఖ్యంగా ఆ ఇంట్లో– తనకి డెబ్బయి ఏళ్ళు వచ్చేయి– కడుపున పుట్టిన కొడుక్కి దాదాపు ఏభయి ఏళ్ళు వచ్చాయి– ఇప్పటికీ అంతా ఆయన పెత్తనమే. ఆయన నోరు చేసుకుంటే ఒక్కళ్ళు కిక్కురు మనరు.

ఇల్లు నిలబెట్టిన వాడన్న గౌరవం, పూచిక పుల్లదేకీలూ ఆయన స్వార్జితమే అయివుంటం, పెద్దవాడన్న మర్యాద– ఇవన్నీ లోపల పన్జేస్తూ వుంటవేమో ఎవ్వరూ ఆయన మాటకు ఎదురాడరు.

ఆయన నియంతృత్వం సహించటం కష్టం గానే ఉన్నా లోపల విసుక్కుంటూనే, లోలోపల పళ్ళు నూరుకుంటూనే పై కారణాలవల్ల ఆయన శాసనానికి తలవంచుతుంటారు.

అలా ఆయన ఆజ్ఞకు తలఒగ్గే టీచరు కావాలనుకున్న చిదంబరంగారు కంట్రాక్టరు అయ్యారు. "వృద్ధాప్యం మీద పడింది. నాకు విశ్రాంతి కావాలి. ఒప్పుకున్న పనులున్నాయి. అవి నువ్వుచూడు." అన్న ఆయన మాటకు బద్ధులై తండ్రి వారసత్వం స్వీకరించారు.

కానీ పులిలాంటి తండ్రి గర్జనలతో మార్మోగుతుండే ఆ ఇంట్లో క్షణక్షణం ఉలిక్కి పడుతూ పెరిగిన చిదంబరంగారు మేకలా సాధువుగా తయారయి, నోరూ, అందరినీ ఆకట్టుకు రాగలిగే చురుకు వుంటేనేగాని నెగ్గుకు రాలేని ఆ కాంట్రాక్టరు పనిలో రాణించలేకపోయ్యేరు.

ఈ సమయంలోనే ఏదో కలప ఖరీదు నిమిత్తమై వెళ్లినప్పుడు కేశవరావుగారితో పరిచయమయింది.

ఆ తరవాతకూడా ఆ అవసరం మీదనే నాలుగయిదు తడవలు వారిరువురూ కలుసుకున్నారు. ఈ స్వల్ప వ్యవధానంలోనే ఒకరంటే ఒకరికి సద్భావం కుదిరింది.

తన ఘోష వినేవాడు దొరికిందే చాలని, పనిలో తమ పడుతున్న చిక్కులూ ఇక్కట్లూ వెళ్లబోసుకున్నారు చిదంబరంగారు కేశవరావుగారితో ఒకమాటు.

అంతా విని, "మీరా లైనుకి సూట్ కారండీ" అన్నారు కేశవరావుగారు.

ఆ విషయం చిదంబరంగారికీ తెలుసును.

"మా నాన్న బలవంతానా నా మెడకు చుట్టిన తద్దినమండీ ఇదీ –" అని చెప్పుకున్నారు వునూరుమంటూ.

కేశవరావుగారు ఆలోచనలో పడ్డారు. ఎప్పటినించో స్మాల్ స్కేలు ఇండస్ట్రీ ప్లాను ఒకటి ఆయన వూహల్లో రూపు దిద్దుకుంటోంది. కానీ పెట్టుబడికి ఒక్కణ్ణే నిభాయించుకోగలనా అనే పస్తాయింపుతో ఇప్పటిదాకా కాలయాపన చేశారు.

చిదంబరంగారి సమస్యని పరిష్కరించి ఆయన్ని ఉద్ధరిద్దామని కాదుగానీ, 'ఉభయతారకంగా వుంటుంది. పోనీ చెప్పిచూస్తే తప్పేమిట'ని తన పథకమాయనకి విడమరిచి చెప్పారు.

ఇండస్ట్రీకి కావలిసిన స్థలమూ, లోనూ, మెషనరీ తెప్పించటమూ మొదలుగాగల ప్రారంభంలో వుండే ఏర్పాట్ల తలనెప్పులన్నీ తను పడతానన్నారు. ఆ తరవాత కూడా ఒకరికొకరం తోడు వుంటాము కాబట్టి ఇద్దరికీ అంతగా శ్రమ వుండదన్నారు.

చిదంబరంగారు ఒప్పదల అయ్యేరు. "కానీ మనమిద్దరం ఎన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నా మా నాన్న పెట్టుబడికి ఉహూ అంటే అనుకున్నవన్నీ గోవిందానే" అన్నారు.

కానీ ఏ కళ నున్నారో ముసలాయన కూడా 'సై' అన్నారు.

అలాగ చిదంబరంగారూ, కేశవరావుగారూ, 'విజయా ప్లాస్టిక్ అండ్ కేన్' ఫ్యాక్టరీకి భాగస్వాములయ్యేరు. ఇద్దరి అజమాయిషీలో రెండేళ్లు గడిచేటప్పటికి ఫ్యాక్టరీ ఎంతో అభివృద్ధి పొందింది.

దానితోపాటు వారిద్దరి స్నేహబంధం కూడా దృఢంగా బిగుసుకున్నది. కుటుంబాలు కూడా ఎంతో సన్నిహితమైనాయి.

అంతటితో ఆగక చుట్టరికం కూడా కలుపుకోవాలనే అభిలాష వ్యక్తమయింది తొలిగా అబ్బాయి గలవారి తరఫునించే.

ఆడపిల్లవారి నించి రావాలిసిన ఈ ప్రతిపాదన తారుమారవటానికి కారణం వారికా కోరిక లేకపోవటం కాదు – ముందుకొచ్చి అడిగే ధైర్యం లేకపోవటమే.

చిదంబరంగారి అబ్బాయి గోపీకృష్ణ గుప్పెడు చాక్లెట్లు కామేశ్వరమ్మ చేతిలో వుంచి,

"ఆంటీ నేను ఇంటర్ ఫస్టు క్లాసులో పాసయ్యేను." అప్పుడే కామేశ్వరమ్మ ఇన్నాళ్లూ

ఆకుచాటున ఉన్న పిందె ఈనాడు పలకబారి కళ్ళబడి నట్టు ప్రత్యేకంగా అతన్ని గమనించింది.

ఒక్కమాటుగా ఆడపిల్ల తల్లయిపోయి మొదటి పండక్కి అల్లుడు ఇంటి కొచ్చినట్టు సంబరపడింది.

తన మనోఫలకంమీద కూతుర్నీ అతన్నీ ఒకరి పక్కగా ఒకర్ని చిత్రించి చూసుకుని, 'చూడచక్కగా వుంది ఈ జంట' అని మురుసుకున్నది.

ఆలస్యం చేయకుండా తనలో తలెత్తిన ఈ ఆలోచనను భర్త చెవిన వేసేసింది.

కానీ ఆవిడనుకున్నట్టుగా, "నాకు తట్టనే లేదుసుమ్మీ! ఎంత యోచన గల బుర్రే నీది." అని సరదాపడి మెచ్చుకోలేదు కేశవరావుగారు.

అప్పటికి మురళి వివాహకాండ చేసిన గాయం వారిలో ఇంకా పచ్చిమీదే వున్నది. ఈ క్షణానో ముందు క్షణానో అది మబ్బు విడిచిన ఎండలా తమని చురుక్కున పొడుస్తూ ముందుకొచ్చేసి అందరి కళ్ళా పడిపోతుందనీ, అందరూ తమని వెలేసినట్టు చీదరించుకుంటారనీ హడలిపోతున్నారు ఇంకా. లోకంమీద ఎవరి గురించి ఎవరు చెప్పుకున్నా గుమ్మడికాయ దొంగలయి ఉలిక్కిపడుతున్నారు.

ఆ పరిస్థితిలో భార్య సూచన ఆయననంతగా కదల్చలేదు. అది జరిగే పని కాదని అర్థమొచ్చేలా "ప్చ్" అన్నారు.

"మన కింది నలుపుని మరిచిపోతున్నావ్ కామేశ్వరీ! పొరపాటున అదిగానీ బయటపడిన రోజున మన మొహం వాళ్ళకు ఎలా చూపించగలం? ఇంత మోసం చేసేవేమయ్యా అంటే ఏమని సంజాయిషీ చెప్పగలం? ఉహు ఆ ఆశ పెంచుకోకు." అని పొంగే ఆవిడ ఉత్సాహంమీద ఇన్ని నీళ్ళు కూడా చిలకరించారు.

దానితో మబ్బుతెర వేసినట్టుగా కామేశ్వరమ్మ మొహం మలినమయింది. అయినా అంతలోనే ఉత్సాహం పుంజుకుని, "మీరు మరీనూ. ఎప్పుడో అవన్నీ తెలిసిపోయినప్పటి మాట కదా — అంతగా వస్తే మీరు విన్నప్పుడే మేమూ విన్నాం అంటే పోలా!" అన్నది ఆయన భయాన్ని చులకన చేదామని ప్రయత్నిస్తూ.

"బుకాయించడానికేం—వాళ్ళు నమ్మొద్దూ?" అన్నారు కేశవరావుగారు.

కామేశ్వరమ్మ మౌనంగా వుండిపోయింది.

"పోనీ చిదంబరంగారి కుటుంబానికి మనమంటే ఎంతో అభిమానం కదా — నిజం చెప్పేసి కాళ్ళావేళ్ళా పడితే కడుపులో పెట్టుకోరంటారా?" అన్నది ఇంకోసారి.

ఎంతటి ఆపేక్షగలవాళ్ళున్నాగాని ఈలాటి చేదు వాస్తవాల దగ్గరకొచ్చేసరికి అందరి భావ స్వరూపాలు ఒకమాదిరిగానే రూపుమార్చి వూరుకుంటాయి. ఇలాటివి చేతల వరకూ వస్తే నవీనులు గానీ పురాతనులు గానీ అందరూ ఒక్కలాగనే ప్రవర్తిస్తారు. వెనకటి విలువలకే ప్రాధాన్యత ఇస్తారు.

"చాతుర్వర్ణాలు ఈనాడు మనం పెట్టినవా? ఈ హెచ్చుతగ్గులు భగవంతుడే కల్పించాడు. ఈనాడు ఉచ్ఛంలేదు నీచంలేదు అంతా ఏకమే అనడానికి మనమెవరం?" అనే మార్పుని సహించని సనాతనిష్ఠుల సంగతి సరే—

ఆదర్శవాదులుగా చెలామణీ అవుతూ "కుల తత్వం నశించాలి" అని నినాదాలు చేసే వాళ్ళూ, "కోసి చూస్తే అందరిదీ ఒకే రక్తం" అంటూ నీతులు వల్లించే వాళ్ళూ సయితం తమ పిల్లలకి జాగ్రత్తగా తమ కులంలో వాళ్ళకే ఆర్షేయ పౌర్షేయాలు ఎంచి మరీ పెళ్ళిళ్ళు చేస్తారు.

సాటి కులం కానివాడికి వడ్డించాలిసి వస్తే బయట చావిట్లో విస్తరేసి తిన్నాక ఆకు మడిచి అవతల పారెయ్యమని చెప్పడానికి వెనకాడరు.

ఇదేమంటే "ఏమిటో మావాళ్ళకింకా ఈ కులాలూ, జాతులూ అనే మూర్ఖత్వపు జాఢ్యం ఒదల్లేదోయ్" అని ఎవరి మీదనో నెపంనెట్టేస్తారు.

ఇంతకీ మనుషుల మాటల్లో వచ్చినంత రివల్యూషన్ మనసుల్లో రాలేదు.

'ఆ మాత్రపు లోకజ్ఞానం తెలియకా కామేశ్వరమ్మ అలా అడగటం?' అన్నీ తెలిసిన అజ్ఞానమంటే అదేమరి.

కేశవరావుగారు భార్యవంక వింతగా చూసి "నీకేం పిచ్చా వెర్రా? ఎంత అభిమానముంటే మటుకు ఇలాంటి విషయాల దగ్గర మొహమాట ముంచుతారా?" అన్నారు.

విట్టూర్పింది కామేశ్వరమ్మ "హు! కులం కానిదాన్ని నీతిగా పెళ్ళాడ్డం పెద్ద తప్పు. ఆ మూడు ముళ్ళూ వెయ్యకుండా నలుగురు కులం తక్కువ పిల్లల్ని ఇలాకాలో వుంచుకున్నా ఎవళ్ళకీ అభ్యంతర ముండదు. సరసుడే లెమ్మని పిల్లనిచ్చి కన్యాదానం చెయ్యడానిగ్గూడా తయారవుతారు. ఛీ—ఛీ ఏం లోకం — ఏం మనుషులు." అంటూ న్యాయం లేని మూఢ నిబంధనలతో తమని అవస్థపెడుతున్న లోకాన్ని కసిగా విసుక్కుంటూ గొణుక్కుంది.

చిదంబరంగారి తండ్రి మరీ చాదస్తుడు. ఫోజు కోసం ఈ రోజుల్లో అందరూ చెబుతున్న గాలి కబుర్లు ఆయన చెప్పడు.

కామేశ్వరమ్మకు ఆయన తత్వం క్షుణ్ణంగా తెలుసును.

ఆడపిల్లల చదువులు యూనివర్సిటీలకు గూడా ఎగబాకుతున్న ఈ రోజుల్లో కూడా ఆ వూరి గర్ల్స హైస్కూలు క్రిష్టియన్ నన్స్ నిర్వహిస్తున్న దవటాన మనవరాళ్ళ చదువుని ఎలిమెంటరీ చదువుతోనే నిలిపేశాడు. పొరపాటున క్రిస్టు ఒకటి ఇంట్లోకి వచ్చిందని పుణ్యావచనం చేయించిగానీ నోట్లో నీళ్ళు పోసుకోలేదాయన. విదేశాలకి వెళ్ళొచ్చిన మేనల్లుడిని ప్రాయశ్చిత్తం చేయించిగానీ కులంలో కలుపుకోడానికి వీల్లేదని తన పంతం నెగ్గించుకున్న మనిషాయన. అప్రాచ్యపు మాట నోట వస్తే పసుపునీళ్ళు పుక్కిలించి నోరు శుద్ధి చేసుకుంటాడాయన. అంతటి ఛాందసం మూర్తీభవించిందాయనలో.

(ఇంకా వుంది)



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

వై. వి. ఎల్. — విరకార్‌పూర్

మా అమ్మగారి కుడి కన్ను నెలకొక్కసారు ఎఱ్ఱబడుతుంది. ఒకటి రెండు రోజులు వుండి పోతుంది. ఇలా రావటానికి కారణమేమిటి ?

★ నేత్రవైద్యులు ప్రత్యక్షంగా పరీక్ష చేయటం చాలా అవసరం. దృష్టిలో లోపం (కళ్ళలోని లెన్స్ పవర్‌లో మార్పులవల్ల), విటమినుల లోపం (విటమిన్ బి—2) దుమ్ము, అలర్జీ మొదలైన వాటివల్ల ఇలా జరిగే అవకాశం ఉంటుంది. అరుదుగా కడుపులో క్రిములు ఉండటంవల్లకూడా ఇలా జరిగే అవకాశం ఉంది. రోగ కారణాన్నిబట్టి చికిత్స చేయవలసి ఉంటుంది.

కె. ఆర్. ఆర్. - వెల్లాడు

మా అన్నయ్యగారి అమ్మాయికి 5 సంవత్సరములు. పాపకి జ్వరం వచ్చినపుడు ఫిట్స్ వస్తున్నాయి. డాక్టర్ల దగ్గరకు తీసుకువెడితే ఇంజక్షన్ వేసి పోతుందిలే అంటున్నారు. దీనికి నివారణోపాయము తెల్పండి ?

★ ఇలా వచ్చే ఫిట్లను ఫిబ్రైల్ ఫిట్స్ అని అంటారు. మెదడులోని సెల్స్ అధిక ఉష్ణాన్ని సహించలేవు. ఒకసారి ఫిబ్రైల్ ఫిట్స్ రావటం మొదలయితే ప్రతిసారి జ్వరం వచ్చినప్పుడు ఉష్ణోగ్రత ఒక ప్రమాణం దాటగానే ఫిట్లు రాగల అవకాశం ఉంటుంది. కొందరిలో కాలగతిలో ఈ లక్షణం తగ్గిపోతుంది. ఫిట్లు రాకుండా చూసుకోవటం ముఖ్యం. జ్వరం రాగానే వెంటనే ఆస్పిరిన్, మెబారాల్ వంటి మాత్రలను వయస్సుకి తగ్గ మోతాదులో వాడవలసి ఉంటుంది. ఈ మాత్రలను వైద్యుల వద్దకి తీసుకొని వెళ్ళేముందే వేయటం మంచిది. అలా వేసిన సంగతి వైద్యులకి తెలియజేయాలి. కొందరు వైద్యులు మెదడు ప్రేరేపణ శక్తిని తగ్గించటానికి సెడెటివ్స్ వాడటం జరుగుతుంది.

ఆర్. వి. జి. ఆర్ — హైదరాబాద్

నా వయస్సు 21 సంవత్సరములు. నాకు 'ఎమీబిక్ డిసెంటరీ' అనే వ్యాధి వున్నది. మందులు వాడితే తగ్గిపోయినది. కాని పులుపు, కారము తిన్నచో మరలా కడుపులో మంటగా వుంటుంది. ఇది పూర్తిగా తగ్గాలంటే ఏమి చెయ్యాలి ?

★ అమీబిక్ డిసెంటరీ ఉన్నప్పుడు నిర్ణీత మాత్రలు తీసుకొన్న తర్వాత మలపరీక్ష చేయించుకోవటం అవసరం. వరుసగా మూడుసార్లు (7 రోజుల కాలవ్యవధి కొకసారి) మలపరీక్ష చేయించుకొని ఎంటమీబా హిస్టొలిటికా — వెజిటేటివ్ ఫార్మ్సుగాని సిస్ట్సుగాని లేవని తెలుసుకొన్న తర్వాత ఆ రోగం పూర్తిగా పోయిందని నిర్ధారించుకోకూడదు.

పులుపు, కారం తినటానికీ అమీబిక్ డిసెంటరీకీ పెద్ద సంబంధం లేదనే చెప్పాలి. కడుపులోని మ్యూకస్ పొర వాయటం (గ్యాస్ట్రైటిస్) వల్లగాని, ఆ పొరలోనే పుండ్లు ఏర్పడటంవల్లగాని ఇలా మంట రావచ్చును. యాంటాసిడ్ మాత్రలు (జెలుసిల్, కెటాక్సిమాగ్ మొ॥వి) రోజుకి మూడు పూటలుగా కొన్ని రోజులు వాడండి. ఎక్కువగా పులుపు, కారం తినటం తగ్గించాలి.

ఎమ్. ఎస్. ఆర్. — కొవ్వూరు

నా వయస్సు 26 సంవత్సరములు. మా వివాహమై 5 సంవత్సరములు అయినది. 4 సంవత్సరముల బాబు వున్నాడు. మరలా మాకు సంతానము కలుగకపోవుటకు కారణము తెలియుటలేదు.

★ కొన్ని తాత్కాలిక మార్పులవల్ల ఇలా జరిగే అవకాశం ఉన్నది. హార్మోనుల ప్రమాణంలో మార్పులవల్ల గర్భసంచిలోని ఎండోమెట్రియం అనే పొరలో కొన్ని అవకతవకలేర్పడే అవకాశం ఉంటుంది. మీరు నిపుణులైన లేడీ డాక్టర్ల వద్ద పరీక్ష చేయించుకోవటం అవసరం. అవసరం అయితే వారు డైలటేషన్ అండ్ క్యూరటాజ్ చేస్తారు.

సి. హెచ్. జె. ఆర్. కె — కొత్తగూడెం

నాకు అప్పుడప్పుడూ శీతాకాలపు రాత్రులందు కొద్దిగా ఆయాసము వస్తూ వుంటుంది. రోజూ రాత్రులందు నిద్రపట్టదు. నిద్రపట్టకపోవటానికి కారణమేమిటి ? ఆయాసము తగ్గటానికి దగ్గర వుంచుకోవలసిన మాత్రలు ఏమైనా వుంటే తెలుప ప్రార్థన.


★ ఆయాసం వస్తూ ఉన్న చాలామందికి నిద్రపట్టకపోవటం సహజ లక్షణంగా ఉండటం కనబడుతున్నది. దీనిని చాలా రకాలుగా వ్యాఖ్యానించటం జరుగుతున్నది. ఆయాసం ఏర్పడటానికి కారణం అయిన రసాయనిక పదార్థాలే నిద్రలేమికి కారణాలవుతాయని ప్రస్తుతం ఎక్కువగా అంగీకరించబడిన వ్యాఖ్య అవుతుంది.

ఆయాసం తగ్గటానికి అమైనోఫిలిన్, ఎఫిడ్రిన్ మొదలయిన మాత్రలను దగ్గర ఉంచుకోవటం మంచిది. పూటకి ఒక మాత్ర చొప్పున ఈ రెండిటిని వాడటం మంచిది.'

నెస్టమ్ శిశువు జీర్ణానికి మంచిది

మీ పసిపాపకోసం
11 విటమిన్‌లు
ఇనుముగల
బియ్యంతో
తయారయిన
ఒకే ఒక పదార్థం.





ప్రకృతి సిద్ధమైన పద్ధతులలో మీ పాపని పెంచండి. ఇవ్వగలిగినంత కాలం పాపకి చనుపాలు యివ్వండి—మీరు ఇవ్వగలిగిన పుష్టికరమూ, సున్నితమూ అయిన ఆహారం అదే.

పాపకి 4 నెలలు వచ్చేసరికి ఎక్కువ పోషక పదార్థాలు కావాలి. ఘన పదార్థాలు తీసుకోడానికి పాప సిద్ధంగా వుంటుంది. నెస్టమ్ గురించి, పాప ఆహారంలో ఘన పదార్థాలు ప్రవేశ పెట్టడం గురించి మీ డాక్టర్‌ని సంప్రదించండి. నెస్టమ్ బియ్యంతో తయారు చేయబడింది—ఎంతో సులభంగా జీర్ణమయ్యే సీరియల్.

నెస్టమ్ బేబీ సీరియల్ రైస్—పాల నుంచి ఘన పదార్థాలకి సున్నితమైన మార్పు.

నెస్టమ్®
బేబీ సీరియల్
రైస్

పాల నుంచి ఘన పదార్థాలకి
సున్నితమైన మార్పు

తయారు చేసే పద్ధతి :



ముందుగా మరిగిన వెచ్చని పాలు పోయండి. నెస్టమ్ చేర్చండి. కలపండి. తినిపించుటకు తయారు.

NESTLÉ®

SAA/FSL/N/2257 TEL

మల్లెలమాసం

సింగరాజు రామచంద్రమూర్తి

"అయితే నీ నిర్ణయం మారదంటావు బేబీ ?" అడిగాడు కృష్ణమోహన్.

"మారదు డాడీ". అంది నిశ్చయంగా బేబి.

"ఆలోచించావా ? ఐ మీన్ బాగా ఆలోచించావా అని."

నవ్వింది బేబి. "చాలా బాగా ఆలోచించాను డాడీ. నాకయితే నేను చేస్తున్న పని కరెక్ట్ అనిపిస్తోంది." అంది.

ఆయన కాసేపు మాట్లాడకుండా కూతురి వంక చూస్తుండిపోయారు. తరువాత లేచి నిలబడి "నేనెవరిని ?" అనడిగారు.

నవ్వి "డాడీ— మై ఫాదర్" అంది బేబి.

"నో. నా ఉద్యోగం ఏమిటి ? అని."

"ప్రొఫెసర్ కృష్ణమోహన్, కన్సల్టింగ్ ఇంజనీర్, ఫారిన్ రిటర్న్డ్ ! ఈ ప్రాంతంలో లెక్కల్లో మీకు ఎదురుచెప్పే వారేలేరు." అని నవ్వి, "చిన్నప్పటినుంచీ "మీ నాన్నగారు ఏం చేస్తుంటారు ?" అని ఎవరు అడుగుతారా అనుకుంటుండే దానిని డాడీ, ఐయామ్ ప్రౌడాఫ్ మై ఫాదర్" అంది.

"నేనూ డిటోనే బేబి — ఇదిగో ఈ నిర్ణయం తెలియక ముందు దాకా !"

"అది ఒక్కటీ క్షమించి ఆశీర్వదించలేరా డాడీ ?"

"నెవర్. కన్నకూతురు తప్పు చేస్తుంటే ఏ ఫాదరూ సహించలేడు బేబీ ! దట్సూ, నాకున్న అపారమయిన అనుభవం ఆస్తిపాస్తులతో ! మన కుటుంబం ఎటువంటిది ? మా నాన్నగారు జడ్జి. మీ అమ్మ నాన్నగారుపేరుమోసిన క్రిమినల్ లాయర్ నీకున్న ఒకే ఒక్క బ్రదర్ ఎమ్.టెక్— అమెరికాలో! మరి నువ్వు ?"

నవ్వేసింది బేబి "పోనీండి డాడీ, మామూలు మనిషిగా మీ ఇంటికిరానిస్తుండండి. అంతేచాలు నాకు"

"ఛీ" విపరీతమయిన కోపంతో చేతిలో ఉన్న పుస్తకాన్ని విస్సిరి కొట్టారాయన. ఆ దెబ్బకి బల్ల మీదనున్న పూలకుండీ కిందపడి తునాతునకలై పోయింది.

బేబి తెల్లబోయింది.

"వాటీజ్ దిస్" అన్నారాయన ఫ్రిజ్ చూపిస్తూ.

"ఫ్రిజ్ డాడీ, నాకు ఐస్ క్రీం ఇష్టమని కొనిపెట్టారు మీరు" అంది మెల్లగా.

"కరెక్ట్. ఇది నీతో రాదు. గుర్తుంచుకో. నెక్స్ట్— ఇదేమిటి ?"

"త్రీ ఇన్ వన్. నా గొంతు టేప్ చేసుకుని వినటం నాకు సరదా అని నా కోసం కొన్నారు మీరు డాడీ !"

"ఇదీ నీతో రాదు. ఎస్ మరి ఇదేమిటి ?"

మాట పూర్తవకుండానే వెక్కివెక్కి ఏడవ సాగింది బేబి. "డోంట్ బి సో క్రూయల్ డాడీ, మీ కూతుర్నయిన పాపానికి అంత శిక్ష విధించకండి డాడీ— అయి వాంటిట్. అది నాకు కావాలి !"

"నువ్వు నన్ను ఎంతశిక్షిస్తున్నావో గుర్తుంచుకో బేబీ, నాకూతుర్నయిన పాపానికి" అంటున్నారు. ఇప్పటి దాకా అదే మహాపుణ్యం అనుకున్న దానివి ఇప్పుడు పాపం అనిపించుతోంది నీకు.

నో. ఐ వాంటిట్ ! అయికెన్ నెవర్ పార్ట్ విదిట్. చెబుతున్నాను విను. ఏడుస్తూ విను. అది టెలివిజన్. దానిమీద మీ అమ్మ వీడియో వేసుకుని చూడటం నీకు అలవాటు.

మీ అమ్మ పోవడం నా దురదృష్టం. అయితే పోయేముందు ఆ వీడియో ఏర్పడటం నా అదృష్టం ఆమె బ్రతికే ఉన్న భావన కలుగుతోంది. ఆమె దిన చర్య యావత్తూ రికార్డ్ చేయించావు — నువ్వే ! అందుకు నీకెప్పుడూ ఋణపడి ఉంటాను. కాని నీకివ్వనది. దట్సాల్ "

బేబీ మాట్లాడకుండా ఏడుస్తూనే ఉంది.

"నా మాట వినని నీకు ఇవ్వను. అది నా భార్యది... పోనీ ఇప్పటికయినా నీ మనసు మార్చుకుంటావా ? దట్ యంగ్ ఇడియట్ నీ సుధీర్‌ని మరిచిపోతావా ?"

"నో డాడీ, అతన్ని మరిచిపోను. అతన్నే చేసుకుంటాను."

కాసేపు ఆయన ఏమీ మాట్లాడలేదు. తరువాత ఆమె వంకనే చూస్తూ "మీ ఇద్దరి పరిచయం ఎన్నాళ్లదీ ?" అనడిగారు.

"నాలుగు, అయిదేళ్ళ మధ్య" అంది మెల్లగా బేబి.

"ఈ కాలంలోనే అంతగా ఒకరంటే ఒకరు పూర్తిగా అర్థం అయేంత పరిచయం వచ్చేసిందా ?"

"వచ్చింది డాడీ."

"నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడంటావు ?"

"అవును డాడీ. నేనూ అంతే !"

"నీ సంగతి వదిలేయ్. నాకు కావలసింది అతను నువ్వంటే పంచ ప్రాణాలు, నీ మీద పూర్తి నమ్మకం కలవాడంటావు. అందులో నీకెటువంటి సందేహం లేదంటావు ?"

నవ్వి "సందేహం లేదు డాడీ !"

మాట్లాడకుండా కాసేపు ఫానువంక చూసి తరువాత "సో నువ్వు మారనప్పుడు నాకు మార్గాంతరం లేదు కదా— నేను మారాలంటావు" అన్నారు.

"డాడీ, దేముడులాంటి వారు మా డాడీ, స్వీట్ డాడీ" ఆనందంతో అంటున్న బేబికి అడ్డం వచ్చారు కృష్ణమోహన్.

"నా ఆస్తి ఎంతుందంటావు ?"

"కష్టం డాడీ చెప్పడం. అయినా వారు వీరు చెప్పుకునే మాట నలభయి ఉంటుందని."

"మరో పది కలిపి మేకిట్ ఫిఫ్టీ ! ఏమిటని లక్షలు. ఆల్‌రైట్. ఒక గుమాస్తా ఉద్యోగానికి సెలక్షన్ కోసం ఏం చేస్తారు ?"

"అంటే నాకర్థం కావటంలేదు" అంది బేబి అయోమయంగా.

"అంటే ఒక అబ్బాయిని బాంకులో గుమాస్తా ఉద్యోగం ఇచ్చేందుకు ఏవి పరీక్షలు పెడతారు అని"

"నను వెళ్ళలేదు కదా ఎప్పుడూ. ఫ్రెండ్సు చెబుతుంటారు. ఒక వ్రాత పరీక్ష తరువాత ఒక ఇంటర్వ్యూ ఉంటాయట !"

"గుడ్ జీతం ఎంతుంటుంది—సే ఆరువందలు అనుకో. ఆరువందలు నెలకి అంటేసంవత్సరానికి ఏడు వేల రెండువందల. పైన బోనసు వగయిరాలతో పది వేలేసుకో ! పదివేల ఆదాయానికి రెండు పరీక్షలు అదీ ఫలితం కోసం సుమారు నాలుగు నెలలు ఆగాలి!

నా ఆస్తిలో నీ వాటా ఎంత ? పది లక్షలు వేసుకో. దీనికి అతనే యజమాని అవుతాడు కదా ! మరి ఇందుకోసంఎంత సేపుపరీక్షించాలి ఆ అబ్బాయిని?

"వండర్‌ఫుల్ డాడీ, అదా మీ ఆలోచన ! మీ ఇష్టం వచ్చిన పరీక్ష పెట్టుకోండి. చదువులోనా, ఆటల్లోనా ?"

"నో, చదువు— ఉట్టి గ్రాడ్యుయేట్ కదా ! నాకనవసరం. అదికాదు. నీపట్ల అతని మనసు ఎటువంటిది ? అంత వరకే నా కుతూహలం ! ఆల్‌రైట్ ఆర్నెలలు. ఆరునెలల పాటు నువ్వు నేను చెప్పినట్లు చేస్తానని ఒప్పుకుంటే ప్రొసీడవుతాను ఈ సమస్యలోకి"

"ష్యూర్ డాడీ, మీరు అంగీకరిస్తానంటే దేనికయినా ఒప్పుకుంటాను. ఏం చేయమన్నా చేస్తాను."

"ఏమీ చేయనక్కరలేదు. ఆరునెలలు అతన్ని చూడకూడదు. అతనితో మాట్లాడకూడదు. ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలు, రాక పోకలు ఉండ కూడదు. సరా ?"

"ఎస్ డాడీ, మీ ఇష్టం."

"నేనేమి చేస్తున్నా అదేమిటని ప్రశ్నించకూడదు చూస్తూ ఊరుకోవడం మినహా."


"సరే, ఆర్నెల్లు అయినాక ఏం జరుగుతుంది?" అడిగింది కుతూహలంగా బేబి.

కాసేపు ఆమె వంకనే చూసి "ఆరునెలలు అయినాక నువ్వే అతన్ని వద్దంటావు" అన్నారాయన.

"వ్వాట్ ? నెవర్ !"

"అరవకు. మీ ఇద్దరి ప్రేమలో మార్పు లేక పోతే నేనే స్వయంగా పెళ్ళి చేస్తానని చెబితిని కదా ! నా మాట తప్పను."

"అయితే నా మాటా వినండి డాడీ, ఆరునెలలు కాదు ఆరుసంవత్సరాలు గడచినా మేం ఒకరి కోసం ఒకరం వేచి ఉండి మీ ప్రయత్నాలని భంగపరచి తీరతాం. ఒకరంటే ఒకరికి నమ్మకమూ ఉంది."



"అతనిని వదలవలసి వస్తే నువ్వు మాత్రం మొండి పట్టుదలలకి పోకూడదు."

"అలాగే !"

"ఈ రోజునుంచే నీకీ ఇల్లు జైలు— ఎప్పుడయినా నేను తీసుకెడితే గాని, నేను నియమించిన వారు తీసుకు వెడితేగాని బయటకి వెళ్ళాలి. ఫోను ముట్టుకోకూడదు. నాతో పూర్తిగా సహకరించాలి."

"అలాగే డాడీ."

కూతురువంక చూసి ఆయన నవ్వారు. బేబి కూడా శృతి కలిపింది.

కొన్నాళ్ళుపోయాక ఒక కుర్రాడిని వెంటబెట్టుకునివచ్చారు కృష్ణమోహన్. "ఇతను నా ప్రయివేటు సెక్రటరీ. పేరు పవన్ కుమార్ ఎమ్మెస్సి ఫస్ట్‌క్లాస్. ఈ ఇంట్లోనే ఉంటాడు. అతను ఎక్కడయినా తిరగచ్చు ఇంట్లో" అన్నారు.

అతను ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాడు. పొడుగ్గా ఆరోగ్యంగా బాగున్నాడు. బేబి మాత్రం ఒక్కసారి అతని వంక చూసి తలతిప్పేసుకుంది.

"నీకు తోచకపోతే ఇతనితో కారమ్స్, చెస్ లాంటివి ఆడొచ్చు. నమ్మకస్తుడు, తన హద్దులు తను తెలిసినవాడు..."అని కాసేపాగి "మాఅమ్మాయి. నాకు ఒక అబ్బాయి కూడా ఉన్నాడు— అమెరికాలో ! ఈమె పేరు నాకు బేబి, నీకయితే పల్లవి! కొన్నాళ్ళ

పాటు విశ్రాంతి తీసుకోమన్నాను అందుకు ఎక్కడికీ కదలదు బయటకి వెడితే నాతో వెళ్ళాలి అంతే !''

మరో రెండురోజులకి గది అంతా మిరుమిట్లు గొలిపే లైట్లు ఏర్పాటు చేయించారు కష్ణమోహన్ ''ఇవన్నీ ఎందుకు డాడీ, సినిమా స్టూడియో లాగ'' అంది పల్లవి

''స్టూడియోనే అనుకోమ్మా నీకన్నా అందమయిన వాళ్ళా ఆ సినిమాలలో వేసేవాళ్ళు మిస్టర్ పవన్ యామైరైట్ ?''

అతను నవ్వి ఊరుకున్నాడు

తరువాత ఒకరోజు ఒక జంట వచ్చారు ఆడ, మగా !

''వీళ్ళు ఇంటీరియర్ డెకొరేటర్స్ బేబి, అంటే ఇళ్ళ లోపలి భాగాలు, అందంగా అలంకరిస్తారన్న మాట దానితోపాటు మనకి కూడా వాటికి మాచ్ అయ్యే బట్టలు సజెస్ట్ చేస్తారు'' అన్నారు కృష్ణమోహన్

పవన్ దగ్గరుండి వాళ్ళు చెప్పేవన్నీ జాగ్రత్తగా వింటూ నోట్ చేసుకుంటున్నాడు

''మీ చర్యలన్నీ వింతగా ఉన్నాయి డాడీ'' అంది వాళ్ళనీ, వాళ్ళతోపాటు తిరుగుతున్న పవన్‌ని చూస్తూ

''మన అగ్రిమెంటు మరిచిపోతున్నావు బేబి బైదిబై, ఆ ఆడమ్మాయి వచ్చిందే ఆవిడ బ్యూటీ పార్లర్ ఒకటి నడుపుతోంది నీకు ఎప్పుడూ అలవాటులేదుగదా ! అందుకు తననీ పిలిచానన్న మాట నీకు అందంగా, ఇంకా అందంగా కనబడేందుకు సూచనలిస్తుంది, స్వయంగా అలంకరించి చూపుతుంది కూడా !''

నవ్వుతూ ''అగ్రిమెంటు కద – సరే'' అంది బేబి

ఒక్క వారంలో ఆ ఇల్లు, ముఖ్యంగా ఆమె వాడుకునే మేడ పైభాగం పూర్తిగా మారిపోయింది అత్యాధునికమయిన అడ్వర్టయిజుమెంట్లలోని పడక గదుల్లాగా తయారయింది ''వండర్‌ఫుల్ డాడీ, చాలా బాగా చేయించారు'' అంది బేబి ముగ్ధురాలై పోయి

''ఇంకా చూస్తూండు బేబి, రేపు నీకు స్పెషల్ డ్రసెస్ డెలివర్ చేశాక ఇంకా ఆశ్చర్య పోతావు–మీ డాడీ టేస్టు ఏమిటో అర్థమౌతుంది''

ఆయన మాట అక్షరాలా నిజమనిపించిందా అమ్మాయికి తనెప్పుడూ అంత అందంగా బట్టలు ఎన్నుకోలేదు అంత అందంగా మేకప్ కానూ లేదు

డ్రస్సింగ్ టేబుల్ ముందు నిలబడి తనని తను చూసుకుంటోంది – మేకప్ ఎంత మార్పు తెస్తుంది – అనుకుంటూ కొత్తగా అమర్చిన దీపాలు ఆ గదిని పట్టపగలు చేస్తున్నాయి

ఇంతలో ఎక్కడినుంచో పరుగెత్తుకుంటూ పవన్ రావడం, ఆమెను గభాలున ఎత్తేసుకోవడం క్షణాలలో జరిగిపోయింది. ''ఎందుకు, ఏమిటి?'' అని అడిగేంతలో భళ్ళున ఏదో పడగా గాజు పగిలిన శబ్దం కావడంతో భయపడిపోయి అతని మెడని గట్టిగా చుట్టేసింది పల్లవి ! గుమ్మంలో కృష్ణమోహన్ దగ్గర ఆమెని దింపి పక్కన నిలబడ్డాడు పవన్

''మాశావా ఆరక్షణంలో పవన్ లేకపోతే ఆ పైని దీపాలగుత్తి నీ నెత్తిన పడుండేది ఎలా పసికట్టావోయ్– చాలా థాంక్స్ ! యుహావ్ సేవ్‌డు మై బేబి'' అన్నారు కృష్ణమోహన్

వెనక్కి తిరిగిచూసింది బేబి తను నించున్న చోట గాజు పెంకుల్ను చెల్లా చెదురుగా పడిఉన్నాయి

''సోమెనీ థాంక్స్, రక్షించారు ఎలా తెలుసుకున్నారు, అది పడబోతోందని ?'' అంది కళ్ళలో కృతజ్ఞత నింపుకుని పల్లవి

''జస్ట్ సిక్త్ సెన్స్ మిమ్మల్ని చూస్తున్నాము నేను, మీ డాడి నిలబడి ! అంతలో ఎందుకో భయం వేసి మిమ్మల్ని ఎత్తుకొచ్చేశాను'' అన్నాడు పవన్ నవ్వుతూ

ఒకనాడు ''నిన్ను బయటకి పోనివ్వడం లేదు కనుక నీకు కాలక్షేపం అయ్యే ఏర్పాట్లు నేనే చేయాలి కదమ్మా ! కమాన్'' అంటూ ఆమెని హాల్లోకి తీసుకువెళ్ళారు కృష్ణమోహన్ అక్కడ టేబుల్ టెన్నిస్, టేబుల్ ఉంది

భేదం

రెక్కలపై బ్రతికే పక్షికీ, మనిషికీ
భేదమొక్కటే !
పక్షి ఆకాశంలో తిరుగుతూ,
భూమిపై జీవిస్తే,
మనిషి 'ఆకాశం'లో జీవిస్తూ
భూమిపై తిరుగాడుతాడు

— గన్ను కృష్ణమూర్తి

''మన పవన్‌తో ఆడాలి అతడు మంచి ప్లేయరట మరి మా బేబీ కూడా చాలా బాగా ఆడుతుందోయ్ పవన్ తేలికగా ఓడించవచ్చునన్న మూడ్‌లో ఆడబోకు యు నీడ్ ఆల్ యువర్ స్కిల్'' అన్నారు

మొదట ఏదో డ్యూటీగా మొదలెట్టింది ఆట బేబి అయితే రాను రాను అతని శ్రద్ధ చూసి మారిపోయింది, పూర్తిగా లీనమయిపోయింది గంట గడిచాక ''మీరిద్దరేమోగాని చూసి చూసి నేను అలసిపోయాను ఇప్పుడు డ్రింక్స్ తీసుకుందాం, పద బేబి నీ రూంలో కూర్చుందాం'' అన్నారు కృష్ణమోహన్

గదిలోకి రాగానే మంచం మీదికి వాలిపోతూ ''గ్రాండ్ డాడీ, పవన్ చాలా బాగా ఆడతారు రియల్లీ మిస్టర్ పవన్'' అంటుండగానే ''బేబీ, కదలకు. పవన్, చూశావా తేలు'' అని అరిచారు కృష్ణమోహన్.

బేబి బిగుసుకు పోయింది ఆమె తేలునెప్పుడూ ముఖాముఖి చూడలేదు ఆమె స్నేహితురాలి తమ్ముడొకడు తేలుకుట్టి చనిపోవటం మాత్రం ఎరుగుంది

రెండు అంగల్లో పవన్ వచ్చేశాడు ''అదుగో ఆ మూల ఉంది మీరు కదలకండి పల్లవీ'' అంటూనే విశాలమయిన ఆమె బెడ్ మీదికి ఎక్కేసి, పాకుతూ అటు వెళ్ళాడు ''మీ స్లిప్పర్ ఇవ్వండి'' అంటూ వెనక్కి తిరిగి భయంతో తనని అంటిపెట్టుకునిఉన్న బేబి వైపు చూసి నవ్వి ''అంత భయమా'' అన్నాడు

''అవును'' అన్నట్లు తల నిలువునా ఊపి అతనికి ఇంకా దగ్గరకు జరిగింది

పవన్ అప్పుడు సన్నపాటి దారం ఒకటి తీసి దాన్ని నేర్పుతో తేలుకొండికి ముడివేశాడు ఆ తేలు ముందుకి పాకడం, అతను దానిని వెనక్కి లాగాడు మళ్ళి వెనక్కి తిరిగి ''చూశారా, అది ఇక మన చేతిలో బానిస ! ఏం భయంలేదు నవ్వండి నేనుండగా మీకేం భయమండి ?'' అన్నాడు

ఆమె పేలవంగా నవ్వి ''అదింకా చావలేదుగా'' అంది

''ఇలా తాడుతో కట్టేశాక ఇంకెక్కడికి పోతుంది ? చూడండి సార్, మీ అమ్మాయి ముఖమంతా ఎలా చెమటలు పట్టేశాయో మైగాడ్ !'' అంటూనే పక్కనే ఉన్న ఆమె కర్చీపు ఆమె కందిచ్చి ''ఊఁ, ముఖం చక్కగా తుడుచుకోండి'' అన్నాడు

''ఆ తేలు అసలక్కడికెలా వచ్చింది పవన్ ?'' అడిగారు కృష్ణమోహన్ – పవన్ దానిని చంపి ఆవతల పారేశాక

''ఏముంది సార్, ఎండ కద బయట !'' అన్నాడు అతను

''నో, నా జీవితంలో మా ఇంట్లో తేలు రావడం ఇదే మొదటిసారి ఎండ ఏటా ఉండేదే కదా !'' అంది పల్లవి

''మనుష్యుల సంఖ్య పెరిగినట్లే వీటి సంఖ్య కూడా పెరిగిందేమో వాటికి పైగా కుటుంబ నియంత్రణ కూడా లేదు గదా !''

అందరూ నవ్వేశారు

ఒకరోజు పల్లవి బాత్‌రూంలో స్నానం చేసి చీర చుట్టుకొని బయటికి రాబోతోంది సరిగా అదే వేళకి రెండు పిల్లులు పోట్లాడుకుంటూ ఆమె దారికడ్డంగా పరుగెత్తాయి పిల్లులంటే ఆమెకి చాలా భయం అందులోనూ ఒకటి దారికడ్డంగా రావడంతో ఖంగారుపడి దానిమీద కాలువేసి కింద పడబోయింది పల్లవి హఠాత్తుగా పవన్ ముందుకు దూకి ఆమెని పట్టుకున్నాడు అయితే అప్పటికే ఆమెకి స్పృహ తప్పిపోయింది

ఎత్తుకు వెళ్ళి మంచంమీద పడుకోబెట్టి మెల్లిగా విసురుతూ ముఖం పట్టుకుని నిదానంగా అటు ఇటు ఊపసాగాడు

అతనితోపాటే వచ్చిన కృష్ణమోహన్‌గారు కంగారుపడిపోతూ ''మళ్ళీ మామూలు మనిషవుతుందంటావా పవన్ కుమార్ ?'' అన్నారు

''అవుతుంది సార్, మీ పని మీరు చేస్తే'' అన్నాడతను

కాసేపటికి ఆమె కళ్ళు తెరచి ''ఏమయింది?'' అనడిగింది.

''ఏమీ కాలేదు ఖంగారు పడకండి టేక్‌రెస్ట్. ఇలా తేళ్ళకి, పిల్లులకి భయపడిపోతే ఎలా మిస్ పల్లవీ– ఝాన్సీరాణి పుట్టిన దేశంలో పుట్టి !'' అన్నాడు నవ్వుతూ.

ఆమె కూడా బలహీనంగా నవ్వేసి "మీరు మాత్రం నన్ను కంటికి రెప్పలా కాపాడుచున్నారు. చిత్రం చూశారా ప్రతి అవాంతరంకి మీరు సమయానికి వస్తున్నారు" అంది.

"అది దైవికం— నా అదృష్టం అనుకోండి! మీకు సేవచేసేందుకు అందుబాటులో ఉండగలగటం అదృష్టం కదూ!" అని కాసేపాగి "యజమాని కూతురు కదా మీరు. దుప్పటి కప్పేశాను. కాసేపు హాయిగా పడుకోండి. స్లీప్" అని మంచం మీదనుంచి దిగాడు.

కొన్నిరోజులు పోయాక కృష్ణమోహన్ హటాత్తుగా వచ్చి "మనం ముగ్గరం మా పొలాలున్న ఊరు వెడుతున్నామివాళ! మా బేబి ఎప్పుడో చిన్నతనంలో వచ్చింది. అక్కడ అన్ని సౌకర్యాలు ఉంటాయి లెండి పవన్‌కుమార్, అచ్చం బస్తీలా ఉంటుంది. దేశం అభివృద్ధి చెందింది కదా" అన్నారు.

అక్కడ, ఆ పల్లెలోని ప్రకృతి సంపద చూసి ముగ్ధురాలైపోయింది పల్లవి. చక్కని పెద్ద కాలువ, ఆ కాలువకంటుకుని రెండు పక్కలా ఒంగి తమ ప్రతబింబాలు నీటిలో చూసుకుంటున్న కొబ్బరి చెట్లు, దానిని ఆనుకుని రోడ్డు...

"ఈ రోడ్డుమీద పరిగెత్తాలనిపించడం లేదు మీకు మిస్టర్ కుమార్" అంది పల్లవి.

"పరుగెట్టండి నిజంగానే పరుగెట్టండి— వెనకనుంచి ఎద్లు గుంపుగా వస్తున్నాయి" అని అరిచాడు పవన్‌కుమార్.

వెనక్కి చూసింది పల్లవి.

రంకెలు వేసుకుంటూ వస్తున్నఎద్లు. మువ్వలు గంటల గలగలలు— అంతే హడిలిపోయి "అమ్మో" అంటూ పవన్ వైపు ఒక్క అడుగువేసింది. ఆమెని పొదివి పట్టుకున్నాడు పవన్.

ఒక్క అయిదు నిముషాలలో వాళ్ళకి అటు ఇటు అన్ని ప్రక్కల ఎద్లు పరుగెత్తాయి. ఎద్దులు, ఆవుల సముద్రం మధ్యన ఉన్నట్లుంది. తరువాత కాసేపటికి ఆ సందడి అంతా తగ్గింది. అవి రేపిన దుమ్ము అణిగింది.

ఇంకా తననే అంటిపెట్టుకుని ఉన్న పల్లవిని పవన్ నిదానంగా తట్టి "పల్లవిగారూ" అంటూ తన చుట్టూ ఉన్న ఆమె చేతులని మెల్లిగా సడలించాడు.

సిగ్గుపడి వెడంగా జరిగి "చాలా భయపడి పోయాను మిస్టర్ పవన్" అంది పల్లవి.

అంతలోనే ఆటువచ్చిన కృష్ణమోహన్‌గారితో "ఏం సార్ అన్ని మనవేనా ?" అనడిగాడు పవన్.

అక్కడున్నన్ని రోజులూ సరదాగా గడిచి పోయింది కాలం. వచ్చేసే రోజు ముగ్గురూ గుడికి వెళ్ళారు. ఆ గుడికి కృష్ణమోహన్‌గారే ధర్మకర్త.

"పెళ్ళెప్పుడు బాబుగారు," అనడిగాడు పూజారిగారు పల్లవిని, పవన్‌ని చూసి.

నవ్వి కూతురు వంక చూశారాయన. ఆమె పవన్ వంక చూసింది. అతను మాత్రను ఏకాగ్రతతో ధ్యానంలో ఉండిపోయాడు.

బయటకు వచ్చేస్తుంటే అక్కడి పొదల్లో ఆమె పమిట చిక్కుకుపోయింది. వాటితో ఆమె పెనుగులాడుతుంటే పవన్ గభాలున వెనక్కి వచ్చి "ఈసారి సమయానికి కొంచెం ఆలస్యం అయ్యాను" అంటూ ఆమె పమిటని ఆ ముళ్ళనుంచి తప్పించాడు.

అతని వంక చూసి "థాంక్స్" అంది పల్లవి.

కృష్ణమోహన్‌గారు పెట్టిన ఆర్నెల్లలో ఇంక ఒక్కరోజు మాత్రం ఉందనగా పవనకుమార్ వచ్చాడు పల్లవి దగ్గరకు. కుర్చీ ఒకటి లాక్కుని ఆమెకి దగ్గరగా కూర్చుని "పల్లవిగారు. నేను మీ ఫాదర్ దగ్గర జీతానికి కుదిరిన ఉద్యోగిని. యజమాని చెప్పిన పని చేయడం భృత్యుడి కర్తవ్యం. కనుక నన్ను క్షమించండి" అంటూనే ఆమె చేతికి ఒక పెద్ద కవరిచ్చి "ఇవి ఫొటోలు, తీసి చూడండి" అన్నాడు.

తీయడమే తెల్లబోయింది పల్లవి. తను, పవన్ ఉన్న ఫొటోలవి. అన్నీను! ఎక్కువ వాటిల్లో తను అతని కౌగిట్లో ఉంది! "ఇదేమిటి ?" అంది ఆమె.

"అవి ఇటివ్వండి. వరుసగా ఇస్తాను మీకు. ఇది నంబర్‌వన్. పైనుండి దీపాల గుత్తి పడి పగిలినప్పుడు."

చూసింది పల్లవి. అతని చేతుల్లో ఉంది. అతని మెడచుట్టు తన చేతులు!

"ఇది నంబర్ టూ. మంచంమీద తేలు సీను. వెనక్కి తిరిగి "నవ్వండి. భయంలేదు నేనుండగా మీకేం భయం" అంటున్నాన్నేను. ఇది మూడు అదుగో పరుపుమీద అక్కడ ఉన్నాం ఇద్దరమూను. మీకు చెమటలు పట్టేస్తే కర్చీఫు ఇస్తూ "ఊ, ముఖం చక్కగా తుడుచుకోండి" అంటున్నాను. ఇంచుమించు నేను తుడుస్తున్నట్లే ఉంది కదూ ?"

"ఉంది" అంది పల్లవి ఆ ఫొటో చూపి అతనికిస్తూ.

"నాలుగు. పిల్లుల పోట్లాట. మిమ్మల్ని మంచంమీద పడుకోబెట్టి మీ ముఖం అటు ఇటు తిప్పుతున్నాను స్పృహ తెప్పించేందుకు. అయిదు అక్కడ పల్లెలో ఎద్లు సీను. మిమ్మల్ని పొదివి పట్టుకున్న సన్నివేశం. అరవది — గుడి దగ్గర మీ పమిట ముళ్ళలో చిక్కుకుంటే తీశాను" అని నవ్వి "ఇవి ముఖ్యమయినవి. ఇవికాక ఇంకా మనం కారమ్స్ ఆడినవి, టేబుల్ టెన్నిస్ ఆడినవి చాలా ఉన్నాయి. ఫొటోగ్రాఫర్ మీ నాన్నగారు" అన్నాడు.

"ఈ ఫొటోల కోసం దీపాలు మార్పించారు ఇంట్లో! మొత్తం అలంకరించారు అవునా ?" అంది పల్లవి.

పవన్ నవ్వి "అంతేకాదు. మీరు గమనించారో లేదో కాని మీకు కొత్తబట్టలు కొన్నారు — వాటితో మాచ్ అయేలా నాకూ కొన్నారు" అన్నాడు.

"ఏమిటి డాడీ ఇదంతా ?"

"ఏముందమ్మా, నాకు చిన్నతనం నుంచి ఏ పరీక్షకు కట్టినా బాగా ప్రిపేరు కావడం అలవాటు. పందెం అయినా అంతే. నా శక్తినంతా వినియోగిస్తాను ... ముఖ్యమయిన విషయం ఈ ఫొటోలన్నీ మీ సుధీర్‌కి కాపీలు పంపాను. ఇక నా పనయిపోయింది. నీ ఇష్టం వచ్చినప్పుడు అతన్ని నువ్వు పిలిపించుకోవచ్చును. మన పందెం క్లైమాక్స్‌కి వచ్చింది ... పవన్ నువ్వు ఆఫీసుకి రా, నే వెడుతున్నాను" అని వెళ్ళిపోయారు ఆయన.


ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు కాసేపు. చివరికి పల్లవి అంది — "మిస్టర్ పవన్, ఇప్పుడు ఇదంతా ఇంచుమించు బ్లాక్‌మెయిల్ కింద వస్తుంది. చదువుకున్నవారు మీరు ఇందుకు సహకరించారు మా ఫాదర్‌తో ?" అని.

ఏం మాట్లాడలేదు పవన్.

"చెప్పండి. నేనేమీ అనుకోను."

"చచ్చిపోతాడన్న రోగికి కూడా బతుకుమీద ఆశ ఉంటుంది మిస్ పల్లవీ, నేనూ అంతే! ఆశ మనిషిని అలా చేయిస్తుంది."

"అంటే ?"



మల్లెల మాసం

"మీరంటే నా కిష్టం. అయి లైక్ యూ. అయి లవ్ యూ! ఏదో దైవ వశాన ఇది తప్పక పోతుందా మీరు నాకు లభ్యమవకపోతారా అన్న ఆశ! మీరు బాధపడితే నన్ను క్షమించండి" అంటూనే వెళ్ళిపోయాడు గదిలోంచి.

వెళ్తున్న అతని వంకే చూస్తుండిపోయింది పల్లవి.

పదిరోజులయినా పల్లవి సుధీర్‌కి కబురంపక పోవడంతో కృష్ణమోహన్ వచ్చి ఒకరోజు "ఇంకో అయిదు నిముషాలలో సుధీర్ వస్తాడు. నువ్వు ఆలస్యం చేస్తున్నావని నేనే కబురంపాను" అన్నారు.

సుధీర్ వస్తూనే "కంగ్రాట్స్ మిస్ పల్లవీ. అయాం సారీ 'మిస్' అనకూడదేమో!" అన్నాడు.

"అదేమిటలా మాట్లాడుతున్నావు" అంది పల్లవి తెల్లబోతూ.

"అవును ఊరంతా అనుకుంటున్నారు, మీ ఇంట్లో ఉండే కుర్రాడితో నీ పెళ్ళి అయిపోయిందని లేక అవబోతోందని"

"నమ్మావా?" అంది అయోమయంగా.

"నమ్మక?" అంటూనే బ్రీఫ్‌కేసులోంచి కవరు, అందులోంచి ఫోటోలు తీసి ఆమె వడిలో పడేశాడు.

"నమ్ముతున్నావా?" అంది మళ్ళీ పల్లవి.

"అన్నీ గాఢ పరిష్వంగనాలే. నమ్మక ఏం చేయాలో నాకు తెలియదు."

"అవి అనుకోకుండా జరిగినవని గ్రహిస్తారను కున్నాను సుధీర్" ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అలా అని అనుకోవాలని నీ ఉద్దేశం. పల్లవీ, నువ్వే చూడు, అన్నిటిలోను నీ కళ్ళు మూసుకుని తన్మయత్వంలో ఉన్నట్టు లేవూ? నీ పరువు మీదికి వచ్చే ధైర్యం ఎవరికుంటుంది నీక్కాబోయే భర్తకి కాక నీకు భర్తయిన వాడికి తప్ప! ఈ కొబ్బరి చెట్ల మధ్య కౌగిలింత, ఈ గుడి దగ్గర నీ పమిట అతని చేతుల్లో — పల్లవీ ఇన్ని చూసి నన్ను నేను ఆత్మవంచన చేసుకోలేను."

"ఏమని ఆత్మ వంచన?"

"నువ్వు ఆ కుర్రాడిని ప్రేమించడం లేదని, అతనితో తిరగలేదని ఎన్నిసార్లు నచ్చచెప్పకుండా మన్నా మనస్సంగీకరించడంలేదు పల్లవీ! నేను పవిత్రంగా ఉన్న మగాడిని. నేను ఆశించేది నాకు పవిత్రంగా ఉన్న ఆడది భార్య కావాలని."

"సుధీర్... స్టాపిట్. నీ హద్దు దాటుతున్నావు. ఇక్కడ పవిత్రత చెడిన ఆడవాళ్ళెవరూ లేరు. దేముడు నిజంగా నాయందున్నాడు. నీ నిజమయిన రూపం ముందే తెలిపాడు. ఇదే పెళ్ళయాక ఎవరయినా నా ఫోటో ఒకటి తీసుకువస్తే వదిలి వెళ్ళిపోయేవాడివి. నమస్కారం పెద్ద నమస్కారం ఇక వెళ్ళిపో. నీ 'పవిత్రత'తో నన్ను విసిగించకు. ప్లీజ్" అంటూనే అతను వెళ్ళాడో లేదో చూడనయినా చూడకుండా 'ఇంటర్‌కాం' లో "డాడీని, పవన్‌ని రమ్మను" అంది పల్లవి.

వస్తూనే "అంతా విన్నాను బేబీ. గెలుపు నాదే!" అన్నారు కృష్ణమోహన్.

"ఆగండి డాడీ, నేను ఓడిపోయానని ఒప్పుకుంటాను. అందువల్లనే ఈ అతి పవిత్రుడ్ని వదిలేశాను. అయితే నా తరువాతి స్టెప్ వేయాలి. మీరు కాసేపు మాట్లాడకూడదు డాడీ ప్లీజ్" అని పవన్‌వైపు తిరిగి "సూటిగా అడుగుతున్నాను మిస్టర్ పవన్, 'ఐ లైక్ యూ, ఐ లవ్ యూ' అన్నారు కదు మీరు" అంది.

"కరెక్ట్. ఇప్పటికీ అంటున్నాను" అన్నాడతను.

"బేబీ" అరిచారు కృష్ణమోహన్.

"మాట్లాడకండి డాడీ; ఇది నా జీవితం గురించి! ... మిస్టర్ పవన్, ఆ ఫోటోలలో మీతో అలా ఉండడం వల్లనే నా శీలం చెడిపోయిందను కుంటున్నాడు ఈ ప్రబుద్ధుడు.

అయితే, అతనూ నేనూ అయిదు సంవత్సరాల పాటు, కలిపి తిరిగాం. ఎంతగానో ప్రేమించు కున్నాం, అర్థం చేసుకున్నాం అనుకున్నాను నేను! మరి ... మరి మీకు నా శీలంమీద నమ్మకం ఉందా?"

"నాకు దృఢమయిన నమ్మకాలున్నాయి మిస్ పల్లవీ, మొదటిది ఒక సంస్కారంగల, ఆత్మాభిమానం గల యువతి ఎప్పుడూ తప్పటడుగు వేయదు. హద్దుమీరి అవతలి వారికి తేలికయిపోదు.

మీరడిగిన ప్రశ్నకి ఇదే నా సమాధానం.

"మరి నన్ను గురించి ఒక్కమాట చెప్పాలి కద. మనదేశంలో ఆడదానికొక నీతి మగవాడికొక నీతి ఉండడం మన దౌర్భాగ్యం. మగవాడు తప్పులు చేసినా 'మగమహారాజు' అని ఈ ఆడవాళ్ళే క్షమిస్తారు. నాకు అది అసహ్యం. న్యాయం, నీతి అన్నవి ఇద్దరికీ ఒక్కలాగానే ఉండాలి.

మీ పవిత్రతని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. అలాగే నేనూ అటువంటి వాడినే అని ధైర్యంగా చెబుతున్నాను. నేను 'చనువు'గా ఉన్న మొట్ట మొదటి ఆడపిల్ల మీరే!

మీరు నన్ను చేసుకునేందుకు అంగీకరిస్తే అది నా అదృష్టంగా భావిస్తాను" అన్నాడు పవన్‌కుమార్.

"బేబీ, ఏమిటిదంతా — స్టాప్ దిస్ నాన్సెన్స్. నీ లెవల్ ఏమిటి, నీకు వీనెటువంటి సంబంధాలు తెస్తానో చూడు" అడ్డం పడబోయారు కృష్ణ మోహన్.

డాడీ, నేను ఓడిపోయానని ఇందాకనే చెప్పాను. అయితే మీరు గెలవలేదు. నేను పవన్‌ని చేసుకుంటాను. ఏడు అడుగులే కాదు, చాలా అడుగులు అతనితో కలిసి నడిచాను" అంది పల్లవి.

"థాంక్స్ పల్లవీ, ఇంకో విషయం కూడా చెప్పాలి. మీ నాన్నగారు ఆర్నెలలు తాను చెప్పిన పనులు ఎదురు చెప్పకుండా చేస్తే నాకు మంచి ఉద్యోగం ఇస్తానన్నారు. నేను "మీరు ఇవ్వద్దు. బయట ఎక్కడయినా ఇప్పించండి' అన్నాను.

ఇదిగో ఈ రోజే మా అగ్రిమెంట్ ప్రకారం ఇప్పించారు. కనుక గౌరవంగా బ్రతికేందుకు నాకు ఆదాయం ఉంది. నిన్ను పోషించగలనన్న ధైర్యమూ ఉంది. వస్తావా మరి నాతో?"

"వస్తాను పదండి" అంది పల్లవి అతని చేయిపట్టుకొని. ★




"అంత ప్రత్యేకత ఏముందని సర్ఫ్‌లో ? ఉతికే పౌడర్లన్నీ, నా ఉద్దేశ్యంలో ఒకటేననుకుంటు-కాదా ?"

అని రాస్తున్నారు శ్రీమతి శీలా సింగ్-లింకింగ్ రోడ్, ఖార్, బొంబాయి.

మేం శ్రీమతి శీలా సింగ్‌ను మా రీశెర్చ్ లేబరేటరీకి ఆహ్వానించాం—బాగా మాసిన తెల్ల చొక్కాని ఉతికే పరీక్ష చేసి చూపిద్దామని.


చొక్కాని రెండుముక్కలుగా చేసాం, ఒక్కముక్కలో నిరూపిద్దామని.



పైన పేరులేని రెండు డిటర్జంట్ ప్యాక్‌లలోంచి పౌడర్ తీసి రెండు ద్రావణాలు తయారుచేసాం పైపై మురికి పోయేందుకు చొక్కా ముక్కల్ని మామూలు నీటిలో పిండాక, ఒక్కొక్క చొక్కా ముక్కని ఒక్కొక్క ద్రావణంలో నానబెట్టాం అలా ఆ చొక్కాముక్కలు నానుతూండగా

నీటికింద ఏం జరుగుతోందో వివరించి చెప్పాం-

మురికి తాలూకు ప్రతి అణువునూ వదలగొట్టేందుకు సర్ఫ్‌లో చురుకైన చర్యగల పదార్థాలు అత్యధికంగా ఉన్నాయి. ఆ ద్రావణంలో బట్టని పిండితే కలిగే ప్రయోజనం అందువల్లే మరి అంతేకాదు, సర్ఫ్‌లో గల ఒక ప్రత్యేక పదార్థం, వదలగొట్టబడిన మురికిని వేరేగా ఉంచుతూ అది తిరిగి బట్టలపైకి చేరుకోకుండా నిరోధిస్తుంది.



ఖచ్చితమైన గెలుపు

ఆ చొక్కా ముక్కలు పిండబడ్డాయి వాటిలో తేడా స్పష్టంగా కనిపించింది—సర్ఫ్‌లోని తెలుపుచేసే ప్రత్యేక పదార్థం వల్ల

"అనుకోనేలేదు నేనెప్పుడూ, సర్ఫ్ యింతగా పనిచేస్తుందని" అంది శీలా.

మేం ఆమెకి చెప్పాం, ఎక్కువ మంది గృహిణులు సర్ఫ్‌నే వాడతారని. ఎందుకంటే సర్ఫ్ కేవలం అత్యుత్తమ ఉతికే పౌడర్ మాత్రమే కాదు, అది ఆపేక్షతో శ్రద్ధని చూపే తీరు



హై పవర్ సర్ఫ్

అమిత తెల్లగా ఉతుకుతుంది...అమిత తెల్లగా, కనువిందుగా!

తెల్ల బట్టలకి సెబాష్ తెలుపు, రంగు బట్టలకి సెబాష్ గెలుపు

LINTAS-SU 255 2316 TL

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

సీరియల్

ధర్మో రక్షతి రక్షితః

ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ

(గత సంచిక తరువాయి)

3

దీక్షితులుగారు బ్రహ్మయజ్ఞం, సంధ్యావందనాది నిత్యకర్మలను పూర్తి చేసుకుని, బయటికొచ్చేసరికి అరుగుమీద కూర్చుని వున్నాడు గోదావరిశాస్త్రి.

"క్షేమంగా వున్నారా ?" దీక్షితులుగారు పలుకరించేరు.

"మీ కార్యక్రమానికి అంతరాయం కలుగలేదు కదా ?" గోదావరిశాస్త్రి వినయంగా ప్రశ్నించేడు.

"అదేం లేదు...మీరు మజ్జిగ పుచ్చుకున్నారా? అమ్మా మీనాక్షీ ! శాస్త్రిగారికి మజ్జిగ తీసుకురా" లోపలికి కేకేశారాయన.

"అబ్బే వద్దండి ... భోజనాల వేళయిందిగా!" అన్నాడతను.

"సరే ... అలాగే చేద్దురుగాని. ఈ పూట మా ఇంట్లో దేవతార్చన చేసుకుని వెళుదురుగాని" అన్నారు దీక్షితులుగారు.

మీనాక్షి గ్లాసుతో మజ్జిగ తీసుకుని వచ్చింది. పందొమ్మిదేళ్ళ మీనాక్షి లక్ష్మీదేవిలా ఘల్లు ... ఘల్లుమని గజ్జెల శబ్దం చేస్తూ వచ్చింది. ఎర్రటి విగ్రహం ఆమెది. ఆరోగ్యంగా ఎదిగి నిండుగా వుందామె.

"ఇదిగో ... మజ్జిగ."

"వద్దుటమ్మా! ఆయన కాస్సేపుండి, భోంచేసి వెళతారు" అన్నారు దీక్షితులుగారు.

మీనాక్షి తండ్రి ముఖంలోకి చూసి లోపలికి వెళ్ళిపోయింది. మజ్జిగ గ్లాసుతో లోనికివచ్చి మండువాలో నిలబడింది. బయట మాటలు ఆమెకు వినబడుతూనే వున్నాయి.

"నరసాపురం వెళ్ళేరా ?" ప్రశ్నించేరు దీక్షితులుగారు.

"వెళ్ళకేం ... నిన్నరాత్రే తిరిగి వచ్చేను. ఏం ప్రయాణమో...ఒళ్ళు హూనం అయిపోయింది."

"వాళ్ళని కలిసేరా ?" ఆత్రంగా అడిగేరు దీక్షితులుగారు.

"చిత్రం... ఆ కార్యం అనుకూలం అయ్యేట్టుగా తోచదు."

"అంటే... ?"

"ఏముందీ... మనం ఇస్తామన్న కట్నమే. వాళ్ళకి నచ్చుబాటు కాలేదేమో... ఏదో వంక పెడుతున్నారు."

"ఏమనీ... ?"

"పిల్లకి చదువు తక్కువట. వాళ్ళబ్బాయి ఉద్యోగస్తుడు కావటం వల్ల చదువుకున్న పిల్లయితే వాళ్ళకి అమురుతుందటున్నారు.'

"మన పిల్ల చదువు విషయం వాళ్ళకి తెలిసే పెళ్ళి చూపులకొచ్చారు కదా... ?"

"అయ్యో ! నేను మనవి చేసిందేమిటి ? ఇవన్నీ వంకలు కానీ !... వంకలేనమ్మ డొంక పట్టుకుని ఏడ్చిందని... పోనీయండి. ఇది కాకుంటే మరో సంబంధం."

దీక్షితులుగారు గోడకి జేర్లబడి, యజ్ఞోపవీతాన్ని చేత్తో పట్టుకుని ఆలోచనలో పడ్డారు.

వచ్చిన సంబంధం ఏదోరకంగా తెగిపోతోంది. అంటే దానికి కారణం మీనాక్షి కురూపని కాదు. అందగత్తె... చదువు సంధ్యలు అంటే ఇంగ్లీషు చదువులు లేకపోయినా భారత భాగవతాదులు చదివి అర్థం చెప్పగలదు. పనిపాటలా... తీరువైన పిల్ల, మరిఎందువల్ల తెగిపోతున్నాయి?...డబ్బుకారణంగా... ప్రతి సంబంధం చేయిజారిపోతోందంటే కారణం డబ్బు. సాంప్రదాయాలకన్నా, అంద చందాలకన్నా అన్నిటికీ అతీతమైనదీ, అద్వితీయమైనది అయి కూర్చుంది డబ్బు.

"మరి... పాలకొల్లులో మరో సంబంధం వుంది కాని... అది మనకి అట్టే లాయకీ అయింది కాదు. వాళ్ళు జన్మచేత బ్రాహ్మణులు. కాని అబ్రాహ్మణులు."

"ఎందువల్ల ?"

"ఎందువల్లా అంటే ఏం చెప్పమంటారూ ? ఉదయం లేచి బ్రహ్మయజ్ఞ పితృ తర్పణాలు... దేవతార్చన మాట అటుంచి... నిత్య సంధ్యావందనాది అనుష్టానాది నిత్యకృత్యాలు కూడా జరుపరు. పొద్దున్నే లేచి పాచిముఖాన్నే కాఫీలు...రామ రామ..."

దీక్షితులుగారు మాట్లాడలేదు. మీనాక్షి మండువా లోగిలిలోంచి బరువుగా నడచుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

"మరేమిటి దారి ?" ఆలోచిస్తూ అన్నారు దీక్షితులుగారు.

"ముక్కామలలో కప్రి చంద్రశేఖరశాస్త్రి గారని... ఆర్షవిద్యా సంపన్నుడొకాయన వున్నారు. వారికో అబ్బాయి వున్నాడు. గ్రామ పౌరోహిత్యం నిర్వహిస్తున్నాడు. అంతా దివ్యంగా వుంది. అయితే కుర్రాడు కాస్త పీలగా వుంటాడు. వరహీన మౌతుందని... వెనకాడుతున్నాను."

"మరీ సన్నమా ?"

"సన్నమా అంటే... సన్నమనే చెప్పాలి."

"ఏదో చెప్పేసి... మీకు ముడెట్టేసి వెళ్ళిపోదామనే ఉద్దేశంలో ఉన్నవాణ్ణి కాను నేను. మన పిల్ల పొడగరి. ఆకాడి నీళ్ళు పడితే పిల్ల ఇంకా వళ్ళు చేయచ్చు. ఇక ఆ కుర్రాడు ఇప్పుడే తడవలా వున్నాడు."

"ఆయన్ని స్నానం చేయమంటోంది అమ్మ" లోపలనుంచి వచ్చేడు గౌతమ్.

"మీరు స్నానం చేయండి... గౌతమా వారికి నుయ్యి చూపి, బొక్కెన ఇవ్వు" అన్నారు దీక్షితులుగారు.

గోదావరిశాస్త్రి లేచి నూతి దగ్గర కెళ్ళాడు.

4

మీనాక్షి పుస్తకాలు పుచ్చుకుని ఉపగ్రంథాలయం దగ్గరకొచ్చింది. ఆమె పుస్తకాల్ని తీసుకునివచ్చేసరికి గ్రంథాలయం గుమాస్తా కట్టేసి వెళ్ళిపోతున్నాడు.

"రండి ... సరిగ్గా మీరు కట్టేసే టైముకే వస్తూ వుంటారు" నవ్వేడతను.

మీనాక్షి చేతిలో పుస్తకాలు చూస్తే దీక్షితులుగారు మండిపడతారు. తెలుగు నవలలలో చదవ తగినవి విశ్వనాథవారి నవలలు తప్పించి మరేమీ లేవని ఆయన దృఢ విశ్వాసం. అందువల్ల సీరియల్ నవలలు, వారపత్రికలు చదివి చెడిపోతారన్నది ఆయన నమ్మకం. అందువల్ల మీనాక్షి పుస్తకాలూ, వారపత్రికలు ఆయన ఇంట్లో లేనప్పుడు తెచ్చుకోవాల్సిందే. ఆయన చూడకుండా చదువుకోవాల్సిందే. అందువల్ల ఆమె సాధారణంగా తండ్రి ఏ నందిసావిడికో వెళ్ళేకా —

జరిగిన కథ — 5 యజ్ఞన్న దీక్షితులు సనాతనుడు. ఆయన భార్య లలితాంబ. వారి సంతానం పరమేశ్వరశాస్త్రి, శ్రీరాముడు, గౌతమ శాస్త్రి, మీనాక్షిలు. పరమేశ్వరశాస్త్రి తండ్రివద్దనే వేదాధ్యయనం చేస్తుంటాడు. శ్రీరాముడు అమలాపురంలో చదువుకొంటానంటాడు. దీక్షితులు పెద్దకుమారుడు పరమేశ్వరశాస్త్రికి, ధూళిపాళ సోమయాజులు ప్రథమ పుత్రిక సుబ్బలక్ష్మికి బాల్య వివాహం జరిపిస్తారు. గృహప్రవేశం అనంతరం పనిలో పనిగా గౌతమ శాస్త్రికి ఉపనయనం కూడా జరిపించేస్తారు దీక్షితులుగారు. సోమిదేవమ్మ మరణంతో ఓ తరం మారిపోతుంది. శ్రీరామ్ ఎస్.ఎస్.ఎల్.సి పాసవడంతో పాలిటెక్నిక్ చదువుతానంటాడు. దీక్షితులుగార్కి ఇష్టం లేకపోయినా లలిత నచ్చ చెప్పడంతో అంగీకరిస్తారు. తన చదువు అయ్యే వరకూ పెళ్లి చేసుకోనని తండ్రితో ఖచ్చితంగా చెప్పేస్తాడు శ్రీరామ్. తన కూతురి పెళ్లి కోసం అప్పు కోసం ఆనందరావ్ దగ్గరకు వెళ్లిన దీక్షితులు ఎన్నడూ ఊహించని విధంగా అవమానం పాలౌతాడు. శ్రీరామ్ చదువు పూర్తయినా రికమెండేషన్, డబ్బూ లేకపోవడంతో కులం పెద్దదవడంవలన వుద్యోగం రాదు.

గ్రంథాలయానికి బయలుదేరుతుంది ఆ వేళకి . గ్రంథాలయం కట్టేసే వేళవుతోంది

గ్రంథాలయం గుమాస్తా ఇరవై అయిదేళ్ళవాడు నొక్కుల జుట్టు, నల్లగా పొడుగ్గా వుంటాడు ఎప్పుడూ తెల్లటి దుస్తుల్లో వుంటాడు ఆప్యాయంగా మాట్లాడతాడు

ఆమెను చూడగానే తాళం తీశాడు ఇద్దరూ లోనికి అడుగుపెట్టారు

"రండి . యద్దనపూడి నవల్సు అన్నీ చదివేశారుగా ?" అడిగేడతను, ఆమె తెచ్చిన పుస్తకం ఎంటర్ చేస్తూ

ఆమె తలూపింది.

"కోడూరి కౌసల్యాదేవి నవల్సు వచ్చేయి చూశారా ?"

"లేదండి .."

"ఆ బీరువాలో వున్నాయి .."

మీనాక్షి బీరువా తెరిచింది. బీరువానిండా పుస్తకాలు ఎన్నో కథల్ని చదువుకుని గంభీరంగా వుంది

ఒక్కొక్క పుస్తకం తిప్పి చూస్తోందామె ఆమెకు ఏదో కంగారుగా వుంది ఒంటరితనం గదిలో తనూ — అతనూ — గదిలో చీకటి పరుచుకుంటోంది. ఆమెకేదోగా వుంది. పుస్తకాల పేర్లు గజిబిజిగా వున్నాయి

అతను లేచొచ్చి ఆమె వెనుకగా నిలబడి

"అవన్నీ కొత్త పుస్తకాలే " అన్నాదు

అతని ఊపిరి ఆమె భుజానికి వేడిగా తగులుతోంది ఆమె ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

ఒకరికొకరు మరీ దగ్గరయ్యేరు.

అతనామె ముఖంలోకి రెప్ప వేయకుండా చూస్తూ "మీరచ్చు బాపు బొమ్మలా వుంటారండీ" అన్నాదు

ఆమె కాళ్ళు నేలకు అతుక్కుపోతున్నాయి. అక్కడినుంచి పారిపోవాలని .. ఆమె మనసులో భావం కాని కదలలేకపోతోంది వయస్సు ఆమెను ఆవహించుకుంది సిగ్గుతో తల దించుకుంది

"నేను వెళ్ళాలి" ఆమె గొంతు ఆమెకే కొత్తగా అనిపించింది


"వెళ్దురుగాని మీరు కనపడేదే అరుదు దేవత కనపడినప్పుడే భక్తుడు కళ్ళనిండా మూర్తిని చిత్రించుకోవాలి" నెమ్మదిగా అన్నాడు.

అతని మాటలు ఆమెకు వీణ మీటినట్లు మృదుమధురంగా వుంది

"ఈ రెండు పుస్తకాలూ తీసుకుంటాను" అందామె ఆ పుస్తకాల పేర్లు కూడా చూడలేదు.

"నా దగ్గర ఇంకా మంచి పుస్తకాలున్నాయి. కానయితే అవి గ్రంథాలయంలో లేవు ఇంటి దగ్గరున్నాయి "





"ఇవి చదివిన తర్వాత తీసుకుంటాను."

"అయితే ఎప్పుడొస్తారూ?"

"గదిలో చీకటి చిక్కబడుతోంది."

"ఇవి చదివిన తరువాత మళ్ళీ వస్తాను." అంటూ ఆమె ఒక్క ఉదుటున బయటికొచ్చింది.

ఆమె గుండెలు గబగబా కొట్టుకుంటున్నాయి. గ్రంథాలయం వదిలి రోడ్డు మీదకొచ్చినా ఆమెకా గుండె దడదడ తగ్గలేదు. అతనింత దగ్గరగా ఎన్నడూ రాలేదు. తనని చూడగానే ఆప్యాయంగా పలకరించేవాడు. అంతే. అలాంటిది ఏమిటతని ప్రవర్తన? 'దేవత కనబడినపుడే భక్తుడు కళ్ళనిండా మూర్తిని చిత్రించుకోవాలి.'

అతడన్న మాట ఆమె మరోసారి మననం చేసుకోవడంతో మనసు పురి విప్పిన నెమలిలా నాట్యం చేసింది. ఆమెకు జ్ఞానమొచ్చి ఇన్నేళ్లయింది. ఆమె ఇల్లు కదలటమే తక్కువ... ఇన్నేళ్లలో ఎక్కడా ఎప్పుడూ విననిమాట. తన ఆనందాన్ని ప్రశంసిస్తూ వినబడిన మాట. ఆమె మనసుకది ఆనందోద్రేకాన్ని కలిగిస్తోంది.

వయసు ఆమెను ఊయలలూపుతోంది. మనసు కళ్ళెం వేస్తోంది.

"ఏంటోయ్! ఎక్కడికెళ్ళి వస్తున్నావు?" రత్నం పలకరించింది. చంటిపిల్లనెత్తుకు వస్తోంది.

"నువ్వెక్కడి నుంచీ...?" ఎదురు ప్రశ్న వేసింది మీనాక్షి.

"ఆచార్లుగారింటికి వెళ్ళేను... పిల్లకు విరేచనాలు..."

"అలాగా!"

"పళ్ళ విరేచనాలు అన్నారులే. పళ్ళు వచ్చే ముందు అలా వెళ్తాయట... ఇంతకీ నువ్వెక్కడ నుంచీ...?"

"సత్యవతి ఇంటి నుంచి" అంది మీనాక్షి.

"పుస్తకాలు...?"

"అదే ఇచ్చింది."

ఇద్దరూ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. మీనాక్షి ఆమెతోపాటు నడుస్తోంది. మాట్లాడు తోంది కాని... ఆమె మనసు నిండా మాత్రం... ఆలోచనలు... ప్రశ్నలు. తనెందుకు రత్నంతో అబద్ధం చెప్పినట్టు? తను

ధర్మో రక్షతి రక్షితః

గ్రంథాలయం నుంచి వస్తున్నట్టు ఎందుకు చెప్పలేదు? తనెందుకు తడబడింది? ఎన్నడూ లేనిది దాచాల్సిన విషయమని తనెందుకు అనుకుంది?

తన మనసు అతనిపట్ల ప్రలోభపడుతోందా? ఛ... ఛ... అతనెవరో తనకు తెలియదే...? మరెందుకు తనలా చెప్పినట్లు?

"నేను వుంటానే" రత్నం తనింటికేసి వెళ్ళిపోయింది.

మీనాక్షి ఇంటికొచ్చింది. చిన్నగదిలో కూర్చుని పుస్తకం తెరిచింది. పదిపేజీలు చదివేసరికి ఆరు అడుగుల ఆజానుబాహువు, అరవింద దళాయతాక్షుడు, కెన్సల్స్ బూట్సు తప్ప తొడగనివాడు, ప్లిమత్ కారు తప్ప ఎక్కనివాడు, సూటు తప్పించి వేయనివాడు ... అయిన కథానాయకుడు కథలోకి దిగిపోయేడు. పేదింటి పిల్లకి హృదయం ఇచ్చేసి ఆమె చుట్టూ పరిభ్రమిస్తున్నాడు.

మీనాక్షి మనసు ఒక్కొక్క పేజీచదువుతుంటే ఆనందంలో మునిగి తేలుతోంది. ఆమె చదువుతూనే వుంది. ఆమె కళ్ళ ముందు రంగు రంగుల స్వప్నాలు.

5

"దేశంలో... ఇంకా... ఇంకా కాలేజీలు పెంచేస్తున్నారు. ఉద్యోగాలు మాత్రం పెంచలేక పోతున్నారు. డిగ్రీ కాగితాలు ప్రెస్సుల్లో ముద్ర వేస్తున్నారు. అధికారులకు తీరుబడి లేకుంటే... 'ఫర్' అని గుమ్మాస్తాలే సంతకాలు పెట్టేస్తున్నారు. కాని ప్యాసయిన ఎవరికీ ఉద్యోగం చూపించలేక పోతోంది ప్రభుత్వం. పట్నాల కెగబడకండి... పల్లెలకెళ్ళండి అంటుంది ప్రభుత్వం. పల్లెలోకెళ్ళి ఏం చేయడం? గడ్డి పెరకమా? ఆ గడ్డి కోసుకునే వాళ్ళకే పనుల్లేవు" ఆవేశంగా అన్నాడు శ్రీరామ్.

"అదికాదు గురూ... వీలయితే ఆ గడ్డి కోసుకునేవాణ్ణి, ముందు చదువుకోమంటుంది. ఆ తర్వాత వాడా గడ్డి కోసుకునే విద్య కూడా మరచి పోతాడు." మరొకరన్నారు.

"గడ్డి కోసుకునేవాడికి విద్య నేర్పటం తప్పు కాదు. కాని... వాడికి షేక్స్‌పియర్... మిల్టన్ గురించి చెప్పటంకంటే గడ్డి కోసుకోవడంలో సులువైన పద్ధతి చెప్పాలి."

"ఆ పని ఐ.టి.ఐ.లు చేస్తున్నాయిగా. వృత్తి శిక్షణ ఇస్తున్నాయిగా."

"కాని వాడికా వృత్తి — చేసుకునే శక్తిని ఇవ్వలేకపోతున్నాయిగా."

"లేతుమీద శిక్షణ పొందినవాడు లేతు పెట్టుకుని తన కాళ్ళమీద తను నిలబడే అవకాశం ఏదీ?... వాడు ఏ కంపెనీకో ఎగబడటం..."

"ఉద్యోగాల్లో — మళ్ళీ కులాల ప్రసక్తి — వృత్తి విద్యలా పడిపోయేయి. ఉద్యోగాలా లేవు."

"కమ్మరి కొడుకు కమ్మరి...కుమ్మరి కొడుకు కుమ్మరి అయిన రోజులే బాగున్నాయేమో" అన్నారింకొకరు.

"అంటే మళ్ళీ వెనక్కి వెళ్ళాలా?" అన్నాడు శ్రీరామ్.

"అదికాదు గురూ. ప్రభుత్వ ప్రణాళికలు

ఐ.క్యూ. పెరగటానికి కారణం బలమైన ఆహారం!

జపాన్ బాలల "ఇంటెలిజెంట్ కాషంట్," సగటున 111 అని ఒక బ్రిటీషు పత్రిక తెలియచేసింది. దీనిని సంక్షిప్తంగా ఐ.క్యూ అని పిలుస్తారు. డా. రిచర్డ్ లిన్ అనే మానసిక శాస్త్రవేత్త ఇటీవల సుమారు 1100 మంది జపాను బాల బాలికలపై వివిధ పరీక్షలు జరిపారు. వీరంతా 6–16 సంవత్సరాల లోపువారే. అమెరికన్ బాలల్లో సగటు ఐ.క్యూ 100 మాత్రమేనని కూడా ఈ పత్రిక తెలియచేసింది. జపాను ప్రజల్లో కనీసం పదిశాతానికి ఐ.క్యూ. 130 కంటే హెచ్చుగా ఉన్నదని, అమెరికన్ ప్రజల్లో రెండుశాతానికే యింత ఎక్కువ ఐ.క్యూ వున్నదని ఆ పత్రిక పేర్కొన్నది. యుద్ధానంతరం జపాను ప్రజల్లో ఐ.క్యూ పెరగడానికి కారణం బలవర్ధకమైన ఆహారం కావచ్చునని భావిస్తున్నారు.


వెన్నెల మోమును
మంగళకరమైన
మెరుగు పరచటానికి
ఐటెక్స్
మాట్ ఫినిష్ తిలకం
దేశమంతటా నాగరీక యువతులు కోరి
ధరించేది ఐటెక్స్ తిలకం నారీమణుల పుష్ప
విదానాన్ని అద్భుత సౌందర్యాన్ని ప్రస్ఫుటం
చేసేటందుకే కన్నులకింపైన 14 రంగులలో
దొరుకుచున్నవి. శాస్త్రీయ విధానంలో
తయారుచేయబడు ఐటెక్స్ తిలకం
చర్మానికి ఎటువంటి హానియు కలుగజేయదు
DELUXE KUMKUM
EYETEX
SHAKE WELL
EYETEX
అరవింద్ లాబరేటరీస్
మద్రాసు 600 033

అలా వున్నాయి. విద్యావిధానం మీద వాళ్ళకో అవగాహనలేదు. రోజుకో రకంగా మార్చి దాని ఫలితాన్ని చూసి చేయి కాల్చుకుని, మరో ప్రయత్నం చేస్తున్నారు.''

యువక మండలి సమావేశం జరిగిపోతోంది సాయంత్రం... ఊర్లో పలురకాల సమావేశాలు.

నంది సావిడి దగ్గరనుండి వచ్చే గాలుల్ని పలుకరిస్తే జిల్లా రాజకీయాలు, ప్రెసిడెంటు శేషాద్రి రాజకీయ చతురత, ప్రతిద్వంది బుచ్చిరాజు గురించి అలలు అలలుగా చెబుతుంది.

గుళ్ళోంచి వచ్చే జేగంట మోతల్ని అడిగితే గుళ్ళో చేరిన ఆడవాళ్ళు... పంచదార ఇబ్బందులు, కిరసనాయిలకరువు, కట్టు తప్పుతున్న ఆడపిల్లల కబుర్లు అదేపనిగా చెబుతుంది.

మరి కాస్త ముందుకొస్తే... వేణుగోపాలస్వామి రథం కొట్టు వుంది. అందులో వేణుగోపాలస్వామి రథం వుంటుంది. ఏ రథ సప్తమికో తప్పించి దాని తలుపు తెరవరు.

ఆ రథం కొట్టు అరుగు... నిరుద్యోగమండలి కార్యాలయం. సాయంత్రం అయ్యేసరికి గుడినుంచి వచ్చే పడమల్ని చూస్తూ కొందరు యువకులు భవిష్యత్తు గురించి కలలు కంటూ వర్తమానాన్ని ద్వేషిస్తూ... వ్యవస్థని, ప్రభుత్వాన్ని దూషిస్తూ కూర్చుంటారు.

ఏడుకొండలు... కంగారుగా వచ్చేడు.

"ఒరేయ్... నాకు "పోస్టింగ్ ఆర్డర్" వచ్చిందిరా."

"ఎందులో..." మిత్రులంతా చుట్టుముట్టేరు

"రైల్వే... ఐ ఒడబ్ల్యు... అంటే... సివిల్ వర్క్స్ చూడాలి..."

"వెరీగుడ్... కంగ్రాట్యులేషన్స్..."

"నేను ట్రైనింగ్‌లో జాయిన్ కావాలి."

"ఎప్పుడొచ్చింది ... " శ్రీరామ్ ఆత్రంగా అడిగేడు.

ధర్మో రక్షతి రక్షితః

"ఇప్పుడే పోస్ట్‌మేన్ ఇచ్చివెళ్ళేడు."

శ్రీరామ్ గుండెలు గడగడ లాడేయి.

"నువ్వు చెప్పేది ఎస్. ఇ. రైల్వే?"

"అవును ... వాల్తేరు డివిజను."

శ్రీరామ్‌కి ముచ్చెమటలు పోశాయి. తనూ ఎప్లయి చేశాడు. తనకి ఆర్డర్ వచ్చిందా ?

"మీరూ ఎప్లయి చేశారుగా ... " అడిగేడు ఏడుకొండలు.

"అయితే ... నీకూ రావచ్చు గురూ, ఏడుకొండలు 50%, నీది 70%. నీకూ ఖచ్చితంగా వచ్చే వుంటుంది" ప్రోత్సాహకరంగా అన్నాడు మరో మిత్రుడు.

"ఇంటికెళ్ళి చూడు గురూ..." అన్నారెవరో శ్రీరామ్‌ని.

"నేను వస్తాను ... మా నాన్నకి చెప్పాలి" హుషారుగా అన్నాడు ఏడుకొండలు.

"కంగ్రాట్యులేషన్స్ ... ఏడుకొండలూ" అన్నాడు శ్రీరామ్.

"పార్టీ ... "

"అలాగే" కంగారుగా వెళ్ళిపోయేడు ఏడుకొండలు.

"నేనూ ... ఇంటివరకూ వెళ్ళొస్తాను" అన్నాడు శ్రీరామ్.

సిగరెట్ పీలుస్తూ ... గోడకి చేరబడిన దత్తుడు అన్నాడు మెల్లగా ...

"పంతులూ ... దూకుడొద్దు ...నీకా వుద్యోగం వచ్చివుండదు."

"ఏం ?"

"ఎర్రిపంతులూ ... ఆడు ఏ కులం ? హరిజనుడు. ఆడికి రిజర్వేషన్‌లో వచ్చివుంటుంది."

శ్రీరామ్ గుండె జల్లుమంది. తనకా వుద్యోగం రాలేదా ? ఎందుకేనా మంచిది. వెళ్ళి చూస్తే ... పోస్ట్‌మేన్ ఇంటి దగ్గర ఇచ్చాడేమో...అనుకుంటూ అరుగు దిగేడు.

"ముసలి జవాను ఇలాగే వెళ్ళిపోయేడయ్యా... నీకు ఉత్తరం వుంటే ఇవ్వడూ... పిచ్చికాని. ఏడుకొండలు చక్రాంకితాలున్న ఆచార్లు. ప్రభుత్వం ఆళ్ళకి చక్రాంకితాలేసిందిగా." అన్నాడు దత్తుడు.

శ్రీరామ్ గబగబా ఇంటిదారి పట్టేడు. అతని గుండెలు గబగబ కొట్టుకుంటున్నాయి. తనకి ఉద్యోగమొస్తే బాగుండును. నాన్న సంపాదన ఆగిపోయింది. వేదానికీ, వేదపండితులకీ ఆదరణ ఎక్కడుంది ? అన్న సంపాదన అంతంత మాత్రంగానే వుంది. వీళ్ళని కాదని తను చదువుకున్నాడు. తనకి ఉద్యోగం రావాలి. చెల్లెలు పెళ్ళి ఘనంగా చేయాలి. తల్లిని తండ్రిని కూర్చోబెట్టి తన జీతం చేతిలో పోసి... 'చూడండి చదువు ప్రయోజనం!' అని చెప్పాలి. వాళ్ళెంత తప్పుడు అంచనా వేశారో వాళ్ళకి తెలియచేయాలి.

పోస్ట్‌మేన్ అరుగుమీద కూర్చున్న తనని చూశాడా? చూస్తే తనకెందుకు ఉత్తరం ఇవ్వలేదు? తనకి రాలేదా ఉద్యోగం ? ఏడుకొండలికే వచ్చిందా ?

కులాల ప్రసక్తి లేదంటూనే అనుక్షణం కులాల్ని జ్ఞాపకం చేస్తోంది ప్రభుత్వం. తెలివితేటల్లో, సమర్థతలో తనతో పోటీకి నిలవలేడు ఏడుకొండలు. తనకి రాకుండా ఏడుకొండలకే ఉద్యోగం వస్తుందా?

దేశంలో కొన్ని కులాలు అనాదిగా అనాదరణకు గురి అవుతున్నాయి. వాళ్ళని ఉద్ధరించాలి. వాళ్ళకి పరిశుద్ధత బోధించాలి. వైద్య సదుపాయాలు కలిగించాలి. ఉచిత విద్యా సౌకర్యాలు కలిగించాలి. వాళ్ళని విద్యావంతులని చేయాలి. అంతేకాని... ఉద్యోగాల్లో రిజర్వేషనులు కల్పించటం... అది సంవత్సరాల తరబడి పొడిగించటం... ప్రతిభను చిన్నచూపు చూడటం... జాతిప్రగతిని కుంటు పరచటం... కులాలమధ్య అడ్డుగోడలు నిర్మించటమే.

ఈ ప్రభుత్వ విధానాలు ఎప్పుడు మారతాయో! పోస్ట్‌మేన్ తనకు ఉత్తరం ఇచ్చేడా ? తనకు ఉద్యోగం వచ్చిందా? ఎండ తగ్గిన తర్వాత ఆయాస

పాలు – నీరు

ఆదాయం పాలు
ఖర్చు నీరు
మొదటిది ఎక్కువై
రెండోది తగ్గితే సంతోషం
మొదటిది తగ్గి
రెండోది పెరిగితే
ఆ జీవితం 'కన్నీటిపాలు'

— కాశీనాథ & కాశీనాథ

ఇటీవల హైదరాబాదులో జరిగిన డాక్టర్ అంతటి నరసింహం రచనలు 'శంపాలత', 'చీకట్లో కాంతిరేఖలు' నవలల ఆవిష్కరణ సభలో శ్రీయుతులు ఆకురాతి కోటేశ్వరరావు, అక్కినేని నాగేశ్వరరావు, కోన ప్రభాకరరావు (ముఖ్య అతిథి), దేవులపల్లి రామానుజరావు (సభాధ్యక్షులు), ఐ. రామకృష్ణంరాజు (సాంస్కృతిక వ్యవహారాల మంత్రి), అంతటి నరసింహం, శ్రీ పి. అనంతయ్యగార్లని చిత్రంలో చూడవచ్చు.



పడుతూ ఉత్తరాలు బట్వాడా చేసే జవాను... తన పాలిట దేముడై పోయాడు.

ఆలోచనలు అల్లకల్లోలంగా శ్రీరావ్‌ని చుట్టు బెడుతున్నాయి. ముచ్చెమటలు పోస్తున్నాయి. ఒంట్లో ప్రతినరం ఎగిరి పడులోంది.

ఉద్యోగమొస్తే తిరుపతి పంపిస్తానని మొక్కు కుందిట. నాన్నకూడా... ఏ లక్ష్మీ సహస్రమో మొక్కుకునేవుంటాడు.

తనకి ఉద్యోగం వస్తుందా !... చేతులు కంపిస్తున్నాయి. క్రగేటు తెరిచేడు. గబగబా మెట్లు ఎక్కేడు.

మండువాలో కూర్చుని పుస్తకం చదువు కుంటోంది మీనాక్షి.

"నాకేదైనా ఉత్తరం..." శ్రీరావ్ పెదవులు తడారిపోతుంటే అడిగేడు.

"మీనాక్షి పుస్తకంలోంచి తలెత్తి... తల అడ్డంగా వూపింది."

"ఏం... రాలేదా !" నీరసంగా అడిగేడు.

"ఏమిట్రా ?"

"ఉత్తరం."

"రాకేం... వచ్చింది."

"వచ్చిందా... !" ఎగిరి గంతేశాడు శ్రీరావ్.

మీనాక్షి అలమారులోంచి తీసి ఇచ్చింది. గబగబా అందుకున్నాడు. అతని చేతులు వణుకు తున్నాయి.

"ఏంట్రా... ?"

"ఉద్యోగం..."

"వచ్చిందా... ?" శ్రీరావ్ కవరు తెరుస్తున్నాడు:

"అమ్మోయ్ ! అన్నయ్యకు ఉద్యోగం వచ్చిందే..." అరిచింది మీనాక్షి.

వంటిట్లోంచి లలితాంబ, సుబ్బలక్ష్మి, సంధ్యా వందనానికి కూర్చోబోతున్న దీక్షితులుగారు పరుగెత్తుకొచ్చారు.

"ఏరా ... పనయిందా ?" దీక్షితులుగారు అడిగేరు ఆనందంగా.

"ఎందులోరా ... ? జీతం ఎంత ?" అడిగింది లలితాంబ.

కవరు చదివిన శ్రీరావ్ తలదించుకున్నాడు.

"ఏరా మాట్లాడవేం ? చిన్న ఉద్యోగమా ?" అంది మీనాక్షి.

శ్రీరావ్‌కి ఇబ్బందిగా వుంది.

"ఏమిట్రా ? ఏముందా వుత్తరంలో ?" అడిగింది లలితాంబ.

"నాకు ఉద్యోగం ఇవ్వలేకపోతున్నందుకు మిక్కిలి చింతిస్తున్నామని ఏదో కంపెనీవారు రాశారు" నెమ్మదిగా అన్నాడు శ్రీరావ్. ఆ తరువాత తలెత్తాడు. దీక్షితులుగారు రెప్పవాల్చ కుండా చూశారొక క్షణం. అందులో ఎన్నోభావాలు.

లలితాంబ కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగేయి.

మీనాక్షి తల దించుకుంది — తను పొరబాటుగా పిల్చినందుకు. తండ్రి చూపుకి శ్రీరావ్‌కి ఆ క్షణం భూమి చీలుకుని తనందులో కూరుకుపోతే బాగుండుననిపించింది.

(ఇంకా వుంది)



కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు



కాదంబరి డబ్బింగ్ థియేటర్. సాయంత్రం ఆరు కావస్తోంది, "ఇల్లాలి కోరికలు" చిత్రం డబ్బింగ్‌లో పాల్గొన్నాక జయసుధ ఆ థియేటర్‌లోని ఎ. సి. కి వణికిపోసాగింది. ఇప్పుడామెకు 103 డిగ్రీల జ్వరం. "కాస్సేపటికి షూటింగ్‌కు వెళ్ళాలి. రేపు ఉదయం ఫ్లయిట్‌లో హైదరాబాద్‌కు వెళ్తున్నాను. అంచేత నా మరపురాని అనుభవాలను ఇక్కడే వివరించేస్తాను," అంటూ ఆమె ఇలా చెప్పసాగింది.

కాశ్మీర్‌లో

"శ్రీవారి ముచ్చట్లు – షూటింగ్‌కు అనుకుంటా– కాశ్మీర్ వెళ్ళినప్పుడు... ఓ రోజు తీరుబడి దొరికితే, శ్రీనగర్‌లోని 'కాశ్మీర్ గవర్నమెంటు సిల్క్ ఫాక్టరీ'కి వెళ్ళా. అక్కడ షోరూమ్‌లో ఎన్నో డిజైనల చీరలు– కళ్ళు జిగేల్‌మనిపిస్తున్నాయి ఏది సెలక్టు చేసుకోవాలో ఎంతకీ తోచడంలేదు. ఒకటి మించి ఒకటి అంత బావున్నాయన్నమాట! ఇంతలో నా వెనుక నుంచి 'ఆ గ్రీన్ శారీ మీకు బాగా ఉంటుందండీ,' అన్న కంఠం వినిపించి వెను తిరిగాను. ఇద్దరు వనితలు మందహాస వదనాలతో నిలుచొని ఉన్నారు. ఎక్కడో కాశ్మీర్‌లో తెలుగు వినిపించడమేమిటి? ఆశ్చర్యమేసింది. వాళ్ళలో నడి వయస్కురాలొకామె 'మాది విజయవాడండీ. మావారు డిఫెన్స్‌లో పని చేస్తున్నారు. అంచేత వారి ఉద్యోగ రీత్యా ఇక్కడే చాలా కాలంగా ఉంటున్నాం. ఏటా ఓ సారి విజయవాడకు వెళ్ళి, ఓ ఇరవై రోజులు ఉండి వస్తుంటాంలెండి. అప్పుడు తెలుగు సినిమాలు తెగ చూసేస్తుంటాం. అందులో– మీరు ఏక్టు చేసిన పిక్చర్లంటే మరీను... మిమ్మల్ని స్వయంగా చూడాలని ఎంత కాలంగా ఉవ్విళూరుతున్నామో... అలాంటిది– మిమ్మల్ని ఇక్కడ హఠాత్తుగా కలుసుకోవడం మాకెంతో ఆనందంగా ఉంది," అన్నారు. వీలుంటే వాళ్ళ ఇంటికోసారి రమ్మని మనసారా ఆహ్వానించారుకూడా. అప్పుడెంతగా ఉప్పొంగిపోయానో!

కన్యాకుమారిలో

మరేదో పిక్చర్ షూటింగ్‌కు కన్యాకుమారి వెళ్ళినప్పుడు... సాంగ్‌లో కొన్ని బిట్స్ తీశాక నేను తీరంలో కూర్చొని, ఉవ్వెత్తున లేచే అలలవంక అలా చూస్తున్నా... మోడరన్ డ్రెస్సులలో ఉన్న ఇద్దరు కాలేజీ అమ్మాయిలు నా దగ్గరికి వచ్చి విష్‌చేసి, 'మీరిప్పుడు తమిళ చిత్రాలలో కనిపించడంలేదేం?' అని ఎంతో ఆప్యాయతతో అడిగారు. 'తెలుగు పిక్చర్స్‌తోనే చాలా బిజీగా ఉన్నాను. అంచేత, తమిళపిక్చర్లు ఒప్పుకోడానికి వీలు పడడంలేదు' అని జవాబిచ్చాను. 'అలాగంటే ఎలా, మేడమ్! కనీసం ఏటా ఒకటి రెండు తమిళ చిత్రాలలోనైనా మీరు కనిపించాలి ఈ ప్రాంతాలకు తెలుగు చిత్రాలురావుగా? మిమ్మల్నెలా చూడడం?' అన్నారు. 'అలాగే ... చూద్దాం,' అన్నాను నవ్వుతూ. 'థాంక్స్' అంటూ వాళ్ళు సంతృప్తితో వెళ్ళిపోయారు.

కాశ్మీర్‌లోనూ, కన్యాకుమారిలోనూ జరిగిన మరపురాని సంఘటనలను తెలియజేశానేగాని, నాకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఫాన్స్ ఉన్నారని గొప్పగా చెప్పుకోవడంకాదు.

అభిమాన సంఘాలు

నాకు మన ప్రాంతంలో దాదాపు 300 అభిమాన సంఘాలున్నాయనుకుంటా. నేను నటించిన ప్రతి చిత్రం చూసి వాళ్ళు శ్రమ తీసుకొని ఎంతో ఓపికగా తమ అమూల్యాభిప్రాయాలను తెలియజేస్తుంటారు. అవి చదువుతున్నప్పుడు నాకు కలిగే ఆనందం అంతా ఇంతా కాదు.

'అక్కయ్యా! ఆ చిత్రంలో మీరు చనిపోయినట్లు చూపించారు. దయచేసి. ఇటుపైన అలా చనిపోయే సన్నివేశాలతో నటించకక్కయ్యా!' అని ఎక్కువగా కాలేజీ స్టూడెంట్స్ రాస్తుంటారు. కథను బట్టి నేను ధరించినపాత్ర చనిపోవాలి అంటే– తప్పదు కదా? ఆ పాత్ర మరణించడంవల్లే సానుభూతిని నేను మరింత చూరగొనగల్గింది. ఈ విషయాన్ని వివరిస్తూ ఒకసారి ఓ సోదరికిలా ఉత్తరం రాశాను: 'చనిపోయింది ఆ పాత్రేకాని నేను కాదు కదా? మళ్ళీ ఇంకో కొత్త పిక్చర్‌లో కనిపిస్తాగా?' దానికి ఆ సోదరినుంచి వచ్చిన ప్రత్యుత్తరం 'మీరు చనిపోకుండానే కొత్త పిక్చర్‌లలో కనిపిస్తూండండి,' అని.

ఇంకేలా నచ్చచెప్పగలను?

వాళ్ళ అభిమానం అంతటిది.

[జి. వి. జి.]

సినిమా

—జి. వి. జి

దాసరి, కృష్ణంరాజు కాంబినేషన్‌లో కల్లు కొండయ్య

"డిసెంబర్ – ఫిబ్రవరి నెలల్లో షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు దాసరి నారాయణరావు. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో వర్ణ శోభనాద్రి సమర్పించే తెలుగు చిత్ర కంబైన్స్ "కల్లు కొండయ్య" చిత్రంలో కృష్ణంరాజు సరసన నాయిక త్వరలో నిర్ణయింపబడుతుందని నిర్మాత రామినేని సాంబశివరావు చెప్పారు.

విజయవాడలో ఆగస్టు 15న జరిగిన 'జ్యోతిచిత్ర' సూపర్‌స్టార్ అవార్డుల ప్రధానోత్సవ సభలో సూపర్ నటి అవార్డు గ్రహీత శ్రీమతి జయసుధ, సూపర్ డైరెక్టర్ అవార్డు పొందిన శ్రీ దాసరి నారాయణరావు, సూపర్‌స్టార్ అవార్డుని శ్రీ ఎన్. టి. రామారావు తరఫున అందుకున్న ఆయన కుమారుడు, నటుడు శ్రీ బాలకృష్ణలని చిత్రంలో చూడవచ్చు.





'గాజు బొమ్మలు'లో చిత్ర, శరత్‌బాబు / 'పెళ్ళి చూపులు'లో విజయశాంతి, చంద్రమోహన్

సినిమా

ఆగస్టు 15 నుంచి "నవోదయం" చిత్రీకరణ

"బాపూజీ కలలు కన్న రామరాజ్యం కోసం సాగిస్తున్న మహోద్యమం ఈ నవోదయం," అన్నారు కథకుడు, నిర్మాణ సారథి మాదాల రంగారావు. ఈయనతోపాటు నల్లూరి వెంకటేశ్వర్లు, నర్రా వెంకటేశ్వరరావు, చలపతిరావు, వీరభద్రరావు, ఎం. పి. ప్రసాద్, పి. జె. శర్మ, బాబూరావు, రాజేంద్రప్రసాద్, జయప్రకాష్‌రెడ్డి, విజయశాంతి, ముచ్చెర్ల అరుణ, కె. విజయ, ప్రతిభ పాల్గొనే చైతన్య ఆర్ట్ పిక్చర్స్ మహిళా విప్లవ చిత్రం "నవోదయం" షూటింగ్ ఆగస్టు 15 నుంచి గూడూరు, నెల్లూరు, తడ అడవుల్లో జరుగుతోంది. పాటిబండ్ల విజయలక్ష్మి మాటలు, అదృష్టదీపక్ పాటలు, చక్రవర్తి సంగీతం, వి. ఎస్. ఆర్. కృష్ణారావు ఛాయ, వి. అంకిరెడ్డి కూర్పుతో పి. లలిత నిర్మించే ఈ చిత్రం పూజ్య బాపూజీకి అంకితం. పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు.





'కలవారి సంసారం'లో శ్రీదేవి, కృష్ణ // 'పూలపల్లకీ'లో అరుణ, ప్రతాప్‌పోతన్



వెలుగొచ్చింది

"అనంతపూర్ జిల్లాలోని పినాకినీ ఆనకట్ట ప్రాంతాల్లో జూలై 26 నుంచి ఆగస్ట్ 1 వరకు మొదటి షెడ్యూల్‌ను, ఆగస్ట్ 7 నుంచి 17 వరకు రెండవ షెడ్యూల్‌ను పూర్తిచేశాం. షూటింగ్ దాదాపు పూర్తయినట్లే," అన్నారు డైరెక్టర్ జి. కృష్ణమూర్తి. జనరంజని ఆర్ట్ పిక్చర్స్ "వెలుగొచ్చింది" చిత్రంలో మురళీమోహన్, రంగనాథ్, ప్రభ, కవిత, నూతన్‌ప్రసాద్, రాళ్ళపల్లి, రాజేశ్వరి, గిరిజారాణి పాత్రధారులు. ఆదివిష్ణు కథకు శశిధర్ సంభాషణలకర్త. చక్రవర్తి సంగీతం, లక్ష్మణరావు ఛాయ, తాండవకృష్ణ కూర్పుతో కె. భాగ్యలక్ష్మి నిర్మాత.

కన్నడ హీరో రాజ్‌కుమార్‌కు 'పద్మవిభూషణ్'!

డాక్టర్ రాజ్‌కుమార్‌కు 'పద్మవిభూషణ్' ఇవ్వాలని కర్నాటక ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందట.



సినిమా

"మంచుపల్లకీ"లో రోడ్డు వైపు రోమియోలు

కుమార్, హరి బస్‌స్టాప్‌లో నిలబడి ఉన్నారు. ఇంతలో హంస నడకతో వస్తున్న ఓ అమ్మాయి కనిపించేసరికి హరి ఈలవేసి, మిత్రుడి భుజం తట్టాడు. వారికి దూరంలో ఆ అమ్మాయి నిలుచుంది.


ఆ అమ్మాయిని ఆటపట్టించే ఉద్దేశ్యంతో కుమార్ "రేయ్, హరీ ! ఏయే బస్సులు ఆగుతాయిరా ఇక్కడ ?" అన్నాడు.

"36...24...36." అని ఆ అమ్మాయినే చూస్తూ ద్వంద్వార్థంగా సమాధానమిచ్చాడు హరి.

గిరుక్కున పక్కకు తిరిగి, వాళ్ళవంక కోపంగా చూసిందా అమ్మాయి.

"బస్ నంబర్లండీ." అన్నాడు కుమార్ స్టయిల్‌గా చూస్తూ.

"నేనెవరో తెలుసా ?" అడిగిందా అమ్మాయి.



'సినిమాలో చిన్నవేషం వేశానని చెప్పావే- ఇదే, ఆఫోటోలో ఉంది నేనే !'

తెలీదన్నట్లు పెదవులు విరిచారా యువకులు.

"నేను ఎస్. ఐ. గారమ్మాయిని."

హడలిపోయిన కుమార్‌ను ధైర్యంగా ఉండమన్నట్టు సౌంజ్ఞచేసి హరి "మరి... నేనెవరో తెలుసా ?" అంటూ ఠీవిగా అడిగాడా అమ్మాయిని.

తెలీదన్నట్టు చూసిందా అమ్మాయి.

"హమ్మయ్య !" అంటూ ఆ యువకులిద్దరూ "తెలియకపోవడమే మంచిది," అంటూ అక్కడ్నుంచి చల్లగా జారుకున్నారు.

సెప్టెంబర్‌లో విడుదలయ్యే గోదావరీ చిత్రవారి 'మంచు పల్లకీ' చిత్రంలో చిరంజీవి, నారాయణరావు, సాయిచంద్, గిరీష్, రాజేంద్రప్రసాద్, పి. ఎల్. నారాయణ, సాక్షిరంగారావు, దేవదాస్ కనకాల, సుహాసిని, పుష్యమి, అన్నపూర్ణ వగైరా తారాగణం. యండమూరి వీరేంద్రనాథ్ సంభాషణలకర్త. శ్రీ.శ్రీ., వేటూరి, గోపి గీతాలకు రాజన్—నాగేంద్ర సంగీతమిచ్చారు. హరి ఛాయ, చంద్ర శిల్పం, అనిల్ దత్తాత్రేయ కూర్పు, ఎం. దొరస్వామిరెడ్డి సహకార దర్శకత్వంతో వేమూరి సత్యనారాయణ సమర్పించే ఈ చిత్రానికి ఎం. ఆర్. ప్రసాదరావు నిర్మాత. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వంశీ.






సినిమా

పి. సి. రెడ్డి దర్శకత్వంలో రైతుబిడ్డలు

"ఈమారు కూడా గ్రామీణ ఇతివృత్తాన్ని ఎన్నుకున్నాను," అన్నారు పి. చంద్రశేఖరరెడ్డి. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తమ్మా రఘునాథ రెడ్డి నిర్మించే భారతీ ఆర్ట్స్ "రైతుబిడ్డలు" చిత్రంలో షుమారు 21 మంది నటీనటులు పాల్గొంటారు. ఎక్కువగా వర్ధమాన నటీనటులను ఎన్నుకోవడం జరుగుతుందని ఈ చిత్రాన్ని సమర్పించే తమ్మా రంగారెడ్డి చెప్పారు. "ఆగస్ట్ మొదటి వారంలో పాటలను రికార్డ్ చేస్తాం. సెప్టెంబర్ నెలాఖరులో షూటింగ్ మొదలెడ్తాం." అన్నారు నిర్వహణ బాధ్యతలు వహించే తమ్మా అప్పిరెడ్డి. చక్రవర్తి సంగీత దర్శకుడు.

ప్రేమకు పాదాభిషేకం

మోహన్, పూర్ణిమా జయరాం, పూర్ణిమ ముఖ్య పాత్రలు ధరించిన రాఘవేంద్ర ఆర్ట్ మూవీస్ వారి పై చిత్రం సెప్టెంబర్ విడుదల. వసంతకుమార్ సంభాషణలకర్త. రాజేంద్ర స్వరకల్పనలో ఆరుద్ర, రాజశ్రీ గీతాలు రాశారు. కె. సత్యనారాయణ సమర్పణలో కె. వి. వి. సత్యనారాయణ నిర్మించే ఈ చిత్రానికి దొరై దర్శకుడు.


చరిత చిత్ర సమర్పించు
వి.యం.సి. ప్రొడక్షన్స్
జగన్నాథ
రథచక్రాలు
దర్శకత్వం: వి. మధుసూదనరావు * నిర్మాత: విష్ణుప్రసాద్ శర్మ
సంగీతం: చక్రవర్తి
SREE PUBS.



'దేవత'లో శ్రీదేవి, మోహన్‌బాబు

సినిమా

డి.వి.ఎస్. రాజుగారి హిందీ చిత్రం

"ఇది నా తొలి హిందీ చిత్రం. ఎల్. వి. ప్రసాద్‌గారు తమ సంస్థలో, సౌత్ ఇండియన్ ఫిలిమ్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా ఎంతో బిజీగా ఉన్నా— మా హిందీ చిత్రాన్ని డైరెక్ట్ చేయడానికి అంగీకరించడం గొప్ప విషయం" అన్నారు లోగడ తెలుగులో 15 చిత్రాలు నిర్మించిన డి. వి. ఎస్. రాజు. వీరి హిందీ చిత్రంలో రేఖ, మిథున్ చక్రవర్తి, రతి అగ్నిహోత్రి ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. తొలిగీతం జూలై 29న బొంబాయి మెహబూబ్ స్టూడియోస్‌లో రికార్డయింది. డాక్టర్ రాహి మసూమ్ రేజ సంభాషణలకర్త. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ స్వరకల్పనలో ఆనంద్‌బక్షి గీతాలురాశారు. "మద్రాసులో మొదటి షెడ్యూల్ ఆగస్ట్ 25 నుంచి వారంరోజులపాటు జరుగుతుంది," అన్నారు డి. వి. ఎస్. రాజు.



'ప్రేమకు పాదాభిషేకం'లో పూర్ణిమ

"తెలుగు వీరులు"

"రాపిన యానారావు అనే కొత్త రచయిత కథను తీస్తున్నాం," అన్నారు డైరెక్టర్ మహేష్. లక్ష్మీ శివజ్యోతి ప్రొడక్షన్స్ పతాకంలో ఏరువ రామకృష్ణారెడ్డి, బెల్లంకొండ అంకమ్మ నిర్మించే "తెలుగు వీరులు" చిత్రానికి జూలై 13న తొలి గీతం ధ్వనిముద్రితమైంది. శ్రీశ్రీ ప్రభృత కవుల గీతాలకు కె. వి. మహదేవన్ స్వరకర్త. పుష్పాం గోపీకృష్ణ ఛాయ, నాయని మహేశ్వరరావు కూర్పు, దాసరి కృష్ణమూర్తి నిర్వహణలో ఏరువ నాగేందర్ రెడ్డి సమర్పించే ఈ చిత్రానికి పాత్రధారుల ఎంపికే తరువాయి ★



ANDHRA PATRIKA W.



అలంకరణ

— మాధవి

"ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు"

హమ్మయ్య! ఆయన వచ్చేశారు టైమ్‌లోగా వస్తారో రారో అని ఒకటే టెన్షన్ ఏ దేవుడోగాని నా మొర ఆలకించాడు. థాంక్ గాడ్! ఆ సంతోషంలో నాకు ఆ ఈలపాట నాదస్వరంలా వినిపించింది ఒక్క ఉదుటన వెళ్ళి తలుపు తీశాను

"ఏమిటో విశేషం?" నన్ను తప్పించుకుని లోపలికి వస్తూ అన్నారు మైగాడ్! పట్టేశారు

"ఏముంది? ఏమీలేదు" అద్దం వైపు తిరిగి చేతిలోవున్న సగం అల్లిన జడను పూర్తిగా అల్లుకుంటూ సాధ్యమయినంత మామూలుగా అన్నాను.

"నువ్వు లేదన్నా, వుందని అద్దంలో నుండి నీ ముఖమే చెప్తోంది"

"మరింక అడగటం దేనికి?" అక్కడ వుండకుండా వంటగదిలోకి వెళ్ళిపోయాను. తిరిగి నేను టిఫిన్ ప్లేటుతో వచ్చేసరికి కుర్చీలో కూర్చుని నింపాదిగా షూస్ విప్పుకుంటున్నారు

"తీసుకోండి."

"ప్రయాణం ఎక్కడికో ముందు చెప్పు" ఆయన ముఖం చూస్తుంటే నాకు నవ్వాగటంలేదు. షాపింగుకని ఎక్కడ అంటానో అని భయం అందులోను అది నెలలో నాలుగవ వారం కాబట్టి ఆ భయం మరికాస్త స్పష్టంగా కనిపిస్తోంది అలా కాసేపు ఏడిపించాలని మనసులో కోరికగా వుంది. కాని మరోవైపు టైమయిపోతోంది.

"అది కాదండీ, రేఖ పిక్చర్ కెళదామంటేనూ..."

"నువ్వు సరేనన్నావు" కొండంత బరువు దిగిపోయినట్లు తేలిగ్గా ఊపిరి పీల్చుకుని నాచేతిలోనుండి ప్లేటు తీసుకున్నారు

"నాకయితే అసలు వెళ్ళాలనిలేదు. నిజానికి తలనొప్పిగా కూడా వుంది. కాని తనేమో ఏమయినాసరే వెళ్ళాలని పట్టుపట్టింది ఈ రోజే ఆఖరు రోజట."

గబగబా చెప్తున్న నన్ను చూసి ఆయన పకపక నవ్వారు. దాంతో పొలమారింది చిన్నబుచ్చుకున్నా మంచినీళ్ళగ్లాసు అందివ్వక తప్పలేదు నాకు

"వెళ్ళొద్దని నేననలేదుకదా! ఎందుకలా పాఠం అప్పచెప్తావు ఒకటో తరగతి పిల్లలాగా? నీకు తలనొప్పిగా వుండటం, ఆవిడ కాదు కూడదు అనటం, గత్యంతరం లేక నువ్వు సరే ననటం ఇదంతా మామూలేకదా!" ఖాళీగ్లాసు క్రిందపెడుతూ ఇంకా నవ్వుతూనే అన్నారు

దానితో నాకూ నవ్వొచ్చేసింది అదీ నిజమే. ఆయన ఎప్పుడూ వద్దనరు నేనే ఏదో గిల్టీగా ఫీలవుతాను దాన్ని కప్పిపుచ్చుకోటానికి అలా అడగకుండానే సంజాయిషీ చెప్తుంటాను

"అవును కానీ శలవురోజు కూడా ఇంట్లో వుండకుండా ఇదుగో ఇప్పుడే వస్తాను అని ఎప్పుడనగా వెళ్ళారు? ఇప్పుడు గుర్తొచ్చిందా ఇల్లు?" అన్నాను చిరుకోపాన్ని తెచ్చిపెట్టుకుని

"అవునుసుమా! టైమెంతయిందో చూడు, ఎదున్నర" వాచీవున్న ఎడమ చేతిని నా ముందుకి చాపారు

అంతే! నేను మళ్ళీ మాట్లాడలేదు ఒక్క ఉదుటున గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాను కాని ఆయన చిన్నగా నవ్వుకోవటం నా దృష్టిని దాటిపోలేదు

నిజానికి నాకు అసలు సమస్య ఇప్పుడే ప్రారంభం అవుతుంది ఏ చీర కట్టుకోవాలి అనేదే ఆ సమస్య నవ్వకండి మరి!

రేఖకి వున్న చీరల్లో నాలుగో వంతు లేవు నాకు అలాంటిది నేనే ఈ సమస్యతో సతమతమవుతుంటే మరి రేఖ ఏం చేస్తుంది? అయితే ఒకటి! మొత్తం ఎన్ని వున్నా షాపింగుకని, షికారుకని, ఫంక్షన్స్‌కని, పేరంటాలకని, వేసవికాలానికని, చలికాలానికని, ఇలా సీజన్‌వారీగా సందర్భానికి సరిపోయేలా వుంటయ్ తనకి

చీరల సెలక్షన్ కూడా ఆర్టే అయితే అది రేఖ దగ్గరే నేర్చుకోవాలి ఆ మాటకొస్తే ఒక్క చీరల సెలక్షనే కాదు, అందంగా చీర కట్టుకోవటం దగ్గర నుండి ఇంటిని అందంగా అలంకరించుకోవటం వరకు రేఖ దగ్గరే నేర్చుకోవాలి

అందుకే నాకు రేఖ అంటే ఇష్టం ఇరవై నాలుగు గంటలు ఇంట్లో వుండి, ఇంటి పని తప్ప మరో పని లేని నాకు తీరిక వున్నట్లనిపించదు రేఖ లేడీస్ క్లబ్ మెంబరు మహిళామండలి సెక్రటరి ఎప్పుడూ ఏవో సాంఘిక కార్యక్రమాల్లో తలమునకలవుతూ వుంటుంది అయినా ఇంటిని, ఇంటి పనిని నిర్లక్ష్యం చెయ్యదు ఇంటిని చూసి ఇల్లాలిని చూడమన్నట్లుంటుంది

నా చేతులు యాంత్రికంగా చీరల మడతలు విప్పిపెడుతుంటే మనసు రేఖ చుట్టూ తిరుగుతోంది

ఈ కాలనీలో నాలుగేళ్ళనుండీ వుంటున్నా నాకు ఎవ్వరితోను పెద్దగా పరిచయం లేదు దానికి నా స్వభావమే కారణం కావచ్చు నేను ఒక్కదాన్నే సంతానం కావటంవలన చిన్నప్పుడు ఇంట్లో అమ్మ, నేను మాత్రమే వుండేవాళ్ళం నాన్నగారు ఆఫీసుకి అంకితం అయిన మనిషి మా అమ్మది అదో తరహా, తన పనేమిటో, తనేమిటో! అవసరం అయితే తప్ప మాట్లాడేది కాదు ఆ విధంగా నేను చాలా రిజర్వ్‌డుగా తయారయ్యాను అదే అలవాటు చొప్పన స్కూల్లో కూడా ఎవరితోను కలిసేదాన్ని కాదు. ఎవరితోటయినా మాట్లాడాలంటే ఏమనుకుంటారో అని భయం ఆ అలవాటే ఇక్కడికొచ్చినా పోలేదు ఇరుగు పొరుగు వాళ్ళు

నన్ను మాలకాకి అనుకుంటున్నారని ఆలశ్యంగానే అయినా తెలిసి బాధపడ్డాను

అలాంటిది రేఖవాళ్ళు మా ఎదురింట్లోకి వచ్చిన తరువాత నేను ఒంటరితనాన్ని పూర్తిగా మర్చిపోయాను ఒకరోజు తనంతట తానే వచ్చి పరిచయం చేసుకుంది రేఖ నేను ఆశ్చర్యపోయాను ఎందుకంటే మనిషిని చూస్తుంటేనే తెలుస్తోంది చాలా వున్నత కుటుంబంలో నుండి వచ్చిందని దానికితోడు అందానికి నిర్వచనంగా వుంది. అప్పటి వరకు నాకో గట్టి నమ్మకం వుండేది – గొప్పవాళ్ళు తమకంటే తక్కువస్థాయిలోవున్న వాళ్ళతో కలవరని అలా నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తిన రేఖ అంతటితో వూరుకోలేదు నా నమ్మకాన్ని వమ్ముచేసి సామాన్య మధ్య తరగతి గృహిణి నయిన నాకు మంచి స్నేహితురాలయింది నాకు రేఖ ఒక్కర్తే తెలుసు కాని సొసైటీ లేడీగా తనకి చాలామందితో పరిచయాలుంటయ్ నిజానికి తనతో సాటిరాగల వాళ్ళు వాళ్ళే అయినప్పటికీ నాతోనే ఎక్కువ చనువుగా వుంటుంది

రేఖలాంటివాళ్ళు వెయ్యికి ఒక్కరయినా వుంటారా అని నా అనుమానం అన్నివిధాలా వున్నతురాలయినా గర్వం ఏమాత్రం లేదు పైగా నిరాడంబరతలోనే అందం, ఆనందం వున్నాయంటుంది నా మీద తనకి ఇష్టం ఏర్పడటానికి నా నిరాడంబరతే కారణం అంటుంది తనని చూస్తుంటె అన్నీ వున్న విస్తరి అణిగే వుంటుందని చిన్నప్పుడు మా ప్రక్కింటి బామ్మగారు అనే మాటలు గుర్తొస్తుంటయ్

తన చలాకీతనంతో నాలో కూడా ఉత్సాహాన్ని పుట్టించిన రేఖ అంటే ఆయనకీ అభిమానమే అంతేకాక మరో కారణం కూడా వుంది ఆయనకి సినిమాలంటే అంత ఆసక్తి వుండదు అందులోను తెలుగు సినిమాలంటే తలనొప్పి నాకోసం తప్పనిసరిగా తెలుగు సినిమాలు చూసి తలనొప్పి కొనితెచ్చుకోవలసి వచ్చేది రేఖ వచ్చాక ఆ బాధ తప్పిపోయింది రేఖకి తెలుగు సినిమాలపిచ్చి కాబట్టి ఇప్పుడు నేను ఇది వరకటిలా నాకు తోడుగా తనకిష్టంలేని తెలుగు సినిమాలకి రమ్మని సాధించటంలేదు. అందుకు ఒక విధంగా రేఖకి ఋణపడి వున్నానంటారు

"అమ్మా! ఆంటీ నిన్ను త్వరగా రమ్మంటున్నారు టైమయిపోతోందట" రేఖ వాళ్ళ బాబుతో ఆడుకుంటున్న నాని వచ్చాడు కాబోలు, బయటనుండి పిలుస్తున్నాడు

"పోతే పోయిందిలేరా! లోపల మీ లమ్మ ఎంత బిజీగావుందో! డిస్టర్బ్ చెయ్యొచ్చా? తప్పుకదూ!" వాళ్ళ నాన్నగారి వాక్బాణాలు

నిజంగానే చీర మార్చుకోటానికని వచ్చిన నేను రేఖ ఆలోచనలలోపడి చేసిన పని బీరువాలో వున్న బట్టలన్నీ పోగులు పెట్టటం ఇంకా ఇలాగే వుంటే ఆయన ఎగతాళి, రేఖతో చివాట్లు తప్పవు కళ్ళు మూసుకుని చేతికొచ్చిన చీర తీసుకుని కట్టేసుకున్నాను

"ఆరుంపావులోనుండి ఐదున్నర తీస్తే ఎంతరా నానీ!" నేను తలుపు తియ్యటం చూసి నానిని అడిగారు

"ముప్పావు" వాడు బుద్ధిగా సమాధానం చెప్పాడు

"ముప్పావుగంట" నా ముఖంలోకి చూస్తూ నొక్కి పలికారు

నేను అదేమీ వినిపించుకోనట్లు సీరియస్‌గా అన్నాను–"నానికి భోజనం "

"పెట్టేస్తాను"

"టానిక్ వెయ్యటం మర్చిపోరుగా!"

"పోను"

"ఇంకేదో చెప్పాలనుకున్నాను కాని గుర్తురావటం లేదు"

"ఇప్పుడిక గుర్తురాదు కాని వచ్చి తీరిగ్గా ఆలోచించుకుందువుగాని వెళ్ళు ఆవిడకేమయినా సహాయం చెయ్యాలేమో" ఇంకా అక్కడ నిలబడితే ఇంకేమంటారోనని మాట్లాడకుండా వచ్చేశాను

గేటు తీస్తూ అనుకున్నాను, రేఖ ఇంకా రెడీ కాకుండా వుంటే బాగుండునని ఎప్పుడూ నాదే ఆలశ్యం అవుతుంది

రంగురంగుల పూలు విరబూసిన రకరకాల మొక్కలు సాయంకాలపు చిరుగాలికి తలలూపుతుంటే నన్ను ఆహ్వానిస్తున్నట్లే వుంటుంది రేఖ మంచి టేస్ట్‌కి మరో చక్కటి ఉదాహరణ గార్డెన్, కాలు కదపటానికయినా ఖాళీ స్థలం వుండని అద్దె ఇళ్ళలోనే బ్రతుకు గడిచిపోయే నాకు గార్డెనింగ్‌మీద వుండే అభిరుచి తీరకుండానే అణగారిపోయింది

అలా మొక్కల్ని ఏతికింటి చూస్తుంటే శ్రీకాంత్‌గారి స్కూటరు కనిపించింది అంటే ఆయన ఇంట్లోనే వున్నారన్న మాట అలా వుండటం అనేది చాలా అరుదయిన విషయం


మెట్లెక్కుతుంటే అల్సేషియన్ నా దగ్గరకొచ్చి విఠవాటు ప్రకారం తోకాడించుకుంటూ వెళ్ళిపోయింది


హాల్లో ఎవ్వరూ లేరు ప్రక్కనున్న బెడ్ రూమ్‌లో నుండి రేఖ నవ్వు గట్టిగా వినిపిస్తోంది ఆ తరువాత వినిపించిన రేఖ మాటలు నా అడుగు ముందుకు పడనీయకుండా నన్ను నిలబెట్టేసినయ్

"ఇంతేనా నన్ను మీరు తెలుసుకుంది? కల్పనలో వున్న గొప్పతనం చూసి కాదండీ నేను తనతో స్నేహం చేసేది. నాకున్నవేవీ కల్పనకి లేవు అందుకే కావాలని తనతో స్నేహం పెంచుకున్నాను తెల్లగీత స్పష్టంగా కనిపించాలంటే నల్లగోడమీదే గియ్యాలి అదే తెల్లగోడమీద గీస్తే ఎంత తెల్లగీత అయినా వెలవెలబోతుంది అలాగే నేను నా సొసైటీలో వాళ్ళ ప్రక్కన వుంటే నేను వున్నంత ఫాషన్‌బుల్‌గా వాళ్ళూ వుంటారు నేను పెట్టుకున్నన్ని నగలు వాళ్ళూ పెట్టుకుంటారు నేను కట్టుకున్నంత ఖరీదు చీర వాళ్ళూ కట్టుకుంటారు ఇంక చూసే వాళ్ళకి నా ప్రత్యేకత ఏం కనిపిస్తుంది? అదే కల్పనతో వెళ్తే తన ప్రక్కన నేను దేదీప్యమానంగా వెలుగుతుంటాను నా ముందు తను వెలవెలబోతుంది అందుకే నేను కల్పననే వెంట తీసుకెళ్తాను పాపం! పూర్ కల్పన మొదట్లో తనూ నాలాగా వుండాలని ప్రయత్నం చేసింది కాని నేను సింప్లిసిటీ అని ఊదరగొట్టేసరికి అలాగే వుండటం మొదలుపెట్టింది ఒక రంగు కనిపించాలంటే మరో రంగు వుండి తీరాలిసిందే" మళ్ళీ పగలబడి నవ్వుతోంది రేఖ శ్రీకాంత్ ఏదో అంటున్నారు నాకు అదేమీ వినిపించటం లేదు వెనక్కి తిరిగి ఇంటిదారి పట్టాను

నలుపు తెలుపు తెలుపు నలుపు రేఖ మాటలు, నవ్వు నా చెవుల్లో హోరెత్తుతున్నయ్ తెలుపు కంటె నిర్మలంగా కనిపించే రేఖ 'అసలు రంగు' ఇదా?

★







వనితలు – వస్త్రధారణ

"ఈట్ ఫర్ యువర్ సెల్ఫ్, బట్ డ్రస్ టు ప్లీజ్ అదర్స్" అని యింగ్లీషులో ఒక సామెత ఉంది. అంటే 'తినటం నీ కోసం తిను, బట్టలు మాత్రం యితరుల కోసం ధరించు' అని దీనర్థం. (అయితే ఒకటండోయ్! ఎంత మనం మన కోసం తిన్నా, ఈ తిండి విషయంలో కూడా జాగ్రత్తగానే ఉండాలి ఎందుకంటే, మనం తినే ఆహారపు అలవాట్లబట్టే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. అలాగే మన ఆరోగ్యాన్ని బట్టే మన అందచందాలు రూపొందుతాయి మరి!) యింతకీ చెప్పొచ్చేదేమిటంటే



కోలముఖానికి అందాన్నీ, ఆకర్షణనీ పెంచే పంజాబీ డ్రెస్



వ్యాస రచయిత్రి


కె. విజయలక్ష్మి

మన వస్త్రధారణ ఎప్పటికీ యితరుల కంటికి యింపు కల్గించేలా ఉండాలే గాని, ఏవగింపు మాత్రం కాకూడదు.

స్త్రీ, పురుషుల వస్త్రాలు వారివారి శరీరావయవ నిర్మాణాన్ని బట్టి రూపొందించబడినప్పటికీ, నేటి ఆధునిక యుగంలో వీరు వారి దుస్తులను (స్త్రీలు మగదుస్తులు ధరించడం) వారు వీరిని అనుకరించడం (పురుషులు కూడా ప్రింటెడ్ షర్ట్స్, ఎంబ్రాయిడరీ చేయబడిన కుర్తాలు లాంటివి వేసుకోవడం) సర్వసాధారణమైపోయింది. యిదియిలా ఉండగా, కొన్ని వృత్తులలో, వారివారి వృత్తి రీత్యా స్త్రీలు మగదుస్తులు, గౌన్లులాంటివి వేసుకోవడం తప్పనిసరి ఉదాహరణకి పోలీసు,ఎయిర్–ఫోర్స్‌లాంటి వృత్తులలో ఉన్నవారు, ఆసుపత్రిలో పని చేసే సిస్టర్స్, మరియు క్రీడారంగంలో పాల్గొనేవారు వేసుకోవలసిన దుస్తులు ఆయా వృత్తులకనుగుణంగా మలచబడ్డాయి

విదేశీవ్యామోహం విపరీతంగా పెరిగిపోతున్న ఈ రోజుల్లో, నేటి యువతరాన్ని పిచ్చివాళ్ళని చేస్తున్నాయి నేటి జీన్స్ పేంట్స్ మరియు జీన్స్ షర్ట్స్. యివి ఆడ మగ అన్న తారతమ్యంలేకుండా అందరికీ ఒకే విధంగా రూపొందించబడ్డాయి. అయితే పిచ్చిగా అందరూ వేసుకొంటున్నారు, మనం మాత్రం ఎందుకు వేసుకోకూడదు? అనే అనుకరణలో వీటిని ధరించే కంటే, ఈ విధంగా ఫేషన్లకనుగుణంగా దుస్తులు వేసుకోవాలి అనుకునే స్త్రీలు తమ ఎత్తు, లావు, అవయవాలసొందిక మొదలయినవి ఆ దుస్తులకు నప్పుతాయా,లేదా? అన్నది మొదట చూడాలి. ఎందు

అందమైన అవయవ సొందిక ఉన్న అమ్మాయిలకి నప్పే జీన్స్





పట్టుచీరలో పొందికగా, హుందాగా కన్పించే తెలుగింటి ఆడపడుచు అని చూడగానే చెప్పవచ్చు

కంటె ఈ రకమైన దుస్తులు, చీరలాగ లోపాల్ని తమలో దాచుకోవు సరికదా, ఎక్కడ ఏమాత్రం లావుగావున్నా లేదా సన్నగాఉన్నా మరే యితర లోపాలనైనా వాటిని యిట్టే పట్టి చూపిస్తాయి సరి అయిన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని, తగురీతిని చేసే వ్యాయామం అవయవాలను పొందికగా ఉంచుకునేందుకు ఎంతైనా దోహదం చేస్తాయి. యింకో ముఖ్యమైన సంగతేమిటంటే, మనం వేసుకునే దుస్తులు, మనం వెళ్ళే పరిసరాలు, ఆయా సందర్భాలనుబట్టి ఉండాలేగానీ, 'మనకేమి తక్కువ, అంత సింపుల్‌గా డ్రస్ చేసుకునేందుకు' అనే ధోరణిలో ఎప్పుడూ ఆడంబరంగా డ్రస్ చేసుకోవడం గానీ, లేదా ఒక విధమయిన 'ఇన్‌ఫీరియారిటీ' కాంప్లెక్సుతో మనం అంతలా డ్రస్ చేసుకుందుకు తగుదుమా అని, అకేషన్ డిమేండ్ చేస్తున్నా, అతిసాధారణంగా డ్రెస్ చేసుకోవడంగానీ బాగుండదు మనం వేసుకునే దుస్తులనుబట్టి, చూసేవారు మనం ఎటెండ్ అయ్యేది ఎక్కడికి అనేది, మనం చెప్పకుండా, మన వస్త్రధారణని చూసి వారు కనుక్కునేంత దగ్గరగా ఉండాలి మన దుస్తుల ఎంపిక. ధర ఎక్కువ పెట్టి కొన్నంత మాత్రంచేత బట్టలు ఆడంబరంగా ఉంటాయనిగాని, తక్కువ ధర కావడంచేత నిరాడంబరంగా ఉంటాయనిగాని అనుకోవడం పొరపాటు. ఈ ఆడంబరం, ఆకర్షణ యివన్నీ వస్త్రాలు మనకి నప్పేదాన్నిబట్టి ఉంటుంది. కాబట్టి మనం ఎంచుకునే వస్త్రాలు, అది చీరైనా మరే యితర ఆధునిక వస్త్రాలైనా మన రంగుకి (యిది చాలా ముఖ్యం) మన కేశాలంకరణకీ, మన ముఖానికీ నప్పుతుందా లేదా అనేది చూసుకోవడం చాలా అవసరం.

ఏది ఎలా ఉన్నా, ఆడవాళ్ళకి చీర అమిరినంత అందంగా యింకే యితర దుస్తులు కూడా ఆకర్షణ నివ్వవని నా ఉద్దేశం. ఎందుకంటే ఈ చీర కట్టు లావుగా ఉన్నా, సన్నగా ఉన్నా, పొట్టిగా ఉన్నా లేదా మనం పొడుగ్గా ఉన్నా, ఏ విధమైన లోటుపాట్లు మన శరీరంలో ఉన్నా, ఒంటినిండా చుట్టుకుని ఉండడంవల్ల అన్ని లోపాల్ని తనలో యిముడ్చుకుని బయటికి ఎంతో పొందికగా, హుందాగా కనబడు తుంది చీర. అందుకేనేమో, ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలందరూ మన భారత స్త్రీల వస్త్రధారణ అయిన చీర అంటే మోజు పడతారు

చివరగా మనం యింకో సంగతి కూడా గుర్తు పెట్టుకోవాలి. 'ది మోస్ట్ ఇంపార్టెంట్ థింగ్ వాట్ యూ వేర్ ఈజ్ యువర్ ఎక్స్‌ప్రెషన్' అని ఎక్కడో చదివేను అంటే మనం ధరించే దుస్తులకంటే ముఖ్యమైనది మనం ధరించే అంటే చూపించే భావప్రకటన. ఈ భావప్రకటన అదే మన 'ఎక్స్‌ప్రెషన్' ఎప్పుడూకూడా యితరులను ఆనందింపచేసేదిగా ఉండాలిగాని, చికాకుపరిచేదిగా ఉండకూడదు. మరి మీరుకూడా యికమీదట యివన్నీ గుర్తుపెట్టుకుంటారుగా, డ్రెస్ చేసుకునే ముందు? ★

సినిమాకి వెళ్లేటప్పుడు చీర కట్టుకుంటేనే అందం ! ఆనందం !



అమితాబ్ ఆరోగ్యం!



బెంగుళూరులో జూలై 24 న 'కూలీ' హిందీ చిత్రం షూటింగ్‌లో తీవ్రంగా గాయపడిన సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ ఆరోగ్య పరిస్థితి అప్పటినుంచి యిప్పటి వరకూ ఆందోళనకరంగానే ఉంటూ ఉన్నది

బొంబాయిలోని బ్రీచ్‌కాండీ ఆసుపత్రి వారు వెలువరిస్తున్న ప్రకటనల్లో కూడా పెద్ద మార్పు ఏమీ ఉండటంలేదు

తమ అమెరికా పర్యటనని మధ్యలో విరమించుకుని శ్రీ రాజీవ్‌గాంధీ, పర్యటన నించి వచ్చీరాగానే ప్రధాని ఇందిరాగాంధీ ప్రత్యేకంగా బొంబాయి వచ్చి అమితాబ్‌ని పరామర్శించి, ఆయన కుటుంబ సభ్యులని ఊరడించి వెళ్లిన తర్వాత అనేక రకాల పుకార్లు,ఊహాగానాలూ వెలువడ్డాయి.

ఒకవైపు అత్యంత అధునాతనమైన ఆస్పత్రిలో చికిత్సతోపాటు మరోవైపు దైవ ప్రార్థనలు, జపాలూ, మంత్రోచ్చాటనలూ కూడా అమితాబ్ ఆరోగ్యం కోసం నిరంతరం జరుగుతున్నాయి

ఇటీవల లండన్ నించి ప్రత్యేకంగా వచ్చిన వైద్య నిపుణులు అమితాబ్‌కి జరుగు తున్న చికిత్సలో లోపం లేదని, ఆయన్ని లండన్ తీసుకువెళ్లి చికిత్స చేయించాల్సిన అవసరం ఏమీ కనిపించటంలేదని అభిప్రాయ పడ్డారు. ఆ మాటలు అమితాబ్ క్రమంగా కోలుకుంటాడన్న నమ్మకాన్ని, ఆశని కలిగించేవిగా ఉన్నాయి

అమితాబ్ బచ్చన్ త్వరగా కోలుకుని, పూర్తిగా ఆరోగ్యవంతుడై మళ్లీ చిత్రాలలో ఆడుతూ పాడుతూ కనిపించి అందరినీ ఆనందింపచేయాలని ఆయన అభిమానులే కాక అందరూ కోరుకుంటున్నారు.

— ఎం.

దాంపత్య సంగీతం

సీరియల్

శ్రీమతి కళ్యాణీ సోమరాజ్

అక్కడ పూజారిలాంటి ఆకారం ఎక్కడా కన్పించ లేదు. దేముడు ముందు దివ్వె మాత్రం నిశ్చలంగా వెలుగుతోంది

కుమార్ కుంకుమ తీసి నా పాపిటలో వుంచాడు ఇద్దరం అక్కడే వున్న మెట్ల మీద కూర్చున్నాం.

"దేముడిని ఏం కోరుకున్నావ్ ?" అన్నాడు హఠాత్తుగా కుమార్

"నేనా ! ఏం లేదు అసలు ఏం కోరుకోవాలి?"

"కొత్తగా మనం కలిసి జీవితం ప్రారంభిస్తున్నాం మన దాంపత్యం సంగీతంలా హాయిగా సాగిపోయేలా చూడమని ప్రార్ధించ లేదా !"

"కుమార్ ! దాంపత్యం భార్యాభర్తల మధ్య సాగే సంగీతం శృతి సవరించుకుంటు ఆలపించుకోవలసింది మనం దానికి భగవంతుడేం చేయగలడు ?"

"నిజమే స్వాతి ! ఆయన దీవెన మనకు ముఖ్యం కదా ! ఇంత అపురూపమయిన కానుకని నాకిచ్చిన ఆ భగవంతుడికి నేనెప్పుడు కృతజ్ఞుడిలా వుంటాను" కుమార్ భావుకంగా చెబుతుంటే వినటానికి బాగుంది

"నేనంత అపురూపమయిన కానుకునా ?"

"నీకు తెలియదు స్వాతి నీకు మరొకరితో పెళ్ళి కుదిరిందనగానే విని ఎంత కృంగిపోయానో! పిచ్చివాడినే అయ్యాను."

"మరి అంత ప్రేమ వుంచుకునేవా, ఆ రోజు నా అంతట నేను పెళ్ళివిషయం ఎత్తవలసివచ్చింది?"

"నా అంతరాంతరాలలో నువ్వు అంటే ఎప్పుడూ ప్రేమ వుంది నీ మనసు తెలియకుండా సాహసించలేకపోయాను దానికి కొంత కారణం మన అంతస్తుల్లో వున్న తేడా."

"అదంతా నాన్‌సెన్స్ కుమార్"

"అంత త్వరగా ఒక నిర్ణయానికి రాకు ముందు ముందు డబ్బు తక్కువై మనం గొడవ పడతామేమో !"

"డబ్బు తక్కువైనా నాకేం భయం లేదు కాని ఇప్పుడే చెబుతున్నాను ఏమాత్రం ప్రేమ తక్కువైనా నిన్ను వదిలేసి పోతాను"

"ఛ అలాంటిది ఎప్పుడు జరగదు ఈ భగవంతుడే సాక్షి"

"చాల్లే ప్రమాణాలు పోదామా బాగా చీకటి పడింది ఇంటికి వెళ్ళి వంట గొడవ చూడాలి" అన్నాను వంట విషయం గుర్తుకు వచ్చి

"ఈ రోజుకి ఆ గొడవలేం పెట్టుకోవద్దు హాయిగా ఏ హోటల్‌కో వెళ్ళి భోంచేద్దాం."

" . . "

(గత సంచిక తరువాయి)

"అన్నట్టు అద్దం కావాలన్నావ్ ఇలాగే బజార్ వెళ్ళి వద్దామా !"

"అబ్బ. ఇంక నేను నడవలేను బాబు ముందర ఇంటికెళ్ళి కొంచెం సేపు రెస్ట్ తీసుకొని వెళదాం"

మేము ఇల్లు చేరుకునేసరికి చిన్న కుర్రాడు మా కోసం ఎదురు చూస్తూ వరండాలో కూర్చుని వున్నాడు మమ్మల్ని చూడగానే లేచి నిలబడి –

"అయ్యగార్లు ఇవి మీకిచ్చి రమ్మన్నారు" అంటూ పెద్ద స్టీలు కారియర్, చిన్న బుట్టనిండా మల్లెపూల మాలలు, విడిపూలు, కొమ్మ సంపంగెలు ఘుమా ఇస్తున్నాయి

"ఇదిగో బాబు ఈ ఉత్తరం కూడ ఇమ్మన్నారు" అంటు చిన్న పేపరు మడత కుమార్ కందించాడు

కుమార్ అది చదువు కుంటూనే తన్లో తాను నవ్వుకున్నాడు

"మీ ఫ్రెండ్స్‌కి మల్లెతోటలున్నాయా !" అన్నాను తాళం తీస్తూ

"లేవు ఏం ?"

"ఏకంగా బుట్టలతో పూలు పంపిస్తేనూ !"

"అదా ! ఈ రోజు "

"బాబు ఇక వెళ్ళేదా !" అన్నాడా కుర్రవాడు

"ఆఁ. వుండు ఇదో డబ్బు తీసుకో బస్‌లో వెళ్ళు"

"ఫ ర వా లే దు లెండి నా దగ్గరున్నాయి" అంటూ మొహమాటంగా కుమార్ ఇచ్చిన రెండు రూపాయలు తీసుకొని అతను వెళ్ళిపోయాడు

జరిగిన కథ – 3 : కాంట్రాక్టర్ రామనాధంగారి కూతుళ్ళు స్వాతి, శారద భార్య గుండెజబ్బుతో మరణిస్తుంది స్వాతి ఎం. బి బి యస్. ఆఖరి సంవత్సరం పరీక్షలు రాసింది. శారద బి ఎ చదువుతున్నా చదువుకంటే సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తుంది ఎం ఎస్ పూర్తిచేసిన కుమార్‌తో లోగడ తనకి తెలియనివి చెప్పించుకొనేది స్వాతి ఆ విధంగా వారిద్దరూ దగ్గరవుతారు చదువు పూర్తి చేసుకొని కెనడానుంచి వచ్చిన సురేంద్రతో స్వాతి వివాహం అతను అక్కడికెళ్ళేముందే నిర్ణయిస్తారు రామనాధంగారు కుమార్‌ని పెళ్ళి చేసుకొంటానన్న స్వాతి మాటలను లెక్కచెయ్యకుండా సురేంద్రతో ఆమె పెళ్ళి ఖాయం చేస్తారు రామనాధంగారు. స్వాతి, కుమార్ వివాహం చేసుకొని విశాఖపట్నంలో కాపురం పెడ్తారు.

హోటల్‌కెళ్ళే బాధ తప్పినందుకు ఆనందంగా వున్న, అలా అడుగడుక్కి వాళ్ళనుండి సహాయం తీసుకోవటం నాకు బెంగగానే వుంది ఆ విషయమే కుమార్‌తో అన్నాను

"లోకంలో మూడు రకాల స్నేహితులుంటారు కులాసా కబుర్లు చెబుతూ కాలాక్షేపానికి మటుకే పనికొచ్చేవాళ్ళు – వీళ్ళనుండి ఏ సహాయం ఆశించకూడదు ఆశించినా చేయరు రెండో రకం సహాయపడతారు కాని ఏదో తప్పదన్నట్లు చేస్తారు మూడో రకం వాళ్ళే వీళ్ళు వీళ్ళకి ఇతరులకి సహాయ పడటంలోనే ఆనందం వీళ్ళ అండ చూసుకొనే ఇలా ముక్కు మొహం తెలియని వూళ్ళో ప్రాక్టీస్ పెట్టటానికి నిశ్చయించుకొన్నది"

కారియర్ నిండా ఘుమఘుమలాడుతున్న వంటకాలు, స్వీట్స్ చాలావున్నాయి అయితే ఇద్దరం పెద్ద తినగలిగిన వాళ్ళం కాకపోవటం వలన చాలా పదార్థాలు వృధా అయ్యాయి

భోజనాలు కాగానే, కుమార్ నాకో తెల్లని జరీ చీర ఇచ్చి కట్టుకోమన్నాడు మూడువేళ్ళ వెడల్పులో జరీవున్న ఆ చీర, మెత్తగా పాము కుబుసంలావుంది

"రేపు కట్టుకుంటాలేద్దూ" అన్నాను నేను వేసుకున్న నైటీ వంక చూసుకుంటూ

"ఏమో వదిన ఈ రాత్రే కట్టుకోమంది" అన్నాడు కుమార్ ఎటో చూస్తూ

నేను మరీ మొండితనం చూపక, వెళ్ళి చీర కట్టుకొచ్చాను కుమార్ రెండు పెద్ద పెద్ద మాలలు నా తలలో తురిమాడు

"అబ్బ అన్ని పూలా! అసలు పూలు పెట్టుకునే అలవాటేలేదు" అంటూ పూలని సరిగ్గా సర్దుకున్నాను

"ఇకనుంచి నా కోసం ఈ చిన్న అలవాటు చేసుకోవూ !" అన్నాడు మృదువుగా

"మిగిలిన పూలన్ని ఏం చేస్తావ్ ?" అన్నాను బుట్టలో రాశిగావున్న పూలను చూస్తూ

"నువ్వు ఒక్క నిముషం ఆ కుర్చీలో కూర్చో ఏం చేస్తానో తెలుస్తుంది"

నేను ఇంగ్లీష్ మాగ్జైన్ తెచ్చుకొని చదువుకుంటూ చాలాసేపు అతను గురించి పట్టించుకో లేదు

ఇంతలో నామీద పూలవాన కురియటంతో ఉలిక్కిపడి తలెత్తాను కుమార్ నా కళ్ళల్లోకి మత్తుగా చూస్తూ నిలబడ్డాడు

"ఏం తలంబ్రాల సరదా ఇంకా తీరలేదా !" అన్నాను నామీద పడ్డ పూలను తీసి అతనిమీద విసురుతూ.

"లేదు నా దేవిని పూలతో పూజ చేసుకుంటున్నాను"


"అయితే వరాలు కోరుకో!"

"వరాలన్నీ అక్కడ" అంటు చటుక్కున నన్ను రెండు చేతులతో ఎత్తి మంచంమీద పడుకోపెట్టాడు.

అంతకుముందు బోసిగా వున్న డబుల్‌కాట్ ఇప్పుడు పూలతో అలంకరించుకొని పూలరధంలా వుంది. కుమార్ చేతిలో ఇంత ఆర్ట్ వుందని నాకు ఇంతకుముందు తెలియదు.

"ఎక్కడ నేర్చుకున్నావీ అలంకరణంతా!" అన్నాను

"ఇలాంటి విషయాలు వాటంతట అవే తెలుస్తాయి."



"అయితే నీదగ్గర నేను చాలా నేర్చుకోవాలి" అన్నాను జాపిన అతని చేతుల్లోకి ఒరిగిపోతూ!

* * *

ఎవరో బెల్ కొడుతుంటే బద్ధకంగా కళ్ళు విప్పాను. పాలవాడు వినయంగా నుంచుని వున్నాడు

"మీకు పాలు కావాలేమొ కనుక్కోమన్నారు"

"ఎవరు?"

"ఆ ఇంట్లో వున్న అమ్మగారు" అంటు అటువైపు చూపించి చెప్పాడు. ఎవరు పంపినా, పాలు అవసరం అనుకుంటు గిన్నె తెచ్చాను

"ఎన్ని పొయ్యమంటారు?"

ఆ విషయం నాకు తెలియదు. కుమార్‌కైతే తెలుసునేమొ అయినా అతను మంచి నిద్రలో వున్నాడు

"ఈ గిన్నెలో ఎన్ని పడితే అన్ని పొయ్యి" అన్నాను. వాడు సంతోషంగా పోసి వెళ్ళిపోయాడు

స్టౌ అంటించి పాలు పెట్టి మొహం కడుక్కోటానికి దొడ్లోకి వెళ్ళాను. అప్పటికే ఆ వాటా ఇంట్లో వున్న అద్దెవాళ్ళంతా లేచి, అందరూ కబుర్లు చెప్పుకుంటూ బట్టలుతుక్కుంటున్నారు. ఎవరికి వాళ్ళకి సపరేట్‌గా పంపులున్నా దొడ్డి అందరికి కలిసి వుండటంచేత ఈ చివరనుంచి ఆ చివరవరకు అంతా కనిపిస్తూ వుంటారు.

"ఏమ్మా! మీరేనా ఆ ఔట్ హౌస్‌లో కొత్తగా దిగినవాళ్ళు?"

"ఔనండి" అన్నాను

"ఇంకో అరగంటలో నీళ్ళు పోతాయమ్మా ఇక్కడ పట్టి వుంచుకో" అంటూ ఆ పెద్దావిడ తన పనిలో తాను మునిగిపోయింది

మా దగ్గర ఖాళీగావున్న గిన్నెల దగ్గరనుంచి బక్కెట్లవరకు నీళ్ళు నింపి వంటింట్లోకి వెళ్ళేసరికి పాలు శుభ్రంగా పొంగి స్టౌ చల్లారి వూరుకుంది పాల విషయం గుర్తు రానందుకు నన్ను నేను తిట్టుకుంటూ కుమార్ లేచాడేమో కాఫీ కలపటం ఎలాగో అడుగుదామని ముందు గదిలోకి వెళ్ళాను అతనింకా మంచి నిద్రలో వున్నాడు

ఒక చెయ్యి గుండెమీద పెట్టుకొని, నిద్రలో కూడ చెదరని చిరునవ్వుతో అతను ప్రశాంతంగా నిద్రపోతుంటే అలాగే చూస్తూ కూర్చున్నాను అతనంటే ముందెన్నడు కలగని ఆపేక్ష, ఆత్మీయత కలిగాయి 'ఇకనుంచి జీవితాంతం కష్టాల్లో, సుఖాల్లో కలిసి బ్రతుకుతాం' అని మనసులో మరోసారి స్మరించుకున్నాను. ఒక చేత్తో అతని క్రాఫ్ చెరిపేస్తు, మరొక చేత్తో అతన్ని తట్టి లేపాను

"సుప్రభాతం" అన్నాను అతను కళ్ళు తెరవగానే

"భార్య సుప్రభాతం చెబుతుంటే అన్నలు లేవబుద్ధికాదూ!" అంటూ, రెండు చేతులతో నన్ను పక్కమీదకు లాక్కున్నాడు

"అబ్బ! లేద్దూ పాలు పొంగాయి కాఫీ ఎలా కలపాలో వచ్చి చూపించు" అంటూ సున్నితంగా అతన్నుంచి విడిపించుకున్నాను.

ఆ రోజు కుమార్ కాఫీ కలుపుతుంటే శ్రద్ధగా నేర్చుకున్నాను అంతేకాదు కుమార్ తగ్గ

చేస్తున్నంతసేపు అతనికి అసిస్ట్ చేసి చాలా విషయాలు తెలుసుకున్నాను.

"కూర తరగటం తెలుసా ?" అన్నాడు హఠాత్తుగా కుమార్

రాదు అంటానికి నామోషీగా ఫీలై, "ఆఁ తెలుసు" అంటూ చాకు తీసుకొని బంగాళాదుంపలను చేతుల్లోకి తీసుకున్నాను కాని కత్తి పెట్టి నొక్కే సరికి దుంప ఎగిరిపోయి కత్తి వేళ్ళకు గీరుకొని రక్తం చిమ్మింది. అది కుమార్ కంటపడకుండా దాచాలనుకునేలోపలే అతను చూసేసాడు

"అరెరే రక్తమే! ముందు పద మందు వేస్తాను సారీ! స్వాతీ నువ్వు ఇకనుంచి వంట ఇంట్లోకి రాకు నేను చేసేస్తాలే వంట"

"ఫరవాలేదు కుమార్ మరి అంతకష్టమైన పనా ?"

"ఏది చేతులు కోసుకోవటమా !"

నవ్వి "కాదు వంట నన్ను నేర్చుకోని"

"సరే నీఇష్టం కాని ఇలారక్తపాతాలుచేయక"

6

మంచి రోజు చూసి కుమార్ ఎమ్ ఎస్ అన్నబోర్డు తగిలించాడు ఆ రోజు అతని స్నేహ బృందం వచ్చి ప్రారంభోత్సవం అంటూ హడావిడి చేసి వెళ్ళారు కుమార్ నేను మెల్లగా కొత్త జీవితంలో స్థిరపడ్డాం కొత్తల్లో ఎవరూ పేషెంట్స్ అంతగా వచ్చేవారు కాదు అయినా కుమార్ నిరుత్సాహపడేవాడు కాదు రాను రాను వారి సంఖ్య పదిమంది వరకు పెరిగింది ఆ వచ్చేవారిలో చాలా వరకు పూటకు వెతుక్కునే బీదవారు కావటంవలన కుమార్ ఫీజు ఇంతని వాళ్ళని నిర్బంధించి వసూలు చేసేవాడు కాదు నాకు తీరుబడి వున్నప్పుడల్లా కుమార్‌కి హెల్ప్ చేస్తూ వుండేదాన్ని ముఖ్యంగా గైనిక్ కేసులు నాకు వదిలేసేవాడు పేషెంట్స్ రావటానికి ఒక టైము అనేది లేకుండా పోవటం వలన, రాను రాను కుమార్, నేను బయటకు వెళ్ళే అవకాశం దొరికేది కాదు

ఈలోగా ఒక రోజు నా రిజల్ట్సు రావటం నేను ఫస్ట్‌క్లాస్‌లో పాసైయ్యానని తెలిసింది ఆ తరువాత కొన్నాళ్ళకే నేను హౌసర్జన్సీలో చేరాను

ఒక్కొక్కసారి హాస్పెటల్లో ఏమైనా అటెండ్ కావాల్సిన కేసులుండి లేటైపోతే, నాకోసం హాస్పెటల్‌కి వచ్చేసేవాడు కుమార్

"కాస్త లేటైతే ఎందుకంత ఖంగారు. నేను రాలేను"

"ఇది కొత్త వూరు. నీకు సరిగ్గా దారులు తెలియవు ఒక్కతివి రావటం అంత మంచిదికాదు"

"అసలు నీ బైక్ తెమ్మకోవలసింది" అన్నాను బస్సు కోసం ఎదురుచూస్తూ

"అమ్మేసాను" అన్నాడు మెల్లగా

"అరే ఎందుకు! నీకు అదంటే చాలా ఇష్టం అనుకుంటాను"

"నీకంటే మాత్రం కాదులే. ప్రవేట్ ప్రాక్టీస్ పెట్టాలంటే డబ్బు కావాలి కదా! మనిద్దరం ప్రాక్టీస్ చేస్తూ అప్పుడు కొందాంలే"

"అప్పుడు బైకేం ఖర్మ కారు కొందాం." అన్నాను తేలిగ్గా.

దాంపత్య సంగీతం

"బైక్ బాగుంటుంది స్వాతీ! ఎందుకో తెలుసా కార్లో మన ఇద్దరిమధ్య చాలా దూరం వుంటుంది బైక్ అయితే నువ్వు నాకు అతుక్కుని కూర్చుంటావు!"

"ఇంటా బయటా నీకు ఇదే గొడవ" అన్నాను నవ్వుతూ

"ప్రపంచం అంతా నువ్వుగానే కన్పిస్తున్నావు మరి"

"మోజు మరి"

"ప్రేమ అను"

"చూద్దాం కొన్నాళ్ళాగి"

ఇంతలో పూలు అమ్ముతూ పోతున్నవాడ్ని పిలిచి పూలు తీసుకొని నాకిచ్చాడు

"బేరం చెయ్యినేం" అన్నాను.

"ఫరవాలేదులెద్దు మనం ఇచ్చే పదిపైసలతో వాడు మేడలు కడతాడా!"

కుమార్ ఆ విషయంలోనే కాదు ప్రతి విషయంలోను డబ్బంటే లెక్క లేనట్లు ప్రవర్తించే వాడు. నాకు ముందునుంచే డబ్బు జాగ్రత్త చేసు కోవటం గురించి ఏమి తెలియక పోవటం వలన ఇద్దరం సంపాదిస్తున్నా ఇబ్బంది పడుతున్నట్లే అన్పించేది

ఒక రోజు హాస్పెటల్‌నుంచి వచ్చేసరికి కుమార్ నీట్‌గా డ్రెస్ చేసుకుని నా కోసమే ఎదురు చూస్తున్నట్లున్నాడు

"రా రా స్వాతీ! త్వరగా డ్రస్ చేసుకో అలా బయటకు వెళదాం ఈ రోజు వంట బోరు కూడ వద్దు అలా బయట తినేసి సినిమా కూడా చూసేసి వద్దాం" అంటూ నన్ను తొందర పెట్టేసాడు.

"ఏమిటంత హడావిడి పేషెంట్స్ ఎవరైనా వస్తేనో!"

"నలుగురైదుగురు వచ్చి వెళ్ళారు. ఈరోజికిక రారనే అనుకుంటాను ప్లీజ్ స్వాతీ త్వరగా రెడీఅవు కాఫీ ఫ్లాస్క్‌లో వుంది తాగేసెయ్యి"

నేను ముహం కడుక్కొని వచ్చేసరికి అతనే చీర సిద్ధంచేశాడు.

"నీ హడావిడి చూడబోతే ఆ చీర ఏదో నువ్వే కట్టేలా వున్నావ్!"

"ఎస్ మేడమ్ ఆ అవకాశం ఇప్పించాలే కాని కాదనను"

"సంతోషించాం కాని, ఆ చీర ఇలా ఇచ్చేయ్యి."

మేము బస్‌స్టాప్‌కి వచ్చేసరికి బస్ ఏదో రెడీగా వుంది కుమార్ మరోమాట చెప్పకుండా బస్ ఎక్కేశాడు. బస్ రాను రాను రష్ పెరుగుతూ కుమార్‌ని నన్ను చాలా దూరం నెట్టేసింది. ఆ రష్‌లో కుమార్ నాకు సరిగ్గా కనిపించలేదు. తీరా ఏ స్టాప్‌లో దిగాలో అతను చెప్పలేదు. అందుకని బస్ ఆగినప్పుడల్లా కుమార్ దిగుతున్నాడేమో అంటూ ఆత్రుతగా చూసేదాన్ని. చివరికోచోట అతను దిగటం చూసి జనాన్ని చీల్చుకుంటు ఎలాగో బయట పడ్డాను

"ఏయ్! ఎక్కడ దిగాలో చెప్పకుండా బస్ ఎక్కి నన్ను టెన్‌షన్‌తో చంపావ్!" అన్నాను అతని చేయి చురుగ్గా గిల్లుతూ.

"అబ్బా! అంత కోపమా బస్సు చూసిన ఖంగారులో చెప్పటం మరిచే పోయాను నువ్వెందు కడగలే అయినా దిగావు కదా!"

"ఇంతకీ ఇక్కడెందు కొచ్చినట్లు"

"నీకో మంచి చీర కొనాలని"

"నాకా చీర ఎందుకు ?"

"ఎందుకేమిటి కట్టుకోటానికి"

"అది సరే ఇప్పుడు చీర కొనేంత డబ్బు ని దగ్గర ఎక్కడుంది" అన్నాను ఖంగారుగా

"ఆ మధ్య నా పేషెంట్ ఒకతనికి ఆపరేషన్ చేసాను గుర్తుందా! అతను ఈ రోజు వచ్చి వందరూపాయాలు ఇచ్చి వెళ్ళాడు"

"అయితే ఇప్పుడు చీర కొనటం ఎందుకు రేపటినుంచి అవస్త పడటానికి చేతిలో డబ్బు బాగా వున్నప్పుడు చూసుకుందాం నాకు చీరలు చాలానే వున్నాయి"

"పెళ్ళి అయ్యాక ప్రతిభర్త తన భార్యకు ఏవేవో కొనాలని ఎంతగానో తహతహలాడుతుంటారు ఆ ఆనందం నాకు లేకుండా చేయకు అందులో ఇది నా మొదటి కానుక"

"అయితే నాకు తేలిక చీర చాలు"

"అలాగే చాలా పల్చటి చీరే కొనుక్కో"

"ఛ! అదికాదు ఖరీదైన చీరలొద్దు అని"

"సరే పద"

ఇద్దరం ఓ పెద్దషాపులోకి వెళ్ళాం!

మేము చీరల కోసం వచ్చాం అని తెలియగానే చాలా చీరలు మా ముందు తెచ్చి గుట్టగా పడేసాడు. వాటిరేట్లు అన్నీ రెండు వందలపైగానే వున్నాయి కుమార్ రేటు గమనించినట్లు లేదు

"వీటిల్లో ఇంకా మంచి వెరైటీ చూపించండి" అని అడుగుతున్నాడు ఒక్కసారి అతని చెయ్యి గిల్లాను.

"అబ్బ! మళ్ళీ ఏమైంది ?"

"ఇవన్నీ చాలా ఖరీదు"

"అయితే ఆయింది ఏం ఇప్పుడు ?"

జేబులో వందరూపాయలు పెట్టుకొని రెండు వందల రూపాయల చీరకోసం బేరం చేస్తున్నాడీ పెద్దమనిషి మనసులో విసుక్కున్నాను

చీరలు మరికొన్ని పట్టుకొచ్చి మా ముందు పరిచి "ఇవి ప్రింటెడ్ సిల్క్ ఇవి బెనారస్ ఆర్గంజీ" అంటూ వాటి నాణ్యతను చెప్పుకు పోతున్నాడు

"ఇవేవి నాకు వద్దండి. కాటన్ చీరలు చూపించండి అవైతే ఈ వాతావరణానికి హాయిగా వుంటాయి" అన్నాను

అతని మొహం కొంచెం నిరాశగా పెట్టి కాటన్ చీరలు చూపించాడు.

"ఛా నాకే చీరలు ఏం బాగలేవు స్వాతి ఆ చీరల్లో ఏదో ఒకటి తీసుకోవా!" అన్నాడు కుమార్. బతిమలాడుతు

"ఉహూ నాకొద్దు కట్టుకునేది నేను, నువ్వు మాట్లాడకు" అన్నాను.

"నువ్వు డబ్బు గురించి భయపడకు. కావాలంటే రేపొచ్చి ఇవ్వచ్చు" కుమార్ చిన్నగా నాతోచెప్పటం, మేమిద్దరం వాదించుకోవటం ఆ షాప్ అతను విన్నట్లున్నాడు. వెంటనే అతను మా దగ్గరకొచ్చి

"డబ్బుగురించి మీరేం వర్రీ అవద్దండి. రేపు అయినా ఇవ్వచ్చు" అంటూ అతను అభయం ఇచ్చాడు.

నాకెందుకో సిగ్గనిపించింది "అబ్బెబ్బె డబ్బు గురించి కాదండి, అసలు నాకా చీరలు నచ్చవు కాటన్ చీరలే ఇష్టం" అన్నాను.

చివరకు నాపీ బ్లూ మీద చిన్నచిన్న వైట్ పూలున్న చీరను సెలెక్ట్ చేసుకొన్నాను. కుమార్ మొహం ముడుచుకునే బిల్ పే చేసి వచ్చాడు

"కోపం వచ్చిందా ?" అన్నాను షాపు దిగుతు.

"ఆ కొంచెం"

"అయితే ఫరవా లేదులే. ఇక ఎక్కడికెళదాం "

"నీ ఇష్టం నేను చెప్పినట్లు వినవుగా !" అన్నాడు కుమార్.

"అయితే నా అభిప్రాయం నీకు అక్కర్లేదన్న మాట "

"అలా అని నేననలేదు.'

"మరైతే నీ ఇష్టం ప్రకారం చీర కొనుక్కున్నాం. నా అభిప్రాయం ప్రకారం నాకు నచ్చింది కొన్నాం. ఇందులో గొడవేముంది ప్లీజ్ ఈ విషయం ఇక వదిలేద్దాం" అన్నాను నచ్చచెబుతున్న ధోరణిలో.

"సరేలే హోటల్‌కెళ్ళి అక్కడనుంచి సినిమాకి వెళదాం "

"సినిమాకి వద్దు బీచ్‌కి వెళదాం."

నా వంక చూసి నవ్వి "నీ ఇష్టం" అన్నాడు.

హోటల్ నుంచి రామకృష్ణా బీచ్‌కి వెళ్ళేసరికి చీకటి పడింది. అప్పటికి చాలామంది గుంపులు గుంపులుగా కూర్చుని వున్నారు. ఇద్దరం జనం కాస్త తక్కువగా వున్నచోటు చూసుకుని కూర్చున్నాం.

"స్వాతీ ! ఇలా సముద్రం వంక చూస్తుంటే నీకేమనిపిస్తోంది ఎన్నో యుగాల ఈ సముద్రం మనముందర తన కడుపులో దాచుకున్న కథలను విప్పి చెబుతున్నట్లు లేదు."

"నీలాగా నాకేం కవిత్వం రాదు బాబు కోట్ చేయటానికి అయితే ఇలా గంటల తరబడి కూర్చున్నా కాలం తెలియకుండా గడిచిపోతుంది."

"ఈ వైజాగ్ నీకు నచ్చిందా స్వాతి !"

"వూరు నీట్‌గా లేదు. మంచి బిజినెస్ సెంటర్‌లా వుంది. అయినా ఎందుకలా అడిగావు. ఇక్కడే సెటిల్ అవాలని వుందా !" అన్నాను అతని ఉద్దేశ్యం తెలుసుకుందామని.

"అప్పుడే సెటిల్‌మెంట్‌ను గురించి ఏం చెప్పను కాని, నాకు భవిష్యత్తుమీద వెర్రిమొర్రి ఆశలు ఏమి లేవు. కాని ఒకే ఒక ఆశ వుంది."

"ఏమిటది."

"మనం మంచి నర్సింగ్‌హోమ్ ఒకటి నడపాలి. డబ్బు గురించి బాధ పడకుండా మనకు చేతైనంత వరకు పేదవాళ్ళకి వైద్యం చేయాలి. నువ్వు ఏమంటావ్ !"

"కాదనను. కాని మంచి ఎక్విప్‌మెంట్స్‌తో నర్సింగ్‌హోమ్ పెట్టాలంటే ఈ కాలంలో సాధ్యమయ్యే పనికాదు. చాల లక్షలు ఖర్చు చేయాలి. అంత డబ్బు మనం సంపాదించగలమా !"

"చూద్దాం. నాకు నమ్మకం వుంది. నీకోసమైన నేను డబ్బు సంపాదించాలి."

దాంపత్య సంగీతం

"నాకోసమా !"

"ఔను నీకోసమే స్వాతి. ఎక్కడో చక్కని పాలరాతి భవనాల్లో వుండవలసినదానివి ఇరుకు ఇంట్లో వుంచాను. ఏడువువ్వలెత్తు పెరిగిన రాజకుమారివి ఇక్కడ అడ్డమైన పనులు చేస్తున్నావు అంతేనా, ఏవో కాటన్ చీరలతో తృప్తి పడుతున్నావ్..."

"ప్లీజ్ స్టాప్. వాటి గురించి నేనెప్పుడు ఆలోచించను. డబ్బును ఎలాగైనా సంపాదించవచ్చేమో కాని నిజమైన ఆపేక్ష, నిర్మలమైన ప్రేమని మనం పొందటం చాలా కష్టం అవి నీనుండి నాకు లభిస్తున్నంత కాలం నేను మరి వేటిగురించి బెంగపడను "

"నువ్వు చాలా అల్ప సంతోషివి "

"ప్రేమ అల్పం కాదు అనంతం సరే చీకటి పడింది, పోదామా."

"కూర్చుందు. హాయిగా లేదు."

"జనం చాలామంది వెళ్ళిపోయారు."

"ఇంకా హాయిగా వుంటుంది."

"అబ్బ నాకు భయం బాబు. లే "

"వెళదాం లే మళ్ళీ గిల్లక "

"సారీ ఇందాక అలవాటు చప్పన గిల్లేసాను ఏది ఎక్కడ గిల్లాను" అతని చేతిని అందుకుంటూ మెల్లగా ముద్దు పెట్టుకున్నాను

"ఇక్కడ కూడ గిల్లినట్లున్నావ్ !" చూపుడు వేలుతో తన పెదిమిలమీద రాసుకుంటూ అన్నాడు

"ఛీ పో!"అంటూ చెయ్యివదిలేసి నుంచున్నాను

7

మేము వచ్చి నెలరోజులు గడిచిపోయాయి మరో పెద్ద ఇల్లు అద్దెకు తీసుకుందామని కుమార్ ప్రయత్నం చేసాడు కాని దొరకలేదు నా కెందుకో చిన్నదైన మేముంటున్న ఇల్లు బాగా నచ్చింది ఆ విషయమే కుమార్‌తో చెప్పి మరో ఇల్లు చూసే ప్రయత్నం మానిపించాను నిజానికి మెయిన్ బిల్డింగ్‌తోటి మాకు ఎలాంటి సంబంధములేదు చిన్న ఔట్ హౌస్‌లాగ, విడిగా వుండటం వలన మాకు ఎవరితో ఏ గొడవలేదు

అయితే ఆ మెయిన్ బిల్డింగ్‌లో చాలామంది అద్దెకుంటున్నట్లు గమనించాను. వారంతా కన్పించినప్పుడు పలకరింపుగా నవ్వినా అంత కలుపుగోలుగా వచ్చి నాతో పరిచయం చేసుకోలేదు నేను అంత చొరవ చూపలేదు. అయితే ఆ అవరణంలోనే చిన్న రేకులు షెడ్డులాంటి ఇంట్లో అద్దెకుంటున్నది మామి కుటుంబం. మద్రాస్ నుంచి వచ్చి నాలుగేళ్ళ క్రితం ఇక్కడుంటున్నట్లు, భర్త ఏదో బ్యాంక్‌లో క్యాషియర్ అన్నట్లు చెప్పింది కూతుళ్ళు ఇద్దరు తమిళనాడులోనే తలా ఒకచోట వున్నారని, కొడుకు మాత్రం ఇక్కడ ఎస్.ఎస్.సి చదువుతున్నాడని నేను అడక్కుండానే నాతో పరిచయం అయిన కొత్తల్లో చెప్పింది. తనకు వీలున్నప్పుడల్లా నన్ను వచ్చీ రాని తెలుగు భాషలో పలకరించి పోతూ వుంటుంది అంతేకాకుండ ఆ బిల్డింగ్‌లో ఎవరికే సహాయం కావాలన్న మంచి మనసుతో చేస్తూ వుంటుంది.

ఆరోజు నైట్ డ్యూటీచేసి మధ్యాహ్నం లీవ్‌లో ఇంట్లో వున్నాను కుమార్ ఆపరేషన్ కేస్ వుందంటూ అతని ఫ్రెండ్స్ నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళాడు ఎప్పుడైన ఇతని సబ్జక్ట్‌కి సంబంధించిన కేసెస్ ఏమైనా వస్తే అతని ఫ్రెండ్స్ కుమార్‌కి కబురు చేయటం, ఈ మధ్య తరుచుగ జరుగుతున్న విషయం ఒక్కొక్కసారి కుమార్ తన పేషెంట్స్‌లో ఎవరికైనా ఆపరేషన్ చేయాల్సి వచ్చినా, వాళ్ళ నర్సింగ్‌హోమ్‌లోనే చేర్చి ఆపరేషన్ అక్కడే చేయటం, స్నేహితుల సహకారం వలన ఏ ఇబ్బంది లేకుండా గడిచి పోతోంది ! ఆ విధంగా అతనికి ఆపరేషన్ చేయడానికి తగిన అవకాశాలు కలుగుతున్నాయి

మధ్యాహ్నం నిద్ర అలవాటు లేని నాకు నిద్ర రావటంలేదు తీరుబడిగా మెడికల్ జర్నల్ తిరగేస్తూ కూర్చున్నాను ఇంతలో తలుపు చిన్నగా తట్టిన శబ్దం విని తలుపు తీశాను ఎదురుగుండా ఓ స్త్రీమూర్తి అది పేషెంట్స్ వచ్చే టైం కాకపోవటం వలన ఆమెను చూసి కొంచెం ఆశ్చర్యపోయాను

"క్షమించండి మిమ్మల్ని డిస్ట్రబ్ చేసినందుకు నా పేరు శారద ఆ మెయిన్ బిల్డింగులో చివరి పోర్షన్ అద్దెకుంటున్నాం. మా వారు హైస్కూల్లో డ్రిల్ మాస్టారు" అంటూ తనంతట తాను పరిచయం చేసుకుంది

"రండి లోపలికి" అంటూ దారి ఇచ్చాను

మామితప్పించి మరొకళ్ళు పెద్ద పరిచయం లేకపోవటంవలన, ఆవిడను అంత త్వరగా గుర్తించలేకపోయాను

"నాకు రెండురోజుల నుంచి ఒళ్ళునొప్పులు జ్వరంగా వుంది ఏమైనా మందిస్తారేమోనని" ఆమె ఎదురుగా నేను కూర్చోగానే అంది మనిషి చూస్తే చాలా జబ్బు పడ్డ దానిలా బొత్తిగా రక్తం లేనట్లుంది చాలా నీరసంగా వస్తోంది మాటకూడా

"రెండు రోజుల నుంచి వస్తుంటే ఇప్పుడా రావటం. నిన్ననే రావలసింది మీరు" ఆమె పల్స్ చూస్తూ అన్నాను.

"తగ్గిపోతుందనుకున్నాను" అంది హీన స్వరంతో

"పొన్లెండి ఈ మందులు రెగ్యులర్‌గా తీసుకోండి పాలు, హార్లిక్స్ లాంటివే తీసుకోండి అన్నం తినద్దు బైది బై మీరు చాలా ఎనిమిక్‌గా కనిపిస్తున్నారు. జ్వరం తగ్గాక మంచి మందులు వ్రాసిస్తాను వాడండి" అంటూ నే వ్రాసిన ప్రిస్క్రిప్షన్ ఆమె చేతిలో వుంచాను


"మీ ఫీజు" తన కొంగు విప్పదీసి దానిలో చిన్న మడతలో పెట్టిన రెండు రూపాయల నోటు తీసింది

"ఫరవాలేదు ముందు జ్వరం తగ్గనీయండి తరువాత చూద్దాం" అంటూ తీసుకోలేదు నేను

ఆమె రెండు నిముషాలు కూర్చుని నాకు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయింది. ఆమెను చూసాక ఎందుకో నాకు తెలియకుండానే శారదపట్ల నా మనసు జాలితో నిండిపోయింది బీదరికమో, అనారోగ్యమో ! ఆమె ఆనందంగా బ్రతుకుతున్న స్త్రీ కాదనిపించింది

(ఇంకా వుంది)

ఘోరాక్షుని డైరీ



వింత చావు !

లండనులో 62 ఏళ్ళ ఇరిన్ సోమర్‌విల్లి అనే ఒకామె వాన వస్తుండగా వచ్చిన ఉరుము మెరుపుకు గుండె కాలి చనిపోయిందట. శవ పరీక్ష చేసిన డాక్టరు ఆమె మెటల్ బాడీ వేసుకున్నదనీ ఆ బాడి, మెరుపులోని విద్యుత్తును ఆకర్షించడంవల్ల ఆమె చాతీ కాలిందని అన్నారట! అంతేగాక యిది చాలా విడ్డూరమనీ తాను యిలాటి వార్త మరొకటి విన లేదనీ కూడా అన్నారట!

మహిళా డిటెక్టివ్ !

జపాను డిటెక్టివ్ సంస్థలో మొట్ట మొదటి మహిళా డిటెక్టివుగా 25 ఏళ్ళ నారికో ఆరవ్ నియమించబడినదట. ఈమె 18 ఏళ్ళకి పోలీసు డిపార్టుమెంటులో చేరి ట్రయినింగులు పూర్తి చేసుకుని ఏడు సంవత్సరాలలో యీ పదవికి వచ్చిందట! మహిళలు ఎందులోనూ తీసిపోరనీ, మహిళలు చక్కని డిటెక్టివ్‌లుగా పురుషులకన్నా మంచి పేరు తెచ్చుకోగలరనీ ఆమె అన్నారట— ఇది మామూలు పాటే!

హత్యా ? ఆత్మహత్యా ?

పంజాబు యూనివర్శిటీనుంచి ఎం. ఏ. డిగ్రీ పుచ్చుకున్న రీటా అనే ఆమెకు, సి. బి. ఐ. ఇన్‌స్పెక్టరు ఒకాయనకూ మొన్న జులై 11 వ తేదీన వివాహం అయిందట. వారు 15 వ తేదీన కాశ్మీరు, శ్రీనగరూ హనీమూనుకు వెళ్ళారట. 24 వ తేదీన షికారుకు వెళ్ళిన రీటా తిరిగి రాలేదట. 27 వ తేదీన ఆమె శవం పహల్‌గావ్ అనే చోట పోలీసులు కనుగొన్నారట. ఈమె కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని అట. ఇది హత్యా, ఆత్మహత్యా అనే అనుమాన నివృత్తికి పోలీసు లామె భర్తను అదుపులోకి తీసుకున్నారట, అనుమానం పేరిట. నాచురల్లీ!

అంతం చూసిన అక్రమ సంబంధం !

సేలం జిల్లా తమ్మంపట్టి తాలుకా పచ్చమలైకు చెందిన 50 ఏళ్ల పిచ్చముత్తు భార్య చెల్లమ్మ శీలం మీద అతనుఅనుమానం పెంచుకున్నాడట. చెల్లమ్మకు నిజంగానే అదే వూరికి చెందిన చినసామి అనే అతినికి చాలాకాలంగా రహస్య ప్రేమాయణం జరుగుతూ వచ్చిందట. ఇది తెలుసుకున్న పిచ్చి ముత్తు భార్యను దండించబోయే సరికి యిన్నాళ్ళూ తెలియక వూరుకుంటే యిప్పుడు తెలిసి వూరుకో అని సలహా యిచ్చిందట. ఇది భర్తకు తెలిసిందని ఇహభర్త ఇంట్లో లేనపుడా మన్మథరావుని యింటికే రప్పించుకోనారంభించిందట. వో రోజు పొలంనుంచి యింటికి వచ్చిన పిచ్చముత్తు తన భార్యను, ఆ ప్రియున్నీ తన పడక గదిలో చూసి పిచ్చెత్తినట్టు గంగ వెర్రులెత్తి గునపం తీసుకుని యిద్దర్నీ క్రూరంగా పొడిచి చంపేశాడట. చంపడా! అసలే పిచ్చముత్తు కూడాను.

విఫల ప్రేమికుల ఆత్మహత్య !

కర్ణాటక రాష్ట్రం మద్దికెరికిచెందిన ఇచ్చివలవాడె అనే గ్రామంలో 16 ఏళ్ళ భవాని అనే అమ్మాయి, 25 ఏళ్ళ చిన్నప్ప అనే అతనూ పరస్పరం ప్రేమించుకుని, ఆ తరువాత వివాహార్థ యత్నాలారంభించేసరికి వారి కన్నవారు సుతరామూ ఒప్పుకోక "నావు షమ్మతి కొడువదిల్ల" అని కన్నడంలో మండిపడ్డారట. దాంతో యీ ప్రేమికులు యీ తుచ్ఛ భువిని బ్రతుక నిష్టపడక పిస్టలుతో కాల్చుకు చనిపోయారట— అంతకన్నా పారిపోయుండుంచ్చుకదా! హవుదు.

14 ఏళ్ళ బాలుని వింత ప్రవృత్తి !

జొహన్స్‌బర్గ్‌లో 14 ఏళ్ళ అర్కాన్‌సన్ అనే కుర్రాడు పదిహేనుమంది ఆడపిల్లలను పట్టుకుని తన కామవాంఛ తీర్చుకున్నాడట. ఈ కేసు విచారించిన జడ్జిగారు హడలిపోయి ఆ కుర్రాడిని జువెనిల్ ట్రయినింగ్ స్కూలుకు బాగుపడే దాకా ట్రయినింగుకు పంపమని తీర్పు నిచ్చారట.

హత్యకి దారితీసిన అనుమానం !

తిరుచ్చికి చెందిన తమిళరసన్ అనే అతనికి అతని భార్య వసంత ప్రవర్తనమీద అనుమానం వచ్చి, అది నమ్మకమై కూర్చుంది‌ట. దాంతో అతనో పథకంవేసి దాని ప్రకారం ఆమెను సినిమాకని బయల్దేరదీసి, దారిలో కొబ్బరి బోండాములు అమ్మే షాపు దగ్గర ఆగి, రెండు బోండాములు కొట్టియివ్వమన్నాడట. అతను తాగేసి, ఆమె త్రాగుతూండగా ఆ షాపువానిదగ్గరున్న ఆ పెద్దకత్తితో సర్రున ఆమె మెడ తెగిపోయేలా ఒక్కవేటు వేశాడట. దాంతో ఆమె తల పుట్బాన ఎగిరి క్రింద పడిందట.

పదహారేళ్ళ వయసు !

"వచ్చింది చిన్నపిల్లో, పెద్ద పిల్లో మీకేల? వచ్చినమ్మాయి గర్భ నిరోధక సలహాలు, మందులు, మాత్రలు మిమ్మల్నడిగితే కిమ్మనకుండా రాసివ్వండి ఆ పిల్ల తలిదండ్రులకు యీ విషయం చెప్తానని బెదిరించకండి'' అని బ్రిటీషు ప్రభుత్వం అక్కడి డాక్టర్లను కోరిందట. పదహారేళ్ళ లోపు పిల్లలు యీ సలహాల కోసం రావడం ఎక్కువయిందటా రాజ్యంలో. ●

పాలమండలో విషబిందువులు



రావినూతల సువర్ణాకన్నన్

"రాజా!..."

పుస్తకాల బొత్తి ఎడం భుజం మీద పెట్టుకుని ఆ చేత్తోనే వాటిని గట్టిగా పట్టుకుని పరధ్యానంగా నేల చూపులు చూస్తూ నడుస్తున్న రాజు తృళ్ళిపడ్డాడు.

"ఏమి టాజా!... నువ్వు కూడా లేటా? నేను లేట్! ... రా!... కూర్చో పోదాం" ఆహ్వానించింది రాధిక.

రాజు ముఖం వెలిగిపోయింది.

"అవునమ్మాయిగారూ! ఈరోజు అమ్మకి కూరలు తెచ్చేసరికి ఆలస్యం అయిపోయింది. అందుకే అన్నం కూడా తినకుండా వెళ్ళిపోతున్నాను!" గబగబ ఆగివున్న కారు దగ్గరి కొస్తూ అన్నాడు ఇంటర్ చదువుతున్న పదహారేళ్ల రాజు

"అయితే రా!... స్కూల్ దగ్గర దిగిపోదువుగాని" అని, "రాఘవయ్యా తలుపు తియ్యి!" ఆజ్ఞ జారీ చేసింది పదమూడేళ్ళ రాధిక!

"వద్దమ్మాయిగారూ!... వాడింకా భోజనం చెయ్యలేదు!... అన్నం తినకుండా వెళ్ళిపోతే వాళమ్మ ఊరుకోదు. మీరెళ్ళండి" మెల్లగా అన్నాడు రాఘవయ్య

కారు ఎక్కాలనే ఉబలాటం తండ్రి చూసిన కోర చూపుతో దిగిపోయింది రాజుకి.

"అవునమ్మాయిగారూ! నేను అన్నం తినాలి!" అనేశాడు. అంతే... కారు దూసుకుపోయింది.

అంతవరకు ఆగివున్న రాజు ఉస్సురంటూ తిరిగి నడకప్రారంభించాడు అతని మనసంతా చిరాగ్గా అయిపోయింది. "ఛీ! ఈ నాన్న ఎప్పుడూ ఇంతే... నేను కారెక్కితే తనకేం నష్టం?" గొణుక్కున్నాడు.

రాధిక ఇంజనియర్ గోవర్ధన్‌గారి ఏకైక పుత్రిక. ఓ మంచి కాన్వెంట్‌లో ఎయిత్ చదువుతోంది.

రాజమహల్లాంటి వారింటికి దొడ్డివైపు ఓ మూలగా ఔట్‌హౌస్ వేయించి డ్రైవర్ రాఘవయ్యకి ఇచ్చాడు గోవర్ధన్. అతని భార్య ఓ సోషల్ లేడీ!

రాఘవయ్య, లక్ష్మి దంపతులకు రాజు కాక మరో ఇద్దరాడపిల్లలున్నారు.

గోవర్ధన్ మంచి డ్రింకర్. అప్పుడప్పుడు భార్యని కూడా తాగమనడం, ఆవిడ తాగడం కూడా జరుగుతూ ఉంటాయి.

రాఘవయ్యకి వయస్సు పైబడుతున్నా

పాలకుండలో...

అమ్మాయిల రంధి మాత్రం వదల్లేదు. చిన్నతనం నుంచీ... అందుబాటులో ఉన్న ఆడపిల్లల్ని తెలివిగా ఉచ్చువేసి పట్టేసేవాడు.

అడపాదడపా తన్నులు తినడం, అంటు రోగాలతో హాస్పిటలు పాలవడంకూడా కద్దు.

బిజీ జీవి అయిన గోవర్ధన్ ఇలాంటివి అంతగా పట్టించుకునేవాడు కాదు. తనదగ్గర మంచిగా ఉన్నాడు అది చాలు! అనుకునేవాడు.

రాజా చురుకైన పిల్లాడు. కానీ సినిమాల పిచ్చి ఎక్కువ. రాధిక కూడా వచ్చిన ప్రతి సినిమా చూస్తుంది. రాజంటే ఆ పిల్లకి ఒక విధమైన అభిమానం.

కానీ గోవర్ధన్‌కి తన కూతురు ఒక కారు డ్రైవర్ కొడుకుతో, అదీ తన ఉప్పు తిని బ్రతికే రాజాతో చనువుగా మాట్లాడడం సహించలేదు.

అది తెలిసిన రాఘవయ్య కూడా తన భార్యా బిడ్డల్ని దూరంగానే ఉంచుతాడు.

అందుకే ఈరోజు రాధిక రాజాకి లిఫ్టు ఇస్తానన్నా అతను అంగీకరించలేదు. ఇది అలవాటుగా మారచ్చు! ఆపై యజమాని తనకి ఉద్వాసన చెప్పవచ్చు!

రాజాకి ఆ రోజు మనసు మనసులో లేదు. "అసలు నాన్నకిబుద్ధిలేదు! తనైతే ఎప్పుడూ కార్లోనే తిరుగుతాడు. మరి మే మెక్కకూడదు!... జీవితంలో కారు ఎలాగూ కొనలేం! కనీసం ఎవరైనా లిఫ్టు ఇస్తానంటే మధ్య ఈయన సొమ్మేం పోయిందట?..." ఇలా వున్నాయతని ఆలోచనలు.

అందుకే స్కూల్లో టీచర్ ప్రశ్నలకి సరిగ్గా జవాబు చెప్పక తిట్లుతిన్నాడు.

"ఏరా రాజా!... అన్నం తినకుండా ఏమిటా దిక్కులు చూడటం?" భోజనం ముందు తల్లి విసుక్కుంది.

"ఆకలిగా లేదమ్మా!" చిరాగ్గా అన్నం ముందు నుంచి లేచిపోతున్న కొడుకుని వింతగా చూసింది తల్లి.

* * *

రాత్రి తొమ్మిది దాటింది.

నగరమంతా దేదీప్యమానంగా వెలిగిపోతున్నా గోవర్ధన్‌గారి బంగళా మాత్రం నిద్రావస్థలో ఉన్నట్టుంది. బైట, గోవర్ధన్‌గారి గదిలోనూ తప్ప అంతా దాదాపు చీకటిగా వుంది.

రాఘవయ్య గదిలో కూడా చిన్న లైట్ తప్ప వెలుగులేదు. పది కాకపోయినా అర్ధ రాత్రిలా వుంది

రాధిక నిద్రరాక విశాలమైన ఆ డన్‌లప్ బెడ్‌మీద చిరాగ్గా మసులుతోంది. ఎప్పుడూ లేనిది ఆ పిల్లకి ఒంటరితనం పిచ్చెక్కించేలా వుంది

క్లాస్ పుస్తకాలు తీసినా బుర్రకెక్కడం లేదు "ఛీ! డాడీ ఎవ్వరితోనూ మాట్లాడ దంటారు. ఎలా? తనకన్న గొప్పవారితోనే మాట్లాడాలట!

అయితే నేను వారికన్న తక్కువదాన్నయితే నాతో ఏలా మాట్లాడుతాడు?... ఇంత మాత్రం ఆలోచన డాడీకిలేదు!" విసుక్కుంది.

రాధికకి హఠాత్తుగా రాజు గుర్తొచ్చాడు. "అతనెంత బావుంటాడు?... ఎంత చక్కగా మాట్లాడుతాడు? ఏమిటో అతనితో మాట్లాడితేనే మండిపడతాడు డాడీ! రాఘవయ్య కూడా అంతే!... మేమిద్దరం మాట్లాడితే చాలు రాజుకి ఏదో ఓ పని చెప్పి పంపేస్తాడు ఛీ! ఈ పెద్దవాళందరూ ఇంతే!... పాపం! రాజుక్కూడా తనతో మాటాడటం ఇష్టమే!" ఆలోచిస్తున్న రాధిక తృళ్ళి పడింది.

తండ్రి గదిలోంచి పెద్దగా నవ్వులు వినిపిస్తున్నాయి. తల్లి కూడా పగలబడి నవ్వడం ఆ పిల్లకి వింతగా తోచింది.

కాసేపు ఆ నవ్వుల్లో తనూ పాల్గొనాలని మెల్లగా లేచి తండ్రి గదికేసి నడిచింది.

హటాత్తుగా వెళ్ళి తల్లిని జడిపించాలనే కొంటె ఊహతో అడుగులో అడుగు వేసు కుంటూ వస్తున్న ఆ పిల్లకి, తల్లి నోట తన పేరు వినిపించగానే టక్కున ఆగిపోయింది.

"ఛ! మీకు సిగ్గులేదు! పక్క గదిలో రాధిక పడుకుంది. ఇంకా పదిగంటలైనా కాలేదు. ఏమిటీ పిచ్చి?" అలా విసుక్కున్నా అది కోపంలా అనిపించలేదు ఏదో గుణిసినట్టు ఉంది.

"దానిమొహం! చిన్నపిల్ల! దానికేంతెలుసు! అయినా అది ఈపాటికి నిద్ర పోయే ఉంటుంది!" తండ్రి గొంతది!

రాధికకి చాలా కోపం వచ్చింది.

"ఏమిటీ తను చిన్నపిల్లా?... తనకేం తెలియదా? అసలు నాన్న ఉద్దేశం ఏమిటి? తను పెంద్రాళే పడుకునే మాట్లైతే నిజమే గానీ... ఏం తెలియదంటే ఎలా?" చిరాగ్గా కిటికీ కర్టెన్ తొలగించి చూసిన ఆ పిల్ల కొయ్యబారి పోయింది.

టేబిల్‌మీద త్రాగుడు సరంజామా, ఆ పక్క డబుల్‌కాట్ మీద దాదాపు నగ్నంగా వున్న తల్లి, తండ్రి!

* * *

రాజు మెలగా లేచాడు. తండ్రి కేసి చూశాడు అతను గాఢ నిద్రలో వున్నట్టు గుర్రు వినిపిస్తోంది. తల్లి తండ్రి మంచం పక్కన చాపమీద ఇద్దరు పిల్లల్ని పెట్టుకుని పడుకుంది.

ప్రతి రోజూ రాత్రి పది దాటాక తండ్రి ఎవరూ చూడకూడదన్నట్టు చదివి అటకమీద దాచేపుస్తకంఏమిటోతెలుసుకోవాలనే ఆరాటం రాజులో ఎక్కువైపోయింది. ఈ రోజు అందరూ త్వరగా పడుకోవడంతో అది చూడ టానికి అవకాశం వచ్చింది.

మెల్లగా ఆ పుస్తకాన్ని తీసుకుని చప్పుడు కాకుండా బైటకొచ్చి పంప్‌సెట్టున్న గదిలోకి వెళ్ళి లైట్ వెలుగులో ఎవరూ చూడ రనుకున్న ప్రదేశంలో కూర్చుని కుతూహ లంగా, ఆత్రుతగా పుస్తకం పేజీలు తిప్పాడు.

అతనిలోని రక్తం వడివడిగా ప్రవహించి నట్లయింది.

అది ఒక చవకబారు "సెక్స్ బుక్!" అసభ్యకరమైన ఫోటోలు! కథలు!

* * *

ఆ రోజు మొదలు రాజు తండ్రి తెచ్చే పుస్తకాలు చదవడం, రాధిక నిద్ర నటించి తండ్రి గదిలో బ్లూఫిలిం చూడడం నిత్య కృత్యం అయిపోయింది.

ఇదరిలోనూ చదువు వెనకబడింది.

"రాజూ!" ఓ రోజు మెల్లగా పిల్చింది రాధిక

"ఏం?" కళ్ళతోనే ప్రశ్నించాడు రాజు, తమ కంఠం తల్లిదండ్రులకి ఎక్కడ వినిపిస్తుందో అని.

"ఈ రోజు సాయంత్రం స్కూల్ ఎగ్గొట్టి పార్కుకి రా!" రహస్యంగా అంది.

"ఎందుకు?" వింతగా చూశాడు రాజు.

"చెప్తాగా!" అనేసి చకచకా వెళ్ళి పోయింది రాధిక.

రాజు మనసంతా అదోలా తియ్యగా అయి పోయింది. "రాధిక నన్నెందుకు రమ్మంది? తనని ప్రేమించిందా?" ఏదో సినిమా గుర్తొచ్చి ఉత్సాహంగా లేచాడు.


రాజు, రాధికలు అనుకున్నట్టు యిద్దరి స్కూళ్ళకీ మధ్యగా ఉన్న ఓ పార్కులో ఓ చెట్టుకింద చతికిల పడ్డారు.

"ఏమిటమ్మాయిగారూ?" మౌనాన్ని ఛేదించాడు రాజు. అతనికి ఆత్రుతగా వుంది వినాలని.

"సినిమా కెడదామా?"

"అమ్మో!" గుండెలమీదే చెయ్యి వుంచు కున్నాడు రాజు, తండ్రి నరసింహావతారం గుర్తొచ్చి.

"ఛీ! నువ్వేం మగాడివి..." విసుక్కుంది రాధిక.



"కాదమ్మాయిగారూ..."

"ఇదుగో రాజా! నేను చెప్పేది జాగ్రత్తగా విను!... నన్ను అమ్మాయిగారూ, అమ్మాయి గారూ అంటే నేను నీతో మాట్లాడనే మాట్లాడను! చక్కగా 'రాధీ!' అని పిలు!" ఇరవై ఏళ్ళ యువతిలా తన్మయత్వంగా అంది రాధిక

రాజు పొంగిపోయాడు.

"అలాగే!" అన్నాడు ఆనందంగా అతనికి గొప్పింటి పిల్ల పాలేరుని ప్రేమించడం, ధనవంతుల బిడ్డ పనిపిల్లని ప్రేమించడం లాంటి సినిమాలు చాలానే తెలుసు!

"ను... వ్వు... నన్ను ప్రేమించావా?" మెల్లగా అన్నాడు.

"అవును," అన్నట్టు తల ఊపింది రాధిక.

రాజు ఉత్సాహంగా ఆ పిల్ల చెంపమీద ముద్దు పెట్టాడు. ఆమెసిగ్గుతో ముడుచుకు పోయింది

ఆ పిల్లకి ఓ సినిమాలో పదిహేనేళ్ళపిల్ల పదిహేడేళ్ళ పిల్లాడు ప్రేమించేసుకోవడం గుర్తొచ్చి ఆ హీరోయిన్ తనే అన్నట్టు మురిసిపోయింది

* * *

"ఛంపేస్తాను వెధవా! చదువు మానేసి ఈ వెధవ పుస్తకాలు చదువుతావా?" అటక మీద తాను రహస్యంగా దాచి చదువుకునే పుస్తకాలు కొడుకు తీసి చదవడం చూసిన రాఘవయ్య కొడుకుని చావబాదేస్తున్నాడు.

మేడమీదినుంచి అంతా గమనిస్తున్న రాధికకు కూడా దుఃఖం వచ్చింది రాజుని చూస్తుంటే. అది కేవలం రాజుమీద జాలి మాత్రమే కాదు, చిన్న రాత్రి తండ్రి గదిలో జరిగే తంతు రహస్యంగా గమనించడం చూసిన అతను తనని ఇలాగే బాదేశాడు. కానీ ఎవరికీ వినిపించకుండా... తాము పెద్దవారు గదా! అందుకే అన్నీ రహస్యంగా జరిగిపోవాలి! అయినా వెధవ పుస్తకాలు అని తెలిసినపుడు అతగాడు మాత్రం ఎందుకు చదవాల్సి?... పళ్ళు నూరుకుంది రాధిక.

మర్నాడు మామూలుగా కలుసుకున్నారు రాజూ, రాధికలు.

"రాధి! ... మనం ఎక్కడికైనా వెళ్ళిపోదాం!" హఠాత్తుగా అన్నాడు రాజు.

త్రుళ్ళిపడింది రాధిక "ఎక్కడికి !"

"ఎక్కడికో అక్కడికి! ఈ విశాల

పాలకుండలో...

ప్రపంచంలో మనిద్దరికీ చోటు వుండకపోదు!" ఏదో సినిమా డైలాగు విసిరాడు రాజు

"ఇది సినిమాలో డైలాగా ?" అని ఆలోచనలోపడ్డ రాధిక కాసేపాగి "అయితే విప్పుడెడదాం ?" అంది

"నీ దగ్గర డబ్బెంతుంది ?" అడిగాడు రాజు.

"ఏ క్కు వ లే దు ! ఐస్‌క్రీమ్స్, అవీ కొనేశాను ! ఆఁ... అన్నట్టు మా అమ్మమ్మ ఇచ్చిన వందరూపాయలలో ఇంకా నలభై రూపాయలుంది."

"సరే ! నా దగ్గర నాలుగుంబావలాఉంది! ప్రస్తుతం చాలు !"

"రాజా !" అంది రాధిక.

"ఏమిటి ?"

"అమ్మని వదిలి నే నెప్పుడూ వుండ లేదు !"

క్రొత్త నిరోధకౌషధం

జపానులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, హయిషిబిరా బయో కెమికల్ లేబొరేటరీస్‌వారుసంయుక్తంగా ఒక నిరోధకౌషధాన్ని రూపొందించారు. ఈ కొత్త నిరోధకౌషధం వలన ఇతర దుష్ఫలితాలు ఏర్పడకపోవడం ఒక విశేషం జంతు సంబంధమైన విష పదార్థాలను శాకరైడ్స్‌తో కలిపి దీనిని తయారు చేస్తారు. కొన్ని రకాల పాములు, తేళ్ళ విషానికి ఇది మంచి విరుగుడు కాగలదు

"ఓస్ ! అదా ! పెళ్ళయితే అత్తవారింటికి వెళ్ళద్దూ ? కాస్త ముందుగా వెడుతున్నాననుకో అంతే !" తేలిగ్గా అనేశాడు రాజు

"కానీ...మనం చిన్నపిల్లలం !..."

"భలేదానివే !" పెదగా నవ్వేడు రాజు.

"ఎందుకానవ్వు ?" చిరుకోపంతో అంది రాదిక.

"మనం ఈ మధ్య స్కూల్‌కి డుమ్మా కొట్టి చూసిన సినిమాల్లో హీరో, హీరోయిన్ను చిన్నపిల్లలు కాదూ ? మనం లక్ష్మిలో చూసిన సినిమాలో పదిహేనేళ్ళ అమ్మాయికి కొడుకు పుట్టలేదూ ?" ధైర్యం చెప్పాడు రాజు.

రాధికకి ఆ సీన్ గుర్తొచ్చింది. "నిజమే లాస్ట్‌కి పెళ్లి సీన్లో ఆ పిల్లాడికి పాలుకూడ ఇస్తుందా హీరోయిన్ !" మెల్లగా గొణిగింది.

"ఆఁ ... ఇంక భయంలేదుగా ? ... ఆ సినిమాలోలాగే కొన్నాళ్ళకి పెద్దాళ్ళు మనల్ని వెతికి తీసికెళ్ళి పెళ్ళి చేసేస్తారు! ఇంక అప్పై మీ అమ్మా నాన్నలా ఒకే గదిలో ఒకే మంచం మీద..." అతని మాటలు పూర్తికాలేదు. సిగ్గుపడి పోయింది రాధిక. చెంపలు అరుణిమ దాల్చాయి.

"మా నాన్నలా బోలెడు సెక్స్‌బుక్స్ పబ్లిగ్గా చదువుకోవచ్చు !" రాధిక చెంపమీద పెదవులాన్చాడు రాజు

పదమూడేళ్ళ రాధికా, పదహారేళ్ళ రాజా పిన్నిప్రేమికుల్లా ఎవరికీ చెప్పకుండా ఎగిరి పోయారు.

* * *

రోజులు, నెలలు గడిచిపోతున్నాయి. రాజు కోసం రాఘవయ్య దంపతులు, రాధిక కోసం గోవర్ధన్ దంపతులు అనేక విధాల గాలించి విసిగి వేసారి పోయారు.

చివరికి ఆశ వదులుకున్నారు.

రెండేళ్ళ తరువాత రాజు మతిస్థిరం లేకుండా ఇల్లు చేర్చబడ్డాడు.

అణగారిపోయిన ఆశ చిగురించిన గోవర్ధన్ దంపతులు పరుగున, తూలనాడి వెళ్లగొట్టిన మాజీ డ్రైవర్ ఇల్లు చేరి రాజుని అనేక విధాలుగా ప్రశ్నించి ఓడిపోయారు.


అన్నింటికీ వెకిలిగా నవ్వడం, భోరుమని ఏడవడంతప్ప అతనేలాంటి ఇన్‌ఫర్మేషన్ ఇవ్వలేకపోయాడు.

అతనికి పిచ్చి ఎందుకు ఎక్కిందో మాత్రం వారికి అర్థం కాలేదు.

కానీ ఇద్దరూ కలిసి వెళ్లినప్పుడు ఓ పెద్దమనిషి నమ్మించి ఆ ఇద్దర్నీ ఇల్లు చేర్చి వికపించని ఆ కన్నె కుసుమాన్ని మూమ షంగా చిదిమి నేలరాసిన ఆ దృశ్యాన్ని కళ్లారా చూసే, ఆమె ఆక్రందనలు చెవులారా విన్న రాజుకి మతిస్థిరం తప్పిందనీ, ఇంక పరిస్థితి ఇదీ అని అతడు చెపుతాడనీ, ఎవరుచెప్తారు?

పది సంవత్సరాలు గడిచినా రాజులో మార్పులేదు. అలా పిచ్చిగా రోడ్లంట తిరుగుతూనే ఉన్నాడు.

ఏ చిన్నపిల్ల కనిపించినా "రాధీ !



మనోనైర్మల్యం

మనం ఏ పని చెయ్యాలన్నా మనస్సు ఎట్టి చికాకులకూ గురికాకుండా నిర్మలంగా ఉండాలి. అలా ఉన్నప్పుడే ఆ పని సక్రమంగా నెరవేరుతుంది. లేకపోతే ఆ పని పాడవుతుంది. మనస్సు పరిశుద్ధంగా ఉన్నప్పుడే చదువు ఒంటబట్టి విద్యార్థులు పరీక్షలలో కృతార్థులు కాగలరు. ఇట్టి స్థితిలో భగవంతుని ధ్యానానికి మనస్సు నిర్మలంగా ఉండాలని వేరే చెప్పనక్కర్లేదు. మనస్సు అపరిశుద్ధంగా ఉన్నప్పుడు చేసే భగవద్ధ్యానం నిష్ప్రయోజనం.

భగవదవతారమూర్తులైన రాముణ్ణీ, కృష్ణుణ్ణీ విభిన్న చిత్రకారులు చిత్రించే చిత్రాలు వేర్వేరు రీతుల – ఉంటాయి. శిల్పులు చెక్కిన విగ్రహాలు విభిన్న రీతులలో ఉంటాయి. అయినా, దేనిని చూచినా భగవద్భావన కలుగుతుంది. ఒక చిత్రం సరియైనదనీ, మరొకటి సరియైనది కాదని చెప్పలేము. అలాగే ఒక విగ్రహం సరియైనదనీ, మరొకటి కాదనీ చెప్పలేము. మన హృదయం నిర్మలంగా ఉంటే – సరియైన ధ్యానం వుంటే భగవంతుడు మనం తలచుకొన్న రూపంలోనే హృదయంలో కానవస్తాడు.

మనస్సు అద్దంవంటిది. అద్దం మాలిన్యంతో కూడి ఉన్నప్పుడు ఏ వస్తువూ దానిలో ప్రతిబింబించ జాలదు. అది నిర్మలమై, పరిశుభ్రంగా ఉన్నప్పుడే అన్ని వస్తువులూ స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. ఆ విధంగానే మనస్సు కాలుష్యం లేకుండా ఉంటే ధ్యానం చేసేవారికి భగవంతునిరూపం గోచరమగుతుంది. చిత్రకారునికి గాని, శిల్పికి గాని ఏదో ఒక రూపమే గోచరమవుతుంది కాని, ధ్యానం చేసేవానికి భగవంతుని రూపాలన్నీ మనోగోచరాలు అవుతున్నాయి. అందువల్ల మనస్సు నిర్మలంగా ఉండడం ఎంతో అవసరం. నిర్మల మనస్కుడు, తాను సంకల్పించిన కార్యాల నన్నింటినీ సాధించ గలడు.

ముఖ్యంగా భగవద్ధ్యానానికీ, భక్తికీ మనోనైర్మల్యం మిక్కిలి ఆవశ్యకం ... అది లేకుండా ఎట్టి భగవత్కైంకర్యాలు జరిపించినా, అవి వట్టి భేషజాలు మాత్రమే!

పాలకుండలో...

రాధీ!'' అంటూ వెంటపడుతూంటే మొదట్లో భయపడినా అతనివల్ల ఎలాంటి అపకారం జరగదని తెలుసుకున్న జనం అంతగా పట్టించుకోలేదు.

అతను తిన్ననాడు ఇంట్లో తింటాడు. లేనినాడులేదు. ఒకరోజు ఇంటికే రాడు. అయినా ఎవరూ పట్టించుకోరు. తల్లి పట్టించుకున్నా లాభంలేదు.

రాఘవయ్య సెక్స్ బుక్స్ చదువుతూనే ఉన్నాడు.

గోవర్ధన్ విచ్చలవిడి ప్రణయం సాగించడమేగాక తరచు బ్లూ ఫిలిం ఇంటికి తెచ్చి భార్యా సమేతుడై మరీ చూస్తున్నాడు.

నిర్మాతలు పాలవంటి పసి మనసుల్లో రకరకాల విషబిందువులు చిలికించి ఆ పసివారు పతనమైపోతున్నా, తాము కోట్లకి పడగలు ఎత్తుతూనే ఉన్నారు.

* * *

దుర్గాష్టమి! విజయవాడ కనకదుర్గ గుడి ప్రాంతంలో ఇసుక వేస్తే రాలనంతటి జనం!

మెట్ల పొడవునా బారులు తీరివున్న ముష్టివాళ్ళని చూస్తూంటే "అమ్మా! భారతమాతా! వీరు కూడా నీ బిడ్డలేనమ్మా! ఎందుకు వీరి రాతలిలా ఉన్నాయి?'' అని ఎలుగెత్తి అడగాలనిపిస్తుంది.

ముష్టివారి కళ్ళలో ఆకలి ఆక్రందనలు! అవి అర్థం చేసుకునో, లేక గంపెడు పుణ్యం మూట కట్టుకోవాలనే స్వార్థంతోనో కొందరు పైసలు వారి మీదికి విసిరేస్తున్నారు.

చిరిగిపోయిన నిక్కరు, బనీను వేసుకుని బారెడు గడ్డంతో ఎముకల గూడులా ఉన్న ఒక ముష్టివాడు పట్టులంగా ఓ చేత్తో ఎత్తిపట్టుకుని మరోచేత పూలసజ్జ పట్టుకుని తల్లిదండ్రులవెనక దర్పంగా నడుస్తున్న ఓ పిల్ల చెయ్యి పట్టుకుని "రాధీ!'' అన్నాడు ఆనందంగా. అతని కళ్ళలో కోటి దివ్వెలకాంతి!

తుళ్ళిపడింది ఎదురు మెట్టు మీద కూర్చున్న మరో ఎముకలగూడు.

నిప్పులు కురిపించాడు ఆ పిల్ల తండ్రి. ఆ పిల్ల అసహ్యంగా చూసి చెయ్యి విదిల్చుకుని తల్లి చాటుకుపోయి నిల్చుంది.

"ఏరా! రాస్కెల్! ఆ పిల్ల గాజులు కాజేద్దామనుకున్నావా?'' మెట్ల మొదట్లో నిల్చున కానిస్టేబుల్ దూకుడుగా వచ్చి ఆ ముష్టివాడి దవడ పగలగొట్టాడు.

కాస్సేపు అంతా నిర్ఘాంతపోయారు.

"రాధీ!...నేను!... నీ రాజుని రాధీ!'', తిరిగి ఆ పిల్ల చెయ్యి అందుకోబోయిన అతన్ని కానిస్టేబుల్ కోపంతో తన్నిన తన్నుకు లుంగలు చుట్టుకుని మెట్ల మొదట్లోకొచ్చి పడ్డాడు.

"రాజా!'' తూలుకుంటూ వచ్చింది ఆ మరో ఎముకల గూడు. ప్రాణాలు పోతున్నట్లు బాధపడుతున్న ఆ ముష్టివాడు మెల్లగా కళ్ళువిప్పి తనని పిల్చిన వ్యక్తిని చూసి కళ్ళు చిట్లించాడు.

"రాజా! ... నేను రాజా! నీ రాధిని!'' దుఃఖంతో ఆమె మాట తడబడింది. ఇంకా తన కంట కన్నీరున్నందుకు ఆమెకే ఆశ్చర్యం వేసింది.

చిత్రం! రాజు ఆమెని గుర్తించాడు!

"రాధీ!'' క్షణం అతని కళ్ళలో! జీవం వచ్చింది

"రాజా !" అతని ఒడిలోకి ఒరిగిపోయింది మూటనాలుగు జ్వరంతో, కాసిని టీ నీళ్లయినా లేక అలాగే ఆ లైన్‌లో కూర్చుని అడుక్కుంటున్న లక్షాధికారి ఏకైక పుత్రిక అయిన రాధిక !

"ఏమిటీ న్యూసెన్స్ ?" విసుక్కున్నారు భక్తులు.

"లేరా ! వెధవా ! మీక్కూడా ప్రేమలేనట్టా ?...అందుకే ఇలా తగలడింది దేశం!" తన విట్టుకు తనే పగలబడి నవ్వాడు కానిస్టేబుల్.

"పాపం !" అనుకున్నారు కొందరాడవాళ్లు.

"లేవండి !" మరోసారి గర్జించి లాటీతో ఒకరి కౌగిల్లో ఒకరు ఒదిగినట్లున్న రాజా రాధికల్ని చెరోటీ తగిలించాడు కానిస్టేబుల్.

వారు కదల్లేదు !

తను తన్నిన తన్నుకు అతనూ, తిండిలేక

పొలకుండలో...

జ్వర తీవ్రత చేత ... హఠాత్తుగా అయిన వాళ్లని చూసి తట్టుకోలేక ఆమె ప్రాణాలు కోల్పోయారని తెలియని కానిస్టేబుల్ మరోసారి బూటు కాలితో బలంగా తన్నాడు.

ఆ తన్నుకు ఇద్దరూ వెల్లకిల పడ్డారు. పరిస్థితి గమనించిన అతనో క్షణం తెల్లబోయాడు. వెంటనే తేరుకుని జనాన్ని అదుపులోకి తీసుకురావాలన్నట్టు మరికొంత మంది బలగాన్ని రప్పించి ఆ రెండు శవాల్ని మున్సిపాలిటీ బండిలో చేర్పించి, తమ డిపార్ట్మెంట్ ఎంత చురుగ్గా పని చెయ్యగలదో నిరూపించాడు.

ప్రకృతి మౌనంగా రోదించింది!

కనకదుర్గమ్మ తృళ్లిపడింది!

ఒక్కబొట్టు కన్నీరు విడవడానికైనా అప్పులు లేని ఆ ప్రేమికుల్ని చూసి కృష్ణవేణమ్మ అల్లాడిపోయింది!

"మా ఈ చావుకు కారకులెవరు?

పసివారి ఎదుట విచ్చలవిడి ప్రణయం సాగించి వారిలో వింతకోరికలు జనించడానికి కారకులైన ఆ పెద్దలదా? వెధవ పుస్తకాలు అంటూనే వాటిని అద్దెకి తెచ్చి చదివి తాత్కాలికపు ఉద్రేకం పొంది ఆనందించే రాఘవయ్యలాంటి వారిదా? కాక అలాంటి పుస్తకాలని సంఘంలో నిషేధించలేని ప్రభుత్వానిదా? లోకం ఏమైతేనేం తమకు నాలుగు డబ్బులు రాలేతే చాలు! అనుకుని అడ్డమైన అశ్లీలతలను సినిమాల్లో ఇరికించి, అమాయకులైన పసివార్ని పతనం చేసే ఆ నిర్మాతలదా? అదీగాక తన మనుమరాలు వయసున్న ఓ పసిపాపని, ఓ విడీవిడని మొగ్గని అమానుషంగా నలిపి రాక్షస ప్రవృత్తిగా ఆనందించడమేగాక, ఆ పిల్లల్నే అయిన కొడికి అమ్మి డబ్బు చేసుకుని చేతులు కడుక్కున్న ఆ పెద్దమనిషిదా? కాక అధికార బలంతో ముందు, వెనకా చూడకుండా దిక్కులేని అమాయక ప్రాణాల్ని బూటుకాలితో తన్నిన పోలీసుదా?

ఎవరిది తప్పు?... ఎవరు కారకులు?

ఎవరు? ఎవరు? ఎవరు?"

అని నిలదీస్తున్నట్టు ఆవేశంగా ప్రశ్నిస్తున్నట్టు ఉన్న ఆ అభాగ్యుల శవాలని చూసి జవాబు తోచని కనకదుర్గమ్మవారు మామూలుగా, ఓ సామాన్య ప్రేక్షకురాలిలా చూస్తూండిపోయింది.

హైదరాబాదు నోట్‌బుక్

ఆస్థాన పండితుల జీతనాతాలు :

రాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలు వుండేవి. నేటి మన రాష్ట్ర ప్రభుత్వాస్థానంలో ఏకాదశ రుద్రులలాగ ఏకాదశ ఆస్థాన దిగ్గజాలున్నాయి. శ్రీ అంజయ్య తన ముఖ్యమంత్రి పదవి చివరినాడు నియమించిన మరి కొందరు ఆస్థాన కవులను తర్వాత ప్రభుత్వం ఆదరించలేదని, ఉత్తరువులే అందలేదని ఒకరు వాపోయారు. ఇప్పటి పదకొండుమంది ఆస్థాన విద్వాంసుల పదవీకాలం యావజ్జీవమా, లేక ఐదేండ్లా అన్న విషయాన్ని పరిశీలించి నిర్ణయించడానికి ఒక ఉపసంఘాన్ని నియమించినట్లు ముఖ్యమంత్రి శ్రీ భవనం వెంకటరాం ఆగస్టు 6 వ తేదీన విధానసభ ప్రశ్న సమయంలో శ్రీ కె. సత్యనారాయణ, ఎం. వోంకార్, శ్రీమతి మల్లు స్వరాజ్యం ప్రశ్నలకు సమాధాన మిచ్చారు. ప్రతిపక్ష సభ్యులు, నాయకులు ఆస్థాన విద్వాంసుల నియామకం మధ్యయుగాల రాచరికపు సంప్రదాయాన్ని పునరుద్ధరించడమేనని తీవ్రంగా విమర్శించారు. ఇందిరాకాంగ్రెస్ సభ్యుడు శ్రీ అక్కిరాజు వాసుదేవరావు "ఆస్థాన బ్రహ్మలను నియమించరాదా ?" అని ప్రశ్నించారు. సమర్థులయిన హరిజనులను ఆస్థాన విద్వాంసులుగా నియమించాలని శ్రీ కె. వెంకటయ్య కోరారు. సాంస్కృతిక శాఖా మంత్రి శ్రీ బి. రామకృష్ణంరాజు సమాధానం చెబుతూ కొత్తగా ఆస్థాన విద్వాంసులను నియమించే ప్రస్తావనలేదని అన్నారు. ప్రస్తుతం ఉన్నవారు ఆయా రంగాలలో నిష్ణాతులని మంత్రి తెలుపుతూ వారి వివరాలిచ్చారు. డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు—తెలుగు ఆస్థాన కవి, డాక్టర్ ఈమని శంకరశాస్త్రి— ఆస్థాన వైణికులు, డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ—ఆస్థాన గాయక సార్వభౌములు, శ్రీ అజాయాకూబీ సైయద్ అబ్దుల్ ఖదీం—ఆస్థాన ఉరుదూ కవి—డాక్టర్ నటరాజ రామకృష్ణ, ఆస్థాన నాట్యాచార్యులు, శ్రీ పీసపాటి నరసింహమూర్తి—ఆస్థాన నటశేఖరులు, శ్రీ ఎల్లా వేంకటేశ్వరరావు — ఆస్థాన మృదంగ విద్వాంసులు—శ్రీ అజీజ్ అహమద్‌ఖాన్‌వార్సీ—ఆస్థాన ఉర్దూ కవాలి గాయకులు, శ్రీ ఉప్పులూరి గణపతిశాస్త్రి—ఆస్థాన వేద విద్వాంసులు, శ్రీ పి. టి. రెడ్డి— ఆస్థాన చిత్రకారులు, శ్రీమతి ఎం. ఎస్. సుబ్బులక్ష్మి— ఆస్థాన సంగీత విదుషీమణి శ్రీమతి సుబ్బులక్ష్మి ఎలాటి ప్రతిఫలాన్ని అంగీకరించలేదు. డాక్టర్ ఈమని శంకరశాస్త్రికి, డాక్టర్ బాల మురళీకృష్ణకు నెలకు వేయి రూపాయల గౌరవ వేతనం, తక్కిన వారికి వేయి రూపాయల గౌరవవేతనం, మరొక వేయి రూపాయలు అటెండరు, డ్రైవరు జీతాలు, కారు అలవెన్సు, టెలిఫోను ఖర్చుల కోసమూను, వీరందరి ఖర్చు నెలకు 18వేల రూపాయలు. ఇంతమందిని నియమించే అధికారం ప్రభుత్వానికిలేదని జనతా నాయకుడు శ్రీ జైపాల్ రెడ్డి, ప్రపంచంలో ఎక్కడా ఇంతమంది ఆస్థాన విద్వాంసుల నియామకంలేదని శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు, ఇంతమందిని నియమించే అధికారం ప్రభుత్వానికి లేదని భారతీయ జనతా నాయకుడు శ్రీ ఎం. వెంకయ్యనాయుడు విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంటు సభ్యుల పదవీకాల పరిమితిలాగ ఈ ఆస్థాన విద్వత్పదవికీ కాల పరిమితి ఉంటే, చాలమంది నిపుణులకు అవకాశం ఉండగలదని చాలమంది అభిప్రాయం.

సంయుక్తా పాణిగ్రాహి అపూర్వ నృత్యం :

సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు రాజాభయ్యా పూంఛ్‌వాలా శతజయంతి సందర్భంగా ఆగస్టు 12, 13, 14 తేదీలలో రవీంద్రభారతిలో జరిగిన ఉత్సవాలలో చివరిరోజుల శ్రీమతి సంయుక్తా పాణిగ్రాహి ఒడిస్సీనృత్యంలో తన అపూర్వ ప్రతిభను చాటారు. మొదట ఆమె అభినయించబోయే అంశాన్ని ఆరగ్లంలో అభినయ పూర్వకంగా సంగ్రహంగా చెప్పి, పిదప నృత్యంచేయడంవల్ల ప్రేక్షకులు ఎక్కువగా ఆనందించడానికి అవకాశం కలిగింది. ఆమె అష్టపదులను గొప్పగా అభినయించారు. మోక్షనృత్యం అపూర్వంగా వుంది. తులసీదాసు రామాయణం ఆధారంగా అభినయించిన సీతాపహరణ ఖండికలో ఆమె సీతా, రామ, లక్ష్మణ, రావణ, స్వర్ణమృగ, జటాయువుల పాత్రలను అనిదంపూర్వంగా అభినయించారు. ఒరిస్సా వారి మృదంగంలోనే ఏదో ఇంద్రజాలం వుంది. ఒక మృదంగ వాదకుడు పదిమంది మదంకారులు వాయిస్తున్నారన్న భ్రమకలిగిస్తాడు. ఆ సాంకేతికత ఏమిటో తెలుగువారు హస్తగతంచేసుకోవాలి. శ్రీమతి సంయుక్తా పాణిగ్రాహి భర్త శ్రీ రఘునాథ పాణిగ్రాహి, ఒకప్పుడు తెలుగు, చలనచిత్రాలలో నేపథ్య గాయకుడు. గొప్పశారీరం కలవారు. తెలుగు వారికి ఆయన ఎందుకు దూరమయ్యారో ! తన సతీమణి నృత్యకార్యక్రమానికి ఆయనే ఆచార్యత్వం వహిస్తున్నారు. ఆంధ్ర నర్తకీమణులు శ్రీమతి పాణిగ్రాహి శరీర సౌష్ఠవ సంరక్షణ రహస్యాన్నికూడా ఆకళింపు చేసుకోవాలి.

ఉపశ్రుతి :

ఫలానా నటునికి స్మారకసభ ఏర్పాటు చేశాము. తమరు రావాలి. అని ఆహ్వానించారు ఒకరు నన్ను. స్మారకసభ ఏమిటి? సన్మానసభకదా! అన్నారు ఒకరు. అపస్మారకసభ అంటే బాగుంటుంది అన్నారు మరొకరు. ఎందుకు ? అనడిగాను. సన్మానానికి ముందే అభిమానులు సేకరించిన డబ్బు బయానాగాపుచ్చుకొని, తాగేసి, స్మృహతప్పి పడున్నాడట ! అన్నారు ఆయన.

—తిరుమల రామచంద్ర



హైదరాబాదులోని శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన 'నాగానిక' నవల ఆవిష్కరణ సందర్భంగా రచయిత డా. ముదిగొండ శివప్రసాద్ నుండి కృతిని స్వీకరిస్తున్న ఆచార్య బి. రామరాజు; ముఖ్యఅతిథి సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ బి. రామకృష్ణంరాజుగార్లని చిత్రంలో చూడవచ్చు.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎమ్. ఎస్. కె. — తుణుకు

భోజనం చేసేటప్పుడు, పడుకున్నప్పుడు బొట్టు పెట్ట కూడదంటా రెందుకు?

చాదస్తానికి వెతికితే రీజన్ దొరుకుతుంది. తింటున్నప్పుడు అన్నంలోను, పడుకున్నప్పుడు కళ్ళల్లోను కుంకంపడే ప్రమాదం వుంది కదా!

పి. కె. డి. — గురజనాపల్లి

అన్నా చెల్లి కలిసి వెడుతూంటే చూసి చెడ్డగా భావించి డైలాగులు విసిరే వాళ్లని ఏమనాలి ?

పట్టించుకోకూడదు. మేం అన్నా చెల్లెళ్లం అని బోర్డు కట్టుకు నడిచినా—అనే వాళ్ళు అంటారు. లోకం నోరు మూయించే బదులు మీరు అన్నా చెల్లెళ్లే అయినప్పుడు ఎవరేం అనుకుంటేనేం—అని సాగిపోవాలి.

ఎస్. ఆర్. — ఆకునూరు

ప్రేమించి పెళ్లి చేసుకోడంలో గొప్ప థ్రిల్ వుంటుందని నేను, పెళ్లి చేసుకొని ప్రేమించడమే థ్రిల్ అని నా ఫ్రెండు పందెం వేసుకొన్నాం.

ఇంకేం? ఒకళ్లలాగ ఇంకొకళ్లిలాగా పెళ్లాడి నిరూపించుకోండి! లేకపోతే ఏమిటి ? ఆడపిల్లలకి ప్రేమ థ్రిల్లూ, పెళ్లి థ్రిల్లూ, సీరియల్ చదవడం థ్రిల్లూ కుట్లూ, వంటా థ్రిల్లూ. శ్రీవారి థ్రిల్లూ తప్పించి—ఇంకేం వుండవా?!

ప్రియ — గుంటూరు

కార్టూనులు గీయాలని, కథలు రాయాలని ఉంటుంది. కాని అంతకుముందే ఎవరేనా వేశారేమో — రాశారేమో. కాపీ అంటారేమో! అని అనుమానంగా వుంటుంది. ఎలా ?

ఎలాగేమిటి? రాశాకో గీశాకో పాటకులే చెప్తారు అసలు సంగతులు. ధైర్యంగా నీటిలోకి ఉరక్కపోతే యీత ఎప్పటికీ రాదు.

ఎమ్. ఏ. వి. — రాజమండ్రి

నాకు పెళ్లయి మూడేళ్లయింది. రెండేళ్ల నుంచి పుట్టింట్లో వుంటున్నాను. 'నాకునువ్వంటే యిష్టంలేదు. నేను నీతో కాపురం చేయను' అని యింట్లోంచి వెళ్లగొట్టాడు నా భర్త. 'నాకు మీతో తెగ తెంపులు చేసుకోవడం యిష్టంలేదు. మీరు మనసు మార్చుకున్నాక రావడానికి నాకేం అభ్యంతరం లేదంటున్నాను.

వెల్ సెడ్! మై డియర్. భారత స్త్రీ వోర్పు గొడ్డు గాడిదల వోర్పు కంటే ఎక్కువదే. మీ వోర్పుకి ఫలితం దక్కుతుంది— వారే విడాకులకు వేస్తే మీకు లాభం. అలాగే వుండండి.

కె. జి. — కర్నూలు

ఒక అబ్బాయిని ప్రేమించాను. ఇంట్లో ఒప్పుకోవటం లేదు.....

సీతాకోక చిలుక చూసి వుంటారు! అబ్బాయి ఒడున్నాయి కాకపోతే మీకు మైనారిటీ రావడమే కాదు—బ్రతకగల మార్గం కూడా వుంటే—పెళ్లి చేసుకోండి. లేచిపోతే— వూరంతా ఆదుకుంటుందని అనుకోకండి!

శేఖర్. — తిరుపతి

ప్రకృతి మానవుని ఋతువులను పట్టి బాధిస్తుంది. స్త్రీ మగవానిని ప్రతిక్షణం ఏదోరకంగా బాధిస్తుంది. ఇది ధర్మమా ?


ఏది ధర్మం ? ఏదిన్యాయం ? అని అడిగే రోజులా యివి శేఖర్‌బాబూ !—విశ్వ విద్యాలయాల కాంపౌండ్‌లలోనే ఆడపిల్లలని ఆట పట్టించి పరువు తీస్తున్న రోజులివి ....ఇంత జ్ఞానోదయం కల్గిన మీ జాతి 'దుష్టులకు దూరంగా' వుండమన్న మాట పట్టించుకోదేం ? స్త్రీకి దూరంగా వుండి కష్టాలు తప్పించుకోండి .....

శోభ. — రేణిగుంట

నేను ఎక్కువ చదువుకున్నదాన్ని కాదు. అయినా మనిషి చనిపోయాక చేసే కర్మక్రతువులపై తద్దినాలపై నాకు నమ్మకంలేదు. నా మరణాంతరం కర్మ క్రతువులు జరగకూడదని చెప్పాలంటే నేనేం చెయ్యాలి ?

అలా అని వీలు రాసి పెట్టిన వారికే—తప్పడం లేదు—సోదరీ....చచ్చిపోయే దాకానే మనమీద మన అధికారం. చచ్చిపోయిన వాళ్లమాటమీద గౌరవం వున్నవాళ్ళు కోరిక నెరవేరుస్తారు. లేనివాళ్లు తమ ఇష్టాయిష్టాలు నెరవేర్చుకుంటారు.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna



ఇప్పుడు! ప్రపంచ ప్రసిద్ధమైన పసిమిఛాయ రహస్యం ఇండియాలో!

క్లియర్-టోన్

ప్రత్యేక దినుసు చర్మానికి తేటను, పసిమిఛాయను తెస్తుంది-ప్రకృతి సిద్ధంగా.

శాస్త్రీయమైన సూత్రం మచ్చల్నీ, కళంకాల్నీ తొలగిస్తుంది.



మేలైన సూర్యకవచం చర్మం నల్లబడటాన్ని అరికట్టుతుంది.

సమృద్ధిగా చెమ్మనిచ్చే పదార్థం చర్మాన్ని మృదువుగా చేస్తుంది.

పరిపూర్ణమైన పసిమిఛాయ క్రీం

ప్రపంచమంతటా వివిధ దేశాలలో లక్షలాది సుందరులు క్రమం తప్పకుండా వాడుతున్నారు, **క్లియర్-టోన్**.

అంతర్జాతీయ ఔషధ శాస్త్రపరిశోధనా ఫలితమైన ఈ శాస్త్రబద్ధమైన పసిమిఛాయ సూత్రీకరణను నికొలాస్ లాబరేటరీస్ ఇండియా లిమిటెడ్ వారు మీకందిస్తున్నారు.

అంతర్జాతీయ స్వీకరణ పొందిన సూత్రం **క్లియర్-టోన్** మీ చర్మానికి తేటను పసిమిఛాయను తెచ్చేందుకు. ఇండియాలో లభించే మరే యితర క్రీంలోనూ లేని ఒక ప్రత్యేక దినుసు కలిగి ఉంది.

క్లియర్-టోన్ క్రీం మీ చర్మానికి మరింత పసిమిఛాయను తెచ్చేందుకు, మచ్చల్నీ కళంకాల్నీ తొలగించేందుకు ప్రకృతి సిద్ధంగా పనిచేస్తుంది. అందులోని శాస్త్రీయ సూత్రీకరణ హాని కలిగించే అల్ట్రావయొలెట్ కిరణాల నుండి మీకు రక్షణ కలిగించి, మీ చర్మం నల్లబడటాన్ని అరికట్టుతుంది. అంతేకాదు, **క్లియర్-టోన్** మీ చర్మాని కవసరమైన చెమ్మను అతి సున్నితమైన పద్ధతిలో ఇస్తుంది. ఆతేడామీకై మీరే చూడండి. **క్లియర్-టోన్** క్రమం తప్పకుండా వాడండి, మరి 6 వారాల్లో దాని ఫలితాల్ని చూసి వళ్లు పులకరించి పొండి.



పసిమిఛాయ రహస్యం-ప్రకృతి సిద్ధంగా **క్లియర్-టోన్**

లండన్. పారిస్. న్యూయార్క్.

daCunha/NICL/3/81-TL